www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 20-6-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 65

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, బహుళ పక్షం; తిథి: నవమి ఉ.9.50 తదుపరి దశమి; నక్షత్రం: రేవతి రా.9.45 తదుపరి అశ్వని; వర్జ్యం: ఉ.10.31-12.00; దుర్ముహూర్తం: ఉ.8.21-9.14, మ.12.42-1.35; అమృతఘడియలు: రా.7.30-9.00; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.48 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సిట్‌కు సహకరించని ప్రభాకర్‌రావు!

ట్యాపింగ్ కేసులో 9 గంటల పాటు ప్రశ్నించినా సరైన జవాబులివ్వని ఎస్ఐబీ మాజీ చీఫ్

సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్న సిట్! 14

అరెస్టు వద్దంటూ ప్రభాకర్‌రావుకు ఇచ్చిన ఉపశమనాన్ని రద్దు చేయాలని కోరే అవకాశం

మళ్లీ నేడు విచారణకు రావాలని ఆదేశం



దేవరకద్ర పరిధిలోని చౌదర్‌పల్లి శివారులో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్రలో బ్రహ్మోస్ తయారీ యూనిట్!

దేవరకద్ర, జూన్ 19: మహబూబ్‌నగర్ జిల్లాలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ఏర్పాటు కానుంది. దేవరకద్ర మునిసిపాలిటీ పరిధిలోని చౌదర్‌పల్లి, బస్వాయపల్లి గ్రామాల శివారులో ఈ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, బ్రహ్మోస్ ఏరోస్పేస్ చీఫ్ జయ తీర్థ ఆర్ జోషి, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఈడీ సాంబశివప్రసాద్ స్థలాన్ని గురువారం పరిశీలించారు. యూనిట్‌తో పాటు, అనుబంధ సంస్థల ఏర్పాటుకు 400 ఎకరాల స్థలం కావాలని జోషి తెలిపారు. యూనిట్ ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే చెప్పారు.



పరిమిత ఎత్తు దాటితే కూల్చివేతే!

ఎయిర్‌పోర్టుల సమీపంలోని భవనాలు నిబంధనలకు లోబడి ఉండాలి

ఇప్పటికే ఉన్న నిర్మాణాలకు పరిహారం.. కేంద్రం ముసాయిదా రూల్స్

21 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ 2

చిన్నారుల నగ్న వీడియోలు చూస్తున్న 15 మంది అరెస్టు

ఆన్‌లైన్‌లో చూడడంతోపాటు ఇతరులకూ షేరింగ్

నిందితులంతా విద్యాధికులే.. వారిలో ఐఐటీ పట్టభద్రుడూ..

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అరెస్టు చేసిన పోలీసులు

అరెస్టయిన వారంతా 19 నుంచి 50 ఏళ్ల లోపువారే..

చైల్డ్ పోర్న్ వెతకడం, ఫార్వార్డ్ చేయడం నేరం 14

సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికా గోయల్

బనకచర్లను అడ్డుకోండి

తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఆ ప్రాజెక్టు ప్రతిపాదన

జీడబ్ల్యూడీటీ, పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ఏపీ సర్కారు

అపెక్స్ కౌన్సిల్ అనుమతీ పొందలేదు.. ఇది తీవ్ర అభ్యంతరకరం

బనకచర్ల బదులు ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధానంపై చర్చకు సిద్ధం

గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలకు మాకు ఎన్వోసీ కావాలి

పాలమూరు, సమ్మక్క, తుమ్మిడిహెట్టిలకు అన్ని అనుమతులూ ఇవ్వండి

ఏపీ ప్రాజెక్టులకు సత్వరమే అనుమతులిస్తూ మాపై అలసత్వం సరికాదు

కేంద్రం వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు

రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడం.. అవసరమైతే సుప్రీం కోర్టుకు

జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ స్పష్టీకరణ

అతి త్వరలో అపెక్స్ కౌన్సిల్ భేటీ.. పాటిల్ హామీ ఇచ్చారన్న ఉత్తమ్

న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్టును తిరస్కరించాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్ - 1980 (జీడబ్ల్యూడీటీ), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం - 2014కు విరుద్ధంగా ఏపీ సర్కారు వ్యవహరిస్తోందని తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీతోపాటు ఇతర ఉన్నతాధికారులతో రేవంత్, ఉత్తమ్ గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక, పర్యావరణ శాఖలు వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని చెప్పారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టును ప్రతిపాదిస్తున్నామని ఏపీ చెబుతోందని, కానీ, జీడబ్ల్యూడీటీ - 1980లో

మిగతా 13వ పేజీలో...

మెట్రో ఫేజ్-2 అనుమతులు ఇప్పించండి 13

కేంద్రంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు సిద్ధం.. ఖట్టర్‌కు రేవంత్ విజ్ఞప్తి



టోనీ బ్లెయిర్, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

తెలంగాణ రైజింగ్ విజన్ అద్భుతం

రాష్ట్ర సుస్థిరాభివృద్ధి దిశగా రేవంత్ రెడ్డి ప్రణాళిక


సీఎంపై బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసలు

ఫ్యూచర్ సిటీ, స్కిల్స్, స్పోర్ట్స్ వర్సిటీలపై ఆసక్తి

లెటర్ ఆఫ్ ఇంటెంట్ మార్చుకున్న తెలంగాణ, టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్

న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణ రైజింగ్ - 2047' విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని కొనియాడారు. యూకేకు ఆయన 1997 - 2007 మధ్య పదేళ్లపాటు ప్రధానిగా పనిచేశారు. ఇంగ్లండ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. రాజకీయాల నుంచి తప్పుకొన్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహ రచన.. వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో 'టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టీబీఐజీసీ) స్థాపించారు. ఇందులో భాగంగా, ప్రస్తుతం భారత

మిగతా 13వ పేజీలో...



మనం మనం తిట్టుకుంటే దాన్ని రాజకీయం చేయాలని చూసేవాళ్లు చాలామంది ఉన్నారు. గోదావరిలో చాలా నీళ్లు ఉన్నాయి. ఎవరి ఓపికను బట్టి వారు వాడుకోవచ్చు. 3000 టీఎంసీల నీరు ఏటా సముద్రంలో కలుస్తోంది.

- ఏపీ సీఎం చంద్రబాబు

గోదావరిపై ప్రాజెక్టులు కట్టి

నీళ్లు తీసుకోండి

మిగిలిన నీటినే మేం వాడుకుంటాం.. సముద్రంలో కలిసే నీటితోనే ప్రాజెక్టుల నిర్మాణం

ఎవరికీ నష్టం లేదు.. రాద్ధాంతం ఎందుకు?.. సమస్యలు సృష్టించుకోవడం ఎందుకు?

ఎవరి శక్తి మేరకు వాళ్లం ప్రాజెక్టులు కట్టుకుందాం.. దీనిపై పోరాటాలు అనవసరం

తెలంగాణపై నేను ఎప్పుడైనా గొడవ పడ్డానా!?.. కాళేశ్వరం ప్రాజెక్టుకూ అడ్డు చెప్పలేదు

తెలుగు రాష్ట్రాలు నంబర్ వన్‌గా ఉండాలి.. బనకచర్ల వివాదంపై ఏపీ సీఎం చంద్రబాబు

ఇరు రాష్ట్రాలకు ఆమోదయోగ్యంగా పరిష్కరించుకుందామని సూచన

బనకచర్లకు రేవంత్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుంది!

నదీ జలాలు మీ అయ్య జాగీరా?

రాష్ట్ర హక్కులు బాబుకు రాసిస్తే.. ప్రజలు ఊరుకోరు 12

బాబును అడుక్కునే బుద్ధి పోవట్లేదు

అర్థం లేని వ్యాఖ్యలు చేస్తున్న సీఎంను ఉరి తీసినా తప్పులేదు

బీఆర్ఎస్ నేత హరీశ్ విమర్శలు

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): "ఏపీ, తెలంగాణ.. ఎవరి శక్తి మేరకు వాళ్లం గోదావరి నదిపై ప్రాజెక్టులు కట్టుకుందాం. దానిపై మీరూ ప్రాజెక్టులు కట్టి నీళ్లు తీసుకోండి. ఎవరు వద్దన్నారు. మిగిలిన నీటినే మేం వాడుకుంటామని చెబుతున్నా. ఎవరూ ఎవరిపైనా పోరాడాల్సిన అవసరం లేదు. కూర్చుని మాట్లాడుకుంటే సమస్యలు పరిష్కారమవుతాయి" అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీనిపై పోరాటాలు అవసరం లేదని, తెలంగాణపై తాను ఎప్పుడైనా గొడవ పడ్డానా!? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టుకున్నప్పుడు కూడా తాను అడ్డు చెప్పలేదని గుర్తు చేశారు. మనం గొడవ పడుతున్నామంటే ప్రజలను మభ్యపెట్టడమేనని, మోసం చేయడమేనని, దానివల్ల రెండు రాష్ట్రాల ప్రజలకు ఉపయోగం లేదని చెప్పారు. అమరావతిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బనకచర్ల ప్రాజెక్టుపై ఆసక్తికర

మిగతా 13వ పేజీలో...



ఇంగ్లిష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజొస్తుంది

స్థానిక భాషలతోనే భారతీయ సంస్కృతికి గుర్తింపు 2

ఆంగ్లం.. వలసవాద బానిసత్వానికి చిహ్నం

కొన్నాళ్లకు ప్రజలే తిరస్కరిస్తారు: అమిత్‌షా



మోదీ, మునీర్ వల్లే యుద్ధం ఆగింది!

వారిద్దరూ చాలా తెలివైన వ్యక్తులు

ఆపకుంటే భారత్-పాకిస్థాన్ ఘర్షణ అణుయుద్ధానికి దారి తీసి ఉండేది

వారిద్దరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా

ఇరాన్ గురించి పాక్‌కు తెలుసు: ట్రంప్

వైట్‌హౌస్‌లో మునీర్‌కు విందు ఇచ్చిన అమెరికా అధ్యక్షుడు

ట్రంప్‌నకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని మునీర్ ప్రతిపాదన! 2



ఇరాన్ దాడితో ఇజ్రాయెల్‌లోని సొరొకా ఆస్పత్రి నుంచి పొగలు వెలువడుతున్న దృశ్యం



ఇజ్రాయెల్ క్షిపణులతో పూర్తిగా ధ్వంసమైన ఇరాన్ ప్రభుత్వ మీడియా ప్రధాన కార్యాలయం

భీకర యుద్ధం..!

ఇజ్రాయెల్ ఆస్పత్రి, స్టాక్ ఎక్స్ఛేంజ్ భవనాలపై ఇరాన్ క్షిపణులు

టెల్‌అవీవ్ శివార్లలో నష్టం.. ఒక్కరోజే 200 మందికి పైగా క్షతగాత్రులు

ఇరాన్‌లోని అరాక్ భారజల ప్లాంట్‌పై ఇజ్రాయెల్ దాడులు

నటాంజ్ అణుకేంద్రంపైనా.. ఇరాన్ క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్‌పై సైబర్ దాడి

రూ. 785 కోట్లు కొల్లగొట్టిన ఇజ్రాయెల్ హ్యాకర్లు

మిల్లీమీటర్ దూరంలో అణు విధ్వంసం.. రష్యా హెచ్చరిక

ఇరాన్ దాడి భయంతో పశ్చిమాసియాలో అమెరికా వెనక్కి: రాయిటర్స్

టెహ్రాన్ నుంచి భారత్‌కు 110 మంది విద్యార్థులు

టెల్‌అవీవ్/టెహ్రాన్/న్యూఢిల్లీ, జూన్ 19: ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం భీకరంగా మారుతోంది. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం కడపటి వార్తలందేవరకు ఇరు దేశాల్లో యుద్ధ నష్టాలతో బీభత్సం కనిపించింది. ఇజ్రాయెల్‌లోని మౌలిక సదుపాయాలే టార్గెట్‌గా ఇరాన్.. అణు కార్యక్రమాలు, క్షిపణి యూనిట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ పరస్పరం క్షిపణి దాడులు జరిపాయి. ఇరాన్ జరిపిన దాడుల్లో ఇజ్రాయెల్‌లోని బీర్షెబాలో ఉన్న అతిపెద్ద(వెయ్యి పడకలు) ఆస్పత్రి సోరొకా

మిగతా 2వ పేజీలో...



ఇరాన్‌లోని టెహ్రాన్ నుంచి సురక్షితంగా తిరిగొచ్చిన భారతీయ విద్యార్థిని

రప్పారప్పా నరుకుతానంటే మంచిదేకదా!

- టీడీపీ నుంచి మారి మన అభిమానస్తుడయ్యాడు
- టీడీపీ వాళ్ల తల నరుకుతానంటున్నాడు
- 'పుష్ప' సినిమా డైలాగ్ చెప్పినా తప్పేనా!
- మనం ఏ ప్రపంచంలో ఉన్నాం సామీ!
- 'నరుకుడు భాష'కు వైసీపీ అధినేత జగన్ సమర్థన



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): "మన అభిమానస్తుడై... నెక్ట్స్ టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ వాళ్లను రప్పా రప్పా.. ఏం జాతరమ్మా అది, ఆ గంగమ్మ జాతరలో! ఏంటమ్మా అది, పొట్టేలు తల నరికినట్టు.. రప్పారప్పా నరుకుతానన్నాడు! మంచిదే కదా!" అని వైసీపీ అధ్యక్షుడు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హర్షం, సంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన ఏపీలోని తాడేపల్లి నివాస ప్రాంగణంలో వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఎప్పట్లాగే ఎంపిక చేసుకున్న మీడియా ప్రతినిధులతో సుదీర్ఘంగా మాట్లాడారు. తన సత్తెనపల్లి పర్యటనలో వైసీపీ కార్యకర్త ఒకరు '2029లో వైసీపీ వచ్చిన వెంటనే గంగమ్మ జాతరలో పొట్టేలు తల నరికినట్లుగా రప్పారప్పా నరుకుతాం ఒక్కొక్కడిని' అని ప్లకార్డులు ప్రదర్శించడంపై అడిగిన ప్రశ్నను

మిగతా 14వ పేజీలో...

జస్టిస్ వర్మ ఇంటి ప్రాంగణంలో.. నోట్ల కట్టలు నిజమే

- కనీసం 10 మంది ప్రత్యక్ష సాక్షులు చెప్పారు
- జడ్జి ఇంట్లో ఎవరో నోట్లకట్టలు పెట్టడం అసాధ్యం
- జస్టిస్ వర్మ అవినీతి నిజమేనని రుజువైంది
- 64 పేజీల నివేదికలో త్రిసభ్య కమిటీ వెల్లడి 2



విదేశీ విద్యార్థులకు మళ్లీ వీసాలు

ప్రక్రియ పునఃప్రారంభిస్తున్నామన్న అమెరికా 2

సోషల్ మీడియా ఖాతాలను అన్ లాక్ చేయాలని కండిషన్



ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ నేపథ్యంలో

గోదాములు, చౌకడిపోల్లో లక్ష టన్నులు

భద్రపరచిన సరుకు విలువ రూ.420 కోట్లు

14 టెండర్ల నిర్వహణపై దృష్టిపెట్టని ప్రభుత్వం

అలాగే వదిలేస్తే పౌర సరఫరాల సంస్థకు నష్టం

విదేశీ విద్యార్థులకు మళ్లీ వీసాలు

» ప్రక్రియ పునఃప్రారంభిస్తున్నామన్న అమెరికా

వాషింగ్టన్, జూన్ 19: గత నెలలో నిలిపివేసిన విదేశీ విద్యార్థుల వీసా దరఖాస్తు ప్రక్రియను పునఃప్రారంభిస్తున్నట్లు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ప్రకటించింది. అయితే ప్రభుత్వ పరిశీలన కోసం వారి సోషల్ మీడియా ఖాతాలను అన్‌లాక్ చేసి ఉంచాలని షరతు విధించింది. ఆ సోషల్ మీడియా ఖాతాల్లో అమెరికాకు, తమ ప్రభుత్వానికి, సంస్కృతికి, సంస్థలకు వ్యతిరేకంగా ఏమైనా పోస్టులు ఉంటే వాటిని కాన్సులర్ అధికారులు పరిశీలిస్తారని స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది. సోషల్ మీడియా ఖాతాలను పబ్లిక్‌లో ఉంచకపోయినా, పరిశీలనకు అనుమతించకపోయినా వారి దరఖాస్తులను తిరస్కరిస్తామని పునరుద్ఘాటించింది. కాగా, విదేశీ విద్యార్థుల వీసా ఇంటర్వ్యూ ప్రక్రియను ట్రంప్ ప్రభుత్వం గత నెలలో తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో కార్యకలాపాలను పరిశీలించే ఉద్దేశంతో ఆ ప్రక్రియను సస్పెండ్ చేసింది. ఇప్పుడు తిరిగి ప్రారంభిస్తున్నామన్న ప్రకటనతో దీని కోసం ఎదురుచూస్తున్న విదేశీ విద్యార్థులకు ఊరట లభించింది.

ఇంటెల్‌లో 10వేల మంది ఉద్యోగుల తొలగింపు

న్యూఢిల్లీ, జూన్ 19: సెమీకండక్టర్ తయారీ దిగ్గజం ఇంటెల్ భారీగా ఉద్యోగులను తొలగించడానికి రంగం సిద్ధం చేస్తోంది. వచ్చే నెలలో ఇంటెల్ ఫౌండ్రీ విభాగంలో 15-20శాతం మంది ఉద్యోగులకు లేఆఫ్ ప్రకటించనుంది. అంటే ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది ఉద్యోగులను ఇళ్లకు పంపనుంది. ఎలాంటి పరిహారం, ప్రయోజనాలను ఇవ్వకుండానే ఉద్యోగులను తొలగించనుంది. బాధాకరమే అయినప్పటికీ సంస్థ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఇంటెల్ మాన్యుఫ్యాక్చరింగ్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ నాగ చంద్రశేఖరన్ ఉద్యోగులకు పంపిన ఇంటర్నల్ మెమోలో పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పదిచోట్ల ఉన్న 15 వేఫర్ ఫ్యాబ్రికేషన్ ప్లాంట్లపై ఈ ప్రభావం ఉంటుంది.

పరిమిత ఎత్తు దాటితే కూల్చివేతే!

» ఎయిర్‌పోర్టుల సమీపంలోని భవనాలు నిబంధనలకు లోబడి ఉండాలి.. కేంద్రం ముసాయిదా జారీ

న్యూఢిల్లీ, జూన్ 19: ఎయిర్‌పోర్టుల చుట్టూ విమాన కార్యకలాపాలకు అంతరాయం కలిగించే భవనాలు, చెట్లు వంటి అడ్డంకుల నియంత్రణ, తొలగింపుపై కేంద్రప్రభుత్వం ముసాయిదా జారీచేసింది. భారతీయ వాయుయాన్ అధినియం-2024 కింద ఈ 'ది డ్రాఫ్ట్ ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్ (భవనాలు, చెట్ల వల్ల కలిగే అడ్డంకులను కూల్చివేయడం)'ను విడుదల చేసింది. వీటిపై 21రోజులపాటు ప్రజల అభిప్రాయాల సేకరించనుంది. ఎయిర్‌క్రాఫ్ట్ (అడ్డంకుల కూల్చివేత) రూల్స్-1994 స్థానంలో కొత్త నియమాలను తీసుకురావాలనే ఉద్దేశంతో కేంద్రం తాజా ప్రతిపాదనలు చేసింది. ప్రభుత్వ నోటిఫికేషన్లలో పేర్కొన్న ఎత్తు సంబంధిత పరిమితులను ఉల్లంఘించిన ఏ నిర్మాణంపై అయినా పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) చర్యలు తీసుకొనే అధికారాన్ని కొత్త నిబంధనలు కల్పిస్తున్నాయి. రూల్స్‌ను పాటించని సందర్భాల్లో.. విమానాశ్రయం ఆఫీస్ ఇన్‌చార్జి నుంచి అందిన నివేదిక మేరకు అనధికార నిర్మాణాల కూల్చివేత, ఎత్తు తగ్గింపు ప్రక్రియను అమలు చేసే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుంది. బాధిత వ్యక్తులు సంబంధిత అధికారుల వద్ద అప్పీల్ చేసుకొనే అవకాశాన్ని కూడా కల్పించారు. అప్పీల్‌పై 60రోజుల్లోగా తుది తీర్పు ఇవ్వాల్సి ఉంటుంది.

ఎయిరిండియా విమానం బ్లాక్‌బాక్స్ అమెరికాకు!

అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ విమాన బ్లాక్‌బాక్స్‌లోని డేటా విశ్లేషణకు కేంద్రం దానిని అమెరికాకు పంపనుంది. ప్రమాద సమయంలో రికార్డర్ బయటి భాగం తీవ్రంగా దెబ్బతినడంతో అందులోని సమాచారాన్ని సేకరణ దర్యాప్తు బృందాలకు కష్టంగా మారింది. దీంతో దాన్ని వాషింగ్టన్‌లోని నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్‌టీఎస్‌బీ)కు చెందిన ప్రయోగశాలకు పంపనున్నారు.

ఎయిరిండియా అంతర్జాతీయ సర్వీసులు తాత్కాలిక తగ్గింపు

అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదంతో తీవ్ర ఒత్తిడిలో ఉన్న ఎయిరిండియా సంస్థ.. తాను నడిపే పలు అంతర్జాతీయ సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేసింది. అలాగే 16 అంతర్జాతీయ మార్గాల్లో సర్వీసులను తగ్గించింది. సుదూర ప్రాంతాలకు వెళ్లే బోయింగ్ 747వంటి భారీ విమానాల వాడకాన్ని జూలై 21దాకా 15శాతం తగ్గిస్తున్నట్టు గురువారం ప్రకటించింది. కాగా 130 మంది ప్రయాణికులతో గురువారం ఢిల్లీ నుంచి వియత్నాం బయలుదేరిన ఎయిరిండియా ఎయిర్‌బస్ ఏ320 నియో విమానం టేకాఫ్ అయిన కాసేపటికే సాంకేతిక సమస్యలతో తిరిగి ఢిల్లీలో ల్యాండయ్యింది. ఢిల్లీ నుంచి లేహ్‌కు బయలుదేరిన ఇండిగో విమానం సాంకేతిక సమస్యలతో ఢిల్లీకి తిరిగివచ్చింది.

ఖలిస్థానీలు తీవ్రవాదులే : కెనడా

ఒట్టావా, జూన్ 19: తమ భూభాగం నుంచి ఖలిస్థానీ తీవ్రవాదులు కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని కెనడాలోని అత్యున్నతస్థాయి నిఘా సంస్థ తొలిసారి అంగీకరించింది. భారత్‌లో వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేందుకు, హింసాత్మక కార్యకలాపాలకు కుట్ర పన్నేందుకు, నిధులు సమీకరించేందుకు ఖలిస్థానీలు కెనడా భూభాగాన్ని వాడుకుంటున్నారని భారతదేశం ఎప్పటినుంచో చెబుతోంది. ఇదే విషయాన్ని తాజాగా కెనడా పార్లమెంటుకు సమర్పించిన వార్షిక నివేదికలో సీఎస్ఐఎస్(కెనడియన్ సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ సర్వీస్) నిర్ధారించింది. 'భారత్‌లో హింసాత్మక చర్యలకు కుట్రలు పన్నేందుకు, నిధులు సమీకరించేందుకు, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించేందుకు ఖలిస్థానీ తీవ్రవాదులు కెనడా భూభాగాన్ని వాడుకుంటూనే ఉన్నారు' అని ఆ నివేదికలో సీఎస్ఐఎస్ స్పష్టం చేసింది.

పుట్టిన రోజున మారిన రాహుల్ చిరునామా

న్యూఢిల్లీ, జూన్ 19: లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తన 55వ పుట్టిన రోజున చిరునామా మార్చారు. న్యూఢిల్లీ సునెహ్రీ బాగ్ రోడ్‌లో ప్రభుత్వం ఆయనకు కేటాయించిన బంగ్లా నంబర్5లోకి సామాన్ల తరలింపు ప్రారంభమైంది. ఎంపీగా ఎన్నికైనప్పటినుంచి రాహుల్ 12 తుగ్లక్ లేన్‌లో ఉండేవారు. ఇంతకాలం ఆయన తన తల్లి సోనియాకు చెందిన 10 జన్‌పథ్ నివాసంలో ఉన్నా రు. కొంతకాలం క్రితమే సునెహ్రీ బాగ్ రోడ్‌లోని బంగ్లా నంబర్ 5ను కేటాయించారు. కాగా, పుట్టినరోజు సందర్భంగా రాహుల్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పలువురు కాంగ్రెస్ సీనియర్ నేతలు, తమిళనాడు సీఎం స్టాలిన్, ఆర్జేడీ అధినేతల లాలూ, పలువురు ఇండియా బ్లాక్ నేతలు, ఇతర పార్టీల నేతలు రాహుల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్పత్రి నుంచి సోనియా గాంధీ డిశ్చార్జ్

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆమె ఉదర సంబంధిత సమస్యతో బాధపడుతూ 4 రోజులుగా ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు.

స్పేస్ ఎక్స్ స్టార్‌షిప్‌లో పేలుడు

టెక్సాస్, జూన్ 19: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. టెక్సాస్‌లో నిలిపి ఉన్న స్టార్‌షిప్ వాహనం ఇంజన్‌కు బుధవారం రొటీన్‌గా తనిఖీలు చేస్తుండగా అది పేలింది. తనిఖీల్లో భాగంగా ఎప్పుడూ జరిపే ఫైర్ టెస్ట్‌ను నిర్వహించగా అనూహ్యంగా ఇంజన్ పేలింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇందుకుగల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

గాలి అనర్హత ఆదేశాలు రద్దు

» శాసనసభ సభ్యత్వం పునరుద్ధరణ

బెంగళూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం ఇనుప గనుల అక్రమ తవ్వకాల కేసులో గాలి జనార్దన్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఉపశమనం లభించడంతో ఆయన శాసనసభ సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. గనుల కేసును విచారించిన హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం.. మే నెలలో గాలి జనార్దన్ రెడ్డికి ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో మే 6న గాలి జనార్దనరెడ్డి శాసన సభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. అసెంబ్లీలో ఒక స్థానం తగ్గినట్టు కూడా ప్రకటించారు. సీబీఐ కోర్టు తీర్పుపై గాలి జనార్దనరెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేయడంతో పాటు ఈ దశలో ఏడేళ్ల జైలుశిక్ష అవసరం లేదని అభిప్రాయపడింది. దీంతో అనర్హత ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు శాసనసభా వ్యవహారాల కార్యదర్శి విశాలాక్షి బుధవారం ప్రకటించారు.

మోదీ, మునీర్‌ల వల్లే

యుద్ధం ఆగింది!



భారత్, పాక్‌లతో అమెరికా వాణిజ్య ఒప్పందాలపై కసరత్తు జరుపుతున్నాం

» ప్రస్తుత పరిస్థితుల పట్ల మునీర్ నా అభిప్రాయాలతో ఏకీభవించారు: ట్రంప్
» లాడెన్‌కు పాక్ ఆశ్రయం ఇచ్చిన విషయం అమెరికన్లు మర్చిపోవద్దు
» కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ హెచ్చరిక

న్యూయార్క్/ఇస్లామాబాద్, జూన్ 19: భారత్-పాకిస్థాన్‌ల మధ్య గత నెలలో జరిగిన యుద్ధాన్ని తానే ఆపానంటూ పదే పదే చెప్పుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా మాట మార్చారు. భారత్, పాకిస్థాన్‌లకు చెందిన ఇద్దరు చాలా తెలివైన నాయకుల వల్లనే ఆ యుద్ధం నిలిచిందని, లేకపోతే అది అణుయుద్ధంగా మారి ఉండేదని తెలిపారు. ప్రధాని మోదీ, పాక్ సైన్యాధిపతి అసిమ్ మునీర్‌లను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌లో అసిమ్ మునీర్‌కు విందు ఇచ్చిన అనంతరం ట్రంప్ మీడియాతో మాట్లాడారు. 'భారత్‌తో యుద్ధాన్ని కొనసాగించకుండా ముగించినందుకు కృతజ్ఞతలు చెప్పటం కోసమే అసిమ్ మునీర్‌ను వైట్‌హౌస్‌కు విందుకు ఆహ్వానించాను. భారత ప్రధాని నరేంద్రమోదీకి కూడా కృతజ్ఞతలు తెలుపుతున్నా. భారత్, పాక్.. రెండూ పెద్ద దేశాలు. అణ్వాయుధ దేశాలు. యుద్ధం కొనసాగి ఉంటే అణుయుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉండేది. కానీ, ఇద్దరు చాలా తెలివైన వ్యక్తులు దానిని నివారించారు. అది నాకు ఎంతో సంతోషం కలిగించింది. ఇరు దేశాలతోనూ అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనుంది. దీనికోసం కసరత్తు జరుగుతోంది' అని పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా తలెత్తిన పరిస్థితుపై అసిమ్ మునీర్‌తో చర్చించానని ట్రంప్ వెల్లడించారు. ఇరాన్ గురించి పాకిస్థాన్‌కు చాలా దేశాల కంటే ఎక్కువగానే తెలుసని, (ఇరాన్ పట్ల) వారేమీ సంతృప్తిగా లేరని, ఇజ్రాయెల్ పట్ల వ్యతిరేకతతోనూ లేరన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితులపై మునీర్ తనతో ఏకీభవించారని తెలిపారు. కాగా, ఇరాన్ మీద అమెరికా కూడా దాడికి దిగబోతోందనీ.. దాంట్లో భాగంగా పాక్‌లోని సైనిక స్థావరాలను ఉపయోగించుకోవటానికే మునీర్‌తో ట్రంప్ సమావేశమయ్యారన్న విశ్లేషణలు వెలువడ్డాయి. ట్రంప్‌తో మునీర్ భేటీపై పాక్ సైన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇరుదేశాలకూ దీర్ఘకాలికంగా పరస్పర ప్రయోజనం కలిగించే వాణిజ్య భాగస్వామ్య ఒప్పందానికి ట్రంప్ ఆసక్తి చూపారని ఆ ప్రకటన వెల్లడించింది. వాణిజ్యం, ఆర్థికాభివృద్ధి, గనులు, ఖనిజాలు, కృత్రిమమేధ, విద్యుత్తు, క్రిప్టోకరెన్సీ, కొత్త టెక్నాలజీలు తదితర రంగాల్లో పాకిస్థాన్-అమెరికా సహకారాన్ని మరింత బలోపేతం చేయటమే లక్ష్యంగా చర్చలు జరిగాయని పేర్కొంది. కాగా, భారత్-పాకిస్థాన్ మధ్య అణుయుద్ధం తలెత్తకుండా ట్రంప్ అడ్డుకున్నారని, ఆయనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని అసిమ్ మునీర్ పేర్కొన్నట్లుగా వార్తలు వెలువడ్డాయి. అమెరికా అధ్యక్షుడు ఒక దేశ సైన్యాధిపతికి వైట్‌హౌస్‌లో విందు ఇవ్వటం చాలా అరుదు. గతంలో పాక్ సైన్యాధిపతులు అయూబ్‌ఖాన్, జియాఉల్‌హక్, పర్వేజ్‌ముషారఫ్ ఈ తరహా ఆహ్వానాలు అందుకున్నప్పటికీ.. వారు ఆయా సమయాల్లో పాక్ సైన్యాధిపతిగానేగాక ఆ దేశ అధ్యక్షులుగా కూడా ఉన్నారు.

సోషల్ మీడియాలో మీమ్‌లు

వైట్‌హౌస్‌లో ట్రంప్-మునీర్ భేటీపై సోషల్ మీడియాలో పలు మీమ్‌లు వెలువడ్డాయి. 'బిర్యానీతో ప్రపంచ శాంతికి యత్నం' అంటూ వీరిద్దరి ఫొటోలు షేర్ చేస్తూ కొందరు కామెంట్ పెట్టారు. 'సమయం వచ్చినప్పుడు ఇరాన్‌కు పాకిస్థాన్ వెన్నుపోటు పొడిచేలా ప్రేరేపించే లక్ష్యంతోనే మునీర్‌కు ట్రంప్ ఫ్రీ లంచ్ ఇచ్చాడు' అంటూ మరికొందరు ఎద్దేవా చేశారు. త్రీ ఇడియట్స్, రిష్తే తదితర సినిమాల్లోని వీడియో క్లిప్‌లను ఎడిట్ చేస్తూ మరికొందరు కామెంట్లు పెట్టారు. కాగా, మునీర్‌తో ట్రంప్ భేటీని ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్.. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఉగ్రదాడికి సూత్రధారి అయిన బిన్‌లాడెన్‌ను చివరి వరకూ పాకిస్థాన్ తమ దేశంలోనే దాచిపెట్టిందన్న విషయాన్ని అమెరికన్లు మర్చిపోవద్దని హెచ్చరించారు.

లోకం తీరు



హోర్ముజ్ జలసంధిని మూసేస్తాం

» మరోమారు హెచ్చరించిన ఇరాన్
» మూసేస్తే భారత్‌కూ చిక్కులు
» పెట్రో ధరలు పెరిగే అవకాశం

టెహ్రాన్, జూన్ 19: ఇజ్రాయెల్‌తో యుద్ధ వేళ ప్రపంచ చమురు సరఫరాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని ఇరాన్ మరోసారి బెదిరించింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్స్ కోర్ సీనియర్ కమాండర్, ఎంపీ సర్దార్ ఇస్మాయిల్ కౌసరి దీన్ని ధ్రువీకరించారు. ఇజ్రాయెల్-అమెరికా తమపై దాడి చేస్తే ఈ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ గతంలోనే హెచ్చరించింది. తాజాగా ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరడంతో ఇరాన్ అన్నంత పనీ చేస్తుందా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం-ఇరాన్ మధ్య ఉన్న ఇరుకైన ఈ జలసంధిలో ఓ చోట వె డల్పు కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. చమురు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ఇరాక్, సౌదీ అరేబియా, ఇరాన్, యూఏఈ, ఒమన్ దేశాల నౌకలు రాకపోకలు సాగించేది హోర్ముజ్ జలసంధి గుండానే. ఆయా దేశాల నుంచి చైనా, భారత్, జపాన్, కొరియా దేశాల చమురు, ఎల్ఎన్‌జీ దిగుమతులకు ఇదే ప్రధాన ఆధారం. ప్రపంచవ్యాప్తంగా నిత్యం వినియోగించే చమురులో 20%, సహజవాయువులో 25% పర్షియన్ గల్ఫ్ నుంచి ఈ జలసంధి గుండానే ప్రయాణిస్తుంది. ఈ నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే భారత్‌కు కూడా తిప్పలు తప్పవు. ఎందుకంటే మన ముడి చమురు అవసరాల్లో 90 శాతం, గ్యాస్ అవసరాల్లో 50 శాతానికి దిగుమతులే దిక్కు. మన చమురు దిగుమతుల్లో ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, యూఏఈల వాటా సగం వరకు ఉంటుంది. ఇరాన్ హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే ఈ సరఫరాలకు తీవ్ర విఘాతం తప్పదు. పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.

ఇంగ్లిష్ మాట్లాడేవారు సిగ్గుపడే రోజొస్తుంది

» స్థానిక భాషలతోనే భారతీయ సంస్కృతికి గుర్తింపు: అమిత్‌షా

న్యూఢిల్లీ, జూన్ 19: ఆంగ్ల భాష మాట్లాడేవారు సిగ్గుపడే రోజు వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆ భాష వలసవాద బానిసత్వానికి చిహ్నమని తెలిపారు. కొన్నాళ్లకు ప్రజలే దానిని తిరస్కరిస్తారని కూడా వ్యాఖ్యానించారు. స్థానిక భాషలతోనే భారతీయ సంస్కృతి, వారసత్వాలకు గుర్తింపు అని.. విదేశీ భాషల స్థానాన్ని అవి ఆక్రమించాలని ఆకాంక్షించారు. హిందీని బలవంతంగా రుద్దడాన్ని, నూతన విద్యావిధానం (ఎన్ఈపీ)లో త్రిభాషా సూత్రాన్ని (స్థానిక భాష, ఆంగ్లం, హిందీ) తమిళనాడులోని డీఎంకే సహా కొన్ని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. గురువారం ఢిల్లీలో ఐఏఎస్ అధికారి అశుతోష్ అగ్నిహోత్రి రచించిన 'మై బూంద్ హూ.. ఖుద్ సాగర్ హూ(నేను నీటి బిందువునే కాదు.. సముద్రాన్ని కూడా)' అనే పుస్తకాన్ని అమిత్‌షా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్థానిక భారతీయ భాషలు దేశం గుర్తింపునకు కీలకమన్నారు. ఆంగ్లం మాట్లాడేవారు త్వరలోనే సిగ్గుపడే పరిస్థితి వస్తుందని.. అలాంటి సమాజం రావడం ఎంతో దూరంలో లేదని తెలిపారు. ఆంగ్లం వలసవాద బానిసత్వానికి చిహ్నమని ప్రపంచవ్యాప్తంగా అందరూ భావించి దానిని తిరస్కరిస్తారని జోస్యం చెప్పారు. మన దేశాన్ని, సంస్కృతిని, చరిత్రను, మతాన్ని అర్థం చేసుకోవడానికి ఏ విదేశీ భాషా చాలదన్నారు. అసమగ్ర విదేశీ భాషలతో 'సంపూర్ణ భారతం' అనే భావనను ఊహించలేమని ఆయన చెప్పారు.

క్యూఎస్ ర్యాంకుల్లో భారత్ వర్సిటీల జోరు

» జాబితాలో 54 విద్యాసంస్థలతో రికార్డు

న్యూఢిల్లీ, జూన్ 19: ప్రపంచ యూనివర్సిటీల ర్యాంకింగ్స్‌లో మన దేశ విద్యాసంస్థలు సత్తాచాటాయి. గ్లోబల్ స్థాయి విద్యాసంస్థలకు దీటుగా నిలిచాయి. తాజాగా విడుదలైన క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్-2026 జాబితాలో రికార్డు స్థాయిలో 54 మన విద్యాసంస్థలు స్థానం సంపాదించాయి. ఈ జాబితాలో ఎక్కువ విద్యాసంస్థలు ఉన్న దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో నిలవడం విశేషం. మన కంటే ముందు 192 సంస్థలతో అమెరికా, 90 ఇన్‌స్టిట్యూట్స్‌తో యూకే, 72 సంస్థలతో మెయిన్‌ల్యాండ్ చైనా ఉన్నాయి. గత ఏడాది 46 భారత విద్యాసంస్థలకు ఈ జాబితాలో చోటు దక్కింది. వీటిలో సుమారు సగం ఇన్‌స్టిట్యూట్‌లు ఈ ఏడాది తమ స్థానాలను మెరుగుపర్చుకున్నాయి. కొత్తగా ఎక్కువ వర్సిటీలకు స్థానం దక్కిన దేశాల్లో ఈ ఏడాది భారత్ ముందు వరసలో ఉంది. ఇక మన దేశ సంస్థల్లో ఐఐటీ ఢిల్లీ రెండేళ్ల క్రితం కంటే 70 స్థానాలు మెరుగుపర్చుకుని 123వ స్థానం సాధించింది. ఐఐటీ బాంబే మాత్రం గత ఏడాది 118వ ర్యాంకు నుంచి.. ఈసారి 129వ స్థానానికి పడిపోయింది. ఐఐటీ మద్రాస్ 47 స్థానాలు ఎగబాకి 180వ స్థానం పొందింది. ఢిల్లీ యూనివర్సిటీ 328వ ర్యాంకును నిలబెట్టుకుంది. జేఎన్‌యూ తన ర్యాంకును మెరుగుపర్చుకుని 558వ స్థానం పొందింది. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ఓవరాల్ ర్యాంకింగ్‌లో 801-850 మధ్య నిలిచింది. సైటేషన్స్ పర్ ఫ్యాకల్టీ విభాగంలో 335 స్థానాన్ని దక్కించుకుంది. క్యూఎస్ ర్యాంకుల పట్ల ప్రధాని మోదీ ఎక్స్‌లో స్పందిస్తూ.. దేశంలో విద్యారంగానికి ఇదో గొప్ప శుభవార్త అని చెప్పారు.

జస్టిస్ వర్మ ఇంటి వద్ద నోట్ల కట్టలు నిజమే

» 10 మంది ప్రత్యక్ష సాక్షులు చెప్పారు
» ఆ స్టోర్ రూమ్‌పై నియంత్రణ జస్టిస్ వర్మ, ఆయన కుటుంబసభ్యులకే ఉంది
» డబ్బు గురించి రాయొద్దని ఫైర్ సిబ్బందిని జడ్జి వ్యక్తిగత కార్యదర్శి ఆదేశించారు
» త్రిసభ్య కమిటీ 64 పేజీల నివేదిక

న్యూఢిల్లీ, జూన్ 19: జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటి ప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో పెద్ద మొత్తంలో నోట్లకట్టలు ఉన్నది నిజమేనని.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నియమించిన త్రిసభ్య కమిటీ తేల్చింది. కాలిన నోట్ల కట్టలు దొరికిన ఆ స్టోర్ రూమ్.. జస్టిస్ వర్మ, ఆయన కుటుంబసభ్యుల పరోక్ష/ప్రత్యక్ష పర్యవేక్షణలోనే ఉండేదని... అనుమతి లేకుండా ఆ గదిలోకి బయటివ్యక్తులు రావడానికి అవకాశం లేదని స్పష్టం చేసింది. ఈ ఏడాది మార్చి 14న రాత్రి ప్రమాదం జరిగితే.. 15వ తేదీ తెల్లవారుజామున ఆ గదిలోంచి సగం కాలిన నోట్లను తొలగించారనడానికి ఆధారాలున్నాయని పేర్కొంది. మంటలు ఆర్పేవారికి ఆరోజు కనిపించినవి చిన్న నోట్లు కావని, ఆ సొమ్ము చిన్నమొత్తం కాదని.. జస్టిస్ వర్మ లేదా ఆయన కుటుంబసభ్యుల ప్రత్యక్ష, పరోక్ష అంగీకారం లేకుండా ఆ గదిలో ఎవరూ పెట్టలేరని తెలిపింది. ఆయన్ను విధుల నుంచి తొలగించడానికి అవసరమైన అన్ని ఆధారాలూ ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం అలహాబాద్ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ యశ్వంత్‌వర్మ.. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న సమయంలో.. ఈ ఏడాది మార్చి 14న ఆయన నివాస ప్రాంగణంలోని ఒక స్టోర్‌రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఆ గదిలో కాలిన నోట్ల కట్టల తాలూకూ ఫొటోలు అప్పట్లో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం కావడంతో.. ముగ్గురు సిటింగ్ జడ్జిలతో సుప్రీం సీజే విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. విచారణలో భాగంగా ఈ ప్యానెల్.. 55 మంది సాక్షులను ప్రశ్నించింది. జస్టిస్ వర్మ వాంగ్మూలాన్ని నమోదు చేసింది. విచారణలో తేలిన అంశాలతో 64 పేజీల నివేదికను ఈ ఏడాది మే 4వ తేదీనే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించింది. అందులోని పలు అంశాలు ఇప్పటిదాకా బయటకు వచ్చాయి. ఇప్పుడు పూర్తిస్థాయి నివేదిక ప్రజాబాహుళ్యానికి అందుబాటులోకి వచ్చింది.



నివేదికలో ఏముందంటే..

కనీసం 10 మంది సాక్షులు ఆ గదిలో సగం కాలిన నోట్లను తాము చూసినట్టు తెలిపినట్టు కమిటీ తన నివేదికలో వెల్లడించింది. "నేను లోపలికి వెళ్లగానే.. గదిలో కుడివైపు, ఎదురుగా పెద్ద ఎత్తున రూ.500 నోట్ల కట్టలు నేల మీద పడిఉన్నాయి. అంత పెద్ద ఎత్తున నోట్ల కట్టలు నేలపై పడి ఉండడం చూసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. అలా చూడ్డం నా జీవితంలోనే అదే మొదటిసారి" అని ఒక సాక్షి చెప్పిన వివరాలను నివేదికలో పొందుపరిచింది. అలాగే.. ప్రమాదస్థలిని శుభ్రం చేయడం, ఆధారాలను ధ్వంసం చేయడంలో జస్టిస్ వర్మ వ్యక్తిగత కార్యదర్శి రాజీందర్ సింగ్ కార్కి, ఆయన కుమార్తె దియా వర్మ పాత్రపైనా త్రిసభ్య కమిటీ విచారణ జరిపింది. గదిలో ఉన్న కరెన్సీ నోట్ల గురించి రిపోర్టులో రాయొద్దని రాజీందర్ సింగ్ కార్కి తమతో చెప్పినట్టు.. మంటలు ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక శాఖ సిబ్బంది త్రిసభ్య కమిటీకి వెల్లడించారు. ఒకవేళ ఇది తనపై పన్నిన కుట్రగా జస్టిస్ వర్మ భావించి ఉంటే.. ఆయన వెంటనే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు ఎందుకు చేయలేదని, ఢిల్లీ హైకోర్టు సీజే దృష్టికిగానీ, సీజేఐ దృష్టికిగానీ ఎందుకు తేలేదని ప్రశ్నించింది. ఐదుగురు సెక్యూరిటీ గార్డులు నిరంతరం కాపలా కాసే సిట్టింగ్ జడ్జి ఇంటి ప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో ఎవరో వచ్చి నోట్ల కట్టలు పెట్టడం అసాధ్యమని స్పష్టం చేసింది.

ఆ వ్యాఖ్యలు అగ్నిమాపక శాఖ అధికారివే..

మంటలు ఆర్పడానికి వెళ్లిన అగ్నిమాపక సిబ్బంది అక్కడ తీసిన వీడియోలో.. 'మహాత్మాగాంధీ మే ఆగ్ లగ్‌రహాహై (మహాత్ముడి బొమ్మ ఉన్న నోట్లు కాలిపోతున్నాయని దీని భావం)' అనే వ్యాఖ్యలు వినిపించాయని, ఆ వ్యాఖ్యలు చేసింది ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ స్టేషన్ ఆఫీసర్ మనోజ్ మెహ్లావత్ అని కమిటీ తన నివేదికలో తెలిపింది. ఈ కేసులో.. అందుబాటులో ఉన్న ప్రత్యక్ష, ఎలక్ట్రానిక్ ఆధారాలను బట్టి.. జస్టిస్ వర్మపై ఆరోపణలకు తగు ఆధారాలు ఉన్నట్టు విశ్వసిస్తున్నామని.. ఆయన దుర్వర్తన రుజువైందని పేర్కొంది. ఆయన్ను విధుల నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టేందుకు ఈ ఆధారాలు సరిపోతాయని పేర్కొంది.

నాది కాదు..

తన నివాసప్రాంగణంలోని స్టోర్ రూమ్‌లో తగలబడ్డ నోట్ల కట్టలు వెలుగుచూసినప్పటికీ.. వాటితో తనకు ఏ సంబంధమూ లేదని జస్టిస్ వర్మ దీనిపై విచారణ జరిపిన త్రిసభ్య ప్యానెల్‌కు తెలిపారు. స్టోర్ రూమ్‌లోకి నోట్ల కట్టలు ఎలా వచ్చాయి? మార్చి 15 తెల్లవారుజామున ఆ గదిలోంచి సగం కాలిన నోట్లను ఎవరు తీశారు? అంటూ త్రిసభ్య కమిటీ అడిగిన ప్రశ్నలకు జస్టిస్ వర్మ 101 పేజీల సమాధానం ఇచ్చారు. స్టోర్ రూమ్‌లో ఉన్నట్టుగా చెబుతున్న నగదు అక్కడికి రావడంలో తన పాత్ర ఏమీ లేదని పేర్కొన్నారు. అక్కడున్న సీసీ కెమెరాలు పనిచేయకపోతే అది తన తప్పు కాదన్నారు. నిజానికి ఆ కెమెరాలు ప్రమాదానికి ముందు బాగానే పనిచేశాయని.. పోలీసులు వాటిని తీసే క్రమంలో పాడై ఉంటాయని పేర్కొన్నారు. అయితే, ఆయన వాదనను త్రిసభ్య కమిటీ తోసిపుచ్చింది. పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకునేలోపు ఆ డేటాను భద్రపరిచేందుకు తగిన సమయం జస్టిస్ వర్మకు ఉందని స్పష్టం చేసింది.

భీకర యుద్ధం..!

(మొదటిపేజీ తరువాయి)

దెబ్బతింది. బుధవారం ఈ ఆస్పత్రిలోని ఒక భాగం(సర్జికల్ బ్లాక్)లో ఉన్న రోగులను ఇజ్రాయెల్ ప్రభుత్వం వేరే బ్లాకుకు తరలించింది. సరిగ్గా ఖాళీ చేసిన బ్లాక్‌పై ఇరాన్ క్షిపణులు పడ్డట్లు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) వెల్లడించింది. ఈ ఆస్పత్రిలో 45 మంది గాయాలపాలవ్వగా.. వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన దాడుల్లో క్షతగాత్రుల సంఖ్య 200లకు పైగా ఉన్నట్లు వివరించింది. ఆస్పత్రి సమీపంలోని ఓ పాఠశాల, టెల్‌అవీవ్‌లోని ఇజ్రాయెల్ స్టాక్ ఎక్స్‌చేంజ్ భవనంపైనా ఇరాన్ దాడులు జరిగాయి. జనావాసాలను ఇరాన్ టార్గెట్‌గా చేసుకోవడంతో.. ఇజ్రాయెల్ ప్రతిదాడి చేపట్టింది. అరాక్ భారజల రియాక్టర్ ప్రాంగణంలో పనిచేసే కార్మికులు, పరిసరాల్లో ఉండే పౌరులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలంటూ పర్షియా భాషలో ఐడీఎఫ్ హెచ్చరికలు జారీ చేసింది. గంట తర్వాత ఇజ్రాయెల్ వైమానిక దళం భారజల రియాక్టర్‌పై విరుచుకుపడింది.

టెల్‌అవీవ్‌కు భారీ నష్టం

బుధవారం అర్ధరాత్రి నుంచి ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో టెల్‌అవీవ్‌కు భారీ నష్టం జరిగింది. "గురువారం ఉదయం వరకు ఇరాన్ 30 బాలిస్టిక్ క్షిపణులు, 17 యూఏవీలను ప్రయోగించింది. వాటిల్లో ఒక క్షిపణి క్లస్టర్‌బాంబులను జారవిడిచింది. టెల్‌అవీవ్‌లోని జనావాసాలనే ఇరాన్ టార్గెట్‌గా చేసుకుంటోంది. ఈ భూమ్మీద బతకడానికి ఖమేనీ ఏమాత్రం అర్హుడు కాడు" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ వ్యాఖ్యానించారు. జనావాసాలు, ఆస్పత్రులను టార్గెట్‌గా చేసుకుంటూ.. ఇరాన్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందంటూ మండిపడ్డారు. ఇరాన్ క్షిపణులు గుష్‌డాన్, నెగెవ్, రామత్‌గాన్, హోలోన్, టెల్‌అవీవ్ ప్రాంతాలను తాకినట్లు ఐడీఎఫ్ తెలిపింది. "సోరోకా ఆస్పత్రి, స్టాక్ ఎక్స్‌చేంజ్ భవనాలకు భారీ నష్టం సంభవించింది. టెల్‌అవీవ్, రామత్‌గన్, హోలోన్‌లో జనావాసాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. ఈ యుద్ధంలో ఇప్పటి వరకు 5 వేల మంది నిరాశ్రయులయ్యారు. క్షతగాత్రుల సంఖ్య 650కి పెరిగింది" అని వివరించింది.



ఇరాన్ క్షిపణి దాడులతో టెల్‌అవీవ్‌లో ధ్వంసమైన భవనాలు

టెహ్రాన్‌పై భీకర దాడులు

యుద్ధం ఏడోరోజైన గురువారం ఇరాన్‌లో అరాక్‌లోని భారజల రియాక్టర్ కేంద్రాన్ని, మధ్య, పశ్చిమ టెహ్రాన్‌లలోని ఆయుధ డిపోలు, క్షిపణి లాంచర్లు, ఇతర సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. కరాజ్‌లో వైమానిక స్థావరాలపైనా దాడులు జరిగినట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఇక ఇజ్రాయెల్ అనుకూల హ్యాకర్ల బృందం 'ప్రిడేటరీ స్పారో' ఇరాన్‌లోని అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎక్స్‌చేంజ్ 'నోబిటెక్స్'పై పంజా విసిరి.. రూ.785 కోట్లను కొల్లగొట్టింది. కాగా ఇరాన్‌లో 639 మంది మరణించారని, 1,329 మంది క్షతగాత్రులయ్యారని మానవ హక్కుల సంఘాలు వెల్లడించాయి. ఇరాన్‌లో మూడో రోజూ ఇంటర్నెట్ పనిచేయలేదు. యుద్ధాన్ని కవర్ చేస్తున్న జర్నలిస్టులు సైతం వెబ్ ఎడిషన్లకు అప్‌డేట్స్ ఇవ్వలేకపోయారని తెలుస్తోంది.

బుషెహర్‌లో దాడులను ఆపండి: రష్యా

ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో సైనికపరంగా జోక్యం చేసుకోవద్దని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను రష్యా డిమాండ్ చేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ నడుమ మధ్యవర్తిత్వానికి తాను సిద్ధంగా ఉన్నానని పుతిన్ పేర్కొన్నారు. అయితే ట్రంప్ దీనిపై స్పందిస్తూ.. ముందు రష్యా, ఉక్రెయిన్‌తో మధ్యవర్తిత్వం జరుపుకోవాలని.. తర్వాత దీని గురించి ఆలోచిద్దామని పుతిన్‌కు చెప్పినట్టు పేర్కొన్నారు. ఇక ఇరాన్‌పై తమ మిలటరీ దాడికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగతంగా ఆమోదం తెలిపారు. అయితే.. తుది ఉత్తర్వులను ఇంకా విడుదల చేయాల్సి ఉంది. కాగా.. బుషెహర్‌లోని ఇరాన్ అణు విద్యుత్తు కేంద్రంలో రష్యా నిపుణులు, కార్మికులు పనిచేస్తున్నారని, అక్కడ దాడులు వద్దని ఇజ్రాయెల్‌ను రష్యా డిమాండ్ చేసింది. మరోవైపు ఇరాన్ దాడి చేయవచ్చన్న అంచనాల నేపథ్యంలో అమెరికా పశ్చిమాసియాలోని తన బేస్‌లను ఇతర ప్రాంతాలకు తరలిస్తోందంటూ రాయిటర్స్ వార్తాసంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. కాగా, ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు చెందిన 18 మంది ఏజెంట్లను అరెస్టు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది.

టెహ్రాన్ నుంచి భారత్‌కు చేరిన విద్యార్థులు

ఇరాన్‌లో 10వేల మందిదాకా భారత విద్యార్థులు ఉండగా తొలివిడతలో 'ఆపరేషన్ సింధూ'లో భాగంగా 110 మంది భారత్ చేరుకున్నారు. ఇరాన్ నుంచి రోడ్డు మార్గంలో ఆర్మేనియాకు అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి చేరుకున్నారు. "గగనతలం లో క్షిపణుల వర్షం.. సైరన్ల మోత.. బాంబు పేలుళ్లు..! కళ్ల ముందే దారుణాలు జరిగాయి" అని విద్యార్థులు పేర్కొన్నారు.

మా పిల్లలు ప్రైవేటు స్కూల్‌కి రారు!

- స్కూలు బస్సులను అడ్డుకున్న సూర్యాపేట జిల్లా ఏపూరు గ్రామస్థులు
- తమ ఊళ్లోకి మళ్లీ రావొద్దని హెచ్చరించి వెనక్కి పంపిన వైనం



ఏపూరు బస్టాప్ వద్ద ప్రైవేటు పాఠశాలల బస్సులను అడ్డుకున్న గ్రామస్థులు

ఆత్మకూరు(ఎస్), జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా విద్య అందిస్తుంటే.. ప్రైవేటు పాఠశాలలు రూ.వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ సామాన్యులను ఇబ్బందికి గురి చేస్తున్నాయంటూ కొందరు తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లేందుకు తమ ఊళ్లోకి వచ్చిన ప్రైవేటు పాఠశాలల బస్సులను అడ్డగించారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపమని, గ్రామంలో మళ్లీ కనపడకూడదని హెచ్చరించి మరీ ఆ బస్సులను వెనక్కి పంపారు. ఆపై, మా పిల్లలకు మీరే చదువు చెప్పాలంటూ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులను కోరారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం ఏపూరులో గురువారం ఉదయం ఈ ఘటన జరిగింది. 3,500 మంది జనాభా ఉన్న ఏపూరులో ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. ఈ రెండు పాఠశాలల్లో 200 మంది దాకా విద్యార్థులు ఉన్నారు. గ్రామానికి చెందిన మరో 200 మంది సూర్యాపేటలోని పలుప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారు. వీరిని తీసుకెళ్లేందుకు ఆయా పాఠశాలలకు చెందిన ఆరు స్కూల్ బస్సులు నిత్యం గ్రామానికి వచ్చి వెళుతుంటాయి. అయితే, గురువారం ఉదయం 7.30 గంటలకు వచ్చిన రెండు స్కూల్ బస్సులను విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు కొందరు అడ్డగించారు. తమ గ్రామం నుంచి విద్యార్థులను తీసుకెళ్లవద్దని వారిస్తుండగానే ఆ రెండు బస్సులు వారిని దాటుకుని వెళ్లిపోయాయి. కాసేపటికి మరో నాలుగు బస్సులు రాగా గ్రామ ప్రజలు వాటిని అడ్డగించి అక్కడే నిలిపేశారు. ప్రైవేటు పాఠశాలలకు చెందిన బస్సులు ఇకపై తమ గ్రామానికి రావొద్దని హెచ్చరించారు. దీంతో బస్సుల్లోని విద్యార్థుల్లో కొందరు ఇంటికి వెళ్లిపోగా, మరికొందరు తల్లిదండ్రుల సాయంతో ప్రైవేటు పాఠశాలకు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రభుత్వ బడు ల్లో ఉచితంగా విద్యనందిస్తున్నా మాయమాటలు చెప్పి ప్రైవేటు పాఠశాలలు వేలల్లో ఫీజులు వసూలు చేస్తూ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ధ్వజమెత్తారు. ఓ పక్క ఈ ఆందోళన కొనసాగుతుండగా.. గ్రామానికి చేరుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయులను స్థానికులు ఘటనాస్థలికి పిలిపించారు. తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలోనే చదువు చెప్పాలని ఆ ఉపాధ్యాయులను కోరారు. ఈ క్రమంలో ఏపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాసిత్, ఇతర ఉపాధ్యాయులు.. ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు స్వయంగా వెళ్లారు. పిల్లలని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో తమ పాఠశాల శతశాతం ఉత్తీర్ణత సాధించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని చెప్పారు. ఆయా విద్యార్థుల్లో ఎంతమంది ప్రైవేటును మాని ప్రభుత్వ బడి బాట పడతారో చూడాల్సి ఉంది.

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు 9,513 మంది, గురువారం 9,777 మంది హాజరయ్యారని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు.

'కోర్' ఇంజనీరింగ్ సీట్లన్నీ భర్తీ చేయాలి!

భారీ ఉద్యోగ అవకాశాలపై ప్రచారం చేయాలి.. విద్యార్థులకున్న అపోహలు తొలగించాలి

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రణాళికలు
- 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులు
- కర్ణాటకలో అమలవుతున్న విధానంపైనా అధ్యయనం



హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ మాత్రమే అన్న భావన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పెరిగిపోతోంది. అందులోనూ కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) కోసం విద్యార్థులు పోటీపడుతున్నారు. కన్వీనర్ కోటాలో రాకపోతే, యాజమాన్య కోటాలోనైనా సాధించాలని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలూ భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. అందరూ సీఎస్ఈపైనే ఆసక్తి చూపుతుండడంతో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ లాంటి కోర్ ఇంజనీరింగ్ కోర్సులు ఏటా తగ్గిపోతున్నాయి. భారీగా ఉపాధి అవకాశాలున్న ఈ కోర్సులపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన లేదన్న విషయాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి గుర్తించింది. ఈసారి కోర్ ఇంజనీరింగ్ సీట్లన్నీ భర్తీ చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని నిర్ణయించింది. కోర్ ఇంజనీరింగ్ కోర్సులను ప్రోత్సహించేందుకు కర్ణాటకలో అమలవుతున్న విధానాలనూ అధ్యయనం చేస్తోంది.

21న జేఎన్‌టీయూలో సదస్సు

త్వరలో ఎప్‌సెట్ కౌన్సెలింగ్, జూలై మొదటివారం నుంచి ప్రవేశాల ప్రక్రియ షురూ అవుతుంది. ఆలోపే కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. కోర్ ఇంజనీరింగ్ కోర్సులపై ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నారు. మొదటి సదస్సు ఈ నెల 21న జేఎన్‌టీయూలో జరగనుంది. ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డితోపాటు కోర్ ఇంజనీరింగ్ నిపుణులు ఈ సమావేశంలో పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. ఇదే తరహాలో ఈ నెలాఖరు వరకు అన్ని యూనివర్సిటీల పరిధిలో ఎప్‌సెట్ అభ్యర్థులకు అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, మైనింగ్, ఆటోమొబైల్, నిర్మాణ రంగాల్లో రాష్ట్రంలో భారీ ఉద్యోగ అవకాశాలు గురించి బాలకిష్టారెడ్డి విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. ఇటీవలే నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో భారీ ప్యాకేజీలు పొందిన కోర్ ఇంజనీరింగ్ విద్యార్థులను ఈ సదస్సుల్లో పరిచయం చేయనున్నారు.

సివిల్, ఈఈఈ, మెకానికల్‌లో ఈసారి 11 వేలే..!

గతేడాది ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా కోర్ ఇంజనీరింగ్ విభాగాల్లో దాదాపు 15 వేల సీట్లున్నాయి. ఇందులో 100 కాలేజీల్లో సివిల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 3574 సీట్లు ఉండగా 3028 (84.72%) భర్తీ అయ్యాయి. అలాగే 119 కాలేజీల్లో ఈఈఈలో 4751 సీట్లలో 3977 (83.71%), మెకానికల్‌లో 97 కాలేజీల్లోని 3385 సీట్లలో 2373 (70.10%) భర్తీ అయ్యాయి. గత ఐదేళ్లతో పోలిస్తే ఏటా ఈ కోర్సులు తగ్గుతూనే ఉన్నాయి. 2020-21లో 137 కాలేజీల్లో 27445 సీట్లుండగా 44 శాతమే భర్తీ అయ్యాయి. 2021-22లో 130 కాలేజీల్లో 26341 సీట్లుండగా కేవలం 9010 (34.21%) మాత్రమే భర్తీ అయ్యాయి. సీట్లు భారీగా మిగిలిపోవడంతో కాలేజీ యాజమాన్యాలు కోర్ కోర్సులను తగ్గిస్తున్నాయి. ఇలా 2022-23లో ఈ కోర్సుల్లో సీట్ల సంఖ్య 20992కి తగ్గింది. అప్పుడు కేవలం 6417 (30.57%) సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 2023-24లో ఈ సీట్లు 17501కి చేరగా.. అందులోనూ 6528 (37.30%) మాత్రమే భర్తీ అయ్యాయి. 2024-25లో 119 కాలేజీల్లో కోర్ ఇంజనీరింగ్‌లోని మూడు విభాగాల్లో 11710 సీట్లు ఉండగా 9378 (80.09%) భర్తీ అయ్యాయి. దీంతో రాష్ట్రం మొత్తంలో ఈసారి 11 వేల సీట్లు ఉండే అవకాశాలున్నాయి. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్న కోర్ ఇంజనీరింగ్ కోర్సులపై అవగాహన కల్పించడంతోపాటు ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయనున్నామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

కర్ణాటకలో లక్షకు పైగా 'కోర్' సీట్లు..

ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ మోజు తెలంగాణ తరహాలో గతంలో కర్ణాటకలోనూ ఉండేది. అందరూ పరిమిత ఉద్యోగ అవకాశాలున్న సీఎస్ఈపైనే ఆసక్తి చూపిస్తే.. ఇతర కోర్సులు, వాటి ఆధారంగా లభించే ఉద్యోగాలకు యువత దూరం కాకూడదన్న లక్ష్యంగా అక్కడి ప్రభుత్వం ఐదారేళ్లుగా ప్రత్యేక చర్యలు చేపట్టింది. పరిశ్రమల్లో ఉద్యోగాల ప్రాధాన్యంతోపాటు ఈ కోర్సుల్లో చేరితే ఫీజు రాయితీలు కూడా అందిస్తోంది. కర్ణాటకలో మొత్తం 217 ఇంజనీరింగ్ కాలేజీల్లో ఈ ఏడాది 135969 సీట్లు ఉండగా ఇందులో 64047 సీట్లను ప్రభుత్వం కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తుంది. అక్కడ మొత్తం సీట్లలో కేవలం 33813 (24 శాతం) మాత్రమే కంప్యూటర్ సైన్స్ ఉండగా.. కోర్ ఇంజనీరింగ్‌లో లక్షకు పైగా సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహం, ఫీజు రాయితీ, ఉపాధి అవకాశాలతో కోర్ ఇంజనీరింగ్ కోర్సులకు కర్ణాటకలో డిమాండ్ ఏర్పడింది. అక్కడి విధానాలను తెలంగాణ ఉన్నత విద్యామండలి అధ్యయనం చేస్తోంది. కోర్ కోర్సులను తొలగించవద్దని సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించిన నేపథ్యంలో ఆ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించే విషయంపైనా అధికారులు యోచిస్తున్నారు. దీనికి సంబంధించి త్వరలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు.

4 రోజులు.. రూ.6,405 కోట్లు!

- 62.47 లక్షల మంది రైతులకు నగదు బదిలీ పూర్తి
- శరవేగంగా రైతుభరోసా చెల్లింపులు

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైతువేదికల ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటించినమేరకు రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా రైతు భరోసా చెల్లింపులు చేస్తోంది. 9 రోజుల్లో రూ.9,000 కోట్లు జమచేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినమేరకు ఆర్థిక శాఖ వాయువేగంతో రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది. నాలుగు రోజుల్లోనే 62.47 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.6,405 కోట్లు జమచేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. గురువారం నాటికి ఐదెకరాల వరకు భూములున్న రైతులకు రైతుభరోసా పంపిణీ చేశారు. కోటిన్నర ఎకరాలకు ఎకరానికి రూ.6 వేల చొప్పున చెల్లించేందుకు రూ.9 వేల కోట్ల నిధులు అవసరం. జూన్‌లో రైతుభరోసా కోసం ప్రభుత్వం నిధుల సమీకరణ మొదలుపెట్టింది. రిజర్వుబ్యాంకు నుంచి కొంత అప్పుతోపాటు ఇతరత్రా ఆదాయ వనరుల ద్వారా నిధులు సమకూర్చుకుంది. ఈనెల 16న ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమ వేదిక నుంచి వానాకాలం రైతుభరోసా చెల్లింపు ప్రక్రియను ప్రారంభించారు. తొలి రోజు రెండెకరాల వరకు, రెండో రోజు మూడెకరాల వరకు, మూడో రోజు నాలుగెకరాల వరకు, నాలుగో రోజు ఐదెకరాల వరకున్న రైతులకు రైతుభరోసా చెల్లింపులు పూర్తిచేశారు. ఇప్పటివరకు 62.47 లక్షల మంది రైతులకు రూ.6,405 కోట్లు చెల్లించినట్లు వ్యవసాయశాఖ గురువారం వెల్లడించింది. రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా... కోటి ఎకరాల పైచిలుకు విస్తీర్ణానికి చెల్లింపులు పూర్తయ్యాయి. మరో 50 లక్షల ఎకరాలకు ఐదారు రోజుల్లో చెల్లింపుల ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలున్నాయి. ప్రభుత్వం ఈసారి ఎలాంటి పరిమితులు విధించడంలేదు. సాగు భూముల జాబితాలోని మొత్తం విస్తీర్ణానికి రైతుభరోసా చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించారు. అదునుచూసి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నట్లు వ్యవసాయశాఖ తెలిపింది. రికార్డుస్థాయిలో రైతుల ఖాతాల్లో నిధులు జమచేస్తున్నట్లు పేర్కొంది. కాగా ఎలాం టి పరిమితులు విధించకుండా రైతులందరికి రైతుభరోసా చెల్లిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పెట్టుబడి సాయాన్ని రైతులు వానాకాలం పంటల సాగు ఖర్చులకు వినియోగించుకోవాలని సూచించారు.

నేడు తెలుగు రాష్ట్రాల్లో నక్సల్స్ బంద్

ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ మావోయిస్టు పార్టీ పిలుపు

- కొత్తగూడెంలో 12 మంది నక్సల్స్ లొంగుబాటు

చర్ల/కొత్తగూడెం/టేకుమట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నేతలు నంబాల కేశవరావు, సుధాకర్, భాస్కర్ ఎన్‌కౌంటర్లను నిరసిస్తూ తెలంగాణ మావోయిస్టు పార్టీ శుక్రవారం తెలుగు రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ మేరకు కొద్దిరోజుల క్రితమే జగన్ పేరుతో ఓ లేఖను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్-ఏపీ సరిహద్దుల్లో కేంద్ర బలగాలు పహారా కాస్తున్నాయి. మరోవైపు.. మావోయిస్టు పార్టీలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న 12 మంది దళసభ్యులు గురువారం భద్రాద్రికొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ ఎదుట లొంగిపోయారు. ఎస్పీ తక్షణ సహాయం కింద వారికి రూ.25 వేల చొప్పున నగదును అందజేశారు. కాగా, ఏపీలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన భూపాలపల్లి జిల్లా వెలిశాల గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి మృతదేహం కోసం కుటుంబ సభ్యులు ఏపీలోని రంపచోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. గురువారం రవి మృతదేహాన్ని చూపించకపోవడంతో కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు గురువారం సాయంత్రం రవి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు చూపించి పోస్టుమార్టానికి తరలించినట్లు సమాచారం. శుక్రవారం ఉదయం వెలిశాలలో రవి అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మునీర్ ముచ్చట్లు

పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు ఆసీమ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎర్రతివాచీ పరిచి, కడుపునిండా భోజనం పెట్టడం, మనకు సరే, పాకిస్థాన్ మేధావులకు సైతం ఆశ్చర్యం కలిగించింది. ఈ భేటీకోసమే ట్రంప్ తన జీ7 పర్యటనను హడావుడిగా ముగించుకొని శ్వేతసౌధానికి పరుగులు తీశారు. మునీర్–ట్రంప్ భేటీకి ముందే మోదీ–ట్రంప్ టెలిఫోన్ సంభాషణ జరిగి, ఇంతకాలమూ తన మనసులో ఉన్న, గట్టిగా అనాలనుకుంటున్న మాటని మోదీ ట్రంప్‌కు చెప్పేశారు. ఇటీవలి భారత్–పాక్ ఘర్షణలను తానే ఆపానని, వాణిజ్యాయుధాన్ని ప్రయోగించి ఈ రెండు అణ్వస్త్రదేశాలను దారికితెచ్చానని ట్రంప్ ఇప్పటికి ఓ పదిసార్లయినా చెప్పుకొని ఉంటారు. ఆదిలో ఆయన మాటని కాదనలేకపోయినా, ఆయన అదేపనిగా అంటూంటే, అందులో ఉన్న మహాప్రమాదాన్ని మనం త్వరితంగానే గుర్తించాం. నర్మగర్భంగానో, పరోక్షంగానో కాదనడంతో ఆరంభించి, ఎవరూ మధ్యవర్తిత్వం వహించాల్సిన అవసరం లేదన్న మాట ఆఖరుకు గట్టిగా అనడం మొదలెట్టాం. పహల్గాం ప్రతీకారంలో భాగంగా మనం పాక్‌కు సింధుజలాలను కాదంటే, పాకిస్థాన్ సిమ్లా ఒప్పందాన్నే కాలదన్ని, మధ్యవర్తులు చొచ్చుకువచ్చేందుకు దారులు తెరిచిన విషయం తెలిసిందే. దాడులు ఆపమంటూ పాకిస్థాన్ కాళ్ళావేళ్ళాపడిందని మనం చెప్పుకుంటూవుంటే, కాదుకాదు ట్రంప్ ఆదేశాలమేరకే కాల్పుల విరమణ జరిగిందని పాకిస్థాన్ సైన్యాధ్యక్షుడు గట్టిగా చెప్పి, ఏకంగా నోబెల్‌శాంతినే ఇవ్వాలంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, వీరిరువురి భేటీకి ముందే కాల్పుల విరమణతో అమెరికాకు సంబంధం లేదని మోదీ గట్టిగా చెప్పారు. అయినా కూడా, అప్పట్లో తానే నిప్పులమీద నీళ్ళుపోశానంటూ ట్రంప్ పాతపాటే పాడారు. అంతేకాదు, పాక్ సేనానినీ, భారత ప్రధానినీ సమం చేస్తూ, ఇద్దరూ గొప్పవారేనని కీర్తిస్తూ, రెండు దేశాలనూ ఒకేగాటన కట్టేయడం మరో విషాదం.

నరేంద్రమోదీ ఆప్తమిత్రుడైన అమెరికా అధ్యక్షుడు, పాకిస్థాన్ సర్వసైన్యాధ్యక్షుడిని భోజనానికి పిలవడం మీద విపక్ష కాంగ్రెస్ విరుచుకుపడుతోంది. తన వ్యాఖ్యలతో పహల్గాం ఉగ్రదాడిని ప్రోత్సహించడమే కాక, అనంతరం ఆ దాడికి సంబంధించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని శ్వేతసౌధానికి పిలిచి గౌరవించడం మన దౌత్యవిధానం వైఫల్యమని కాంగ్రెస్ అంటోంది. కశ్మీర్‌లో తృతీయపక్షం జోక్యాన్ని అనుమతించబోమని ట్రంప్‌కు మోదీ గట్టిగా చెప్పారన్న విదేశాంగశాఖ వివరణను కూడా కాంగ్రెస్ తీసిపారేస్తోంది. భ్రమలు పక్కనబెట్టి వాస్తవికంగా వ్యవహరించాలని హితవు చెబుతోంది. గతంలో అమెరికా అధ్యక్షులు పాక్ సైన్యాధ్యక్షులతో భేటీలు జరిపిన సందర్భాలు లేకపోలేదు. అయితే, ఫీల్డ్‌మార్షల్ అయూబ్‌ఖాన్, జనరల్ జియా ఉల్‌హక్, జనరల్ పర్వేజ్ ముషార్రఫ్ శ్వేతసౌధంలో విందు అందుకొనేటప్పటికే పాక్‌లో తిరుగుబాటు చేసి పాలకులుగా అవతరించినవారు. కానీ, ఇప్పుడు పాకిస్థాన్‌లో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వం ఉన్నది, అధ్యక్ష ప్రధానులతో సహా ఒక రాజ్యాంగబద్ధ వ్యవస్థ ఉన్నది. అయినా కూడా, షరీఫ్‌లూ భుట్టోలను పక్కకు నెట్టి నేరుగా మునీర్‌తో ట్రంప్ ముచ్చట్లాడటాన్ని బట్టి పాక్‌ను ఏలుతున్నది సైన్యమేననీ, అక్కడ ఉన్నది అనధికార నియంతృత్వమేనని మరోమారు స్పష్టంగా తెలిసొచ్చింది. తక్కువ ర్యాంకుతో త్వరలో రిటైరు కావాల్సి ఉన్న మునీర్‌ను, ఇమ్రాన్‌ఖాన్ మీద అతడికి ఉన్న అమితమైన ద్వేషమే అర్హతగా షరీఫ్ సోదరులు సైన్యాధ్యక్షుడిని చేస్తే, పహల్గాం ఉగ్రఘాతుకానికి జవాబుగా భారత్ నిర్వహించిన ప్రతీకార దాడులతో అతడు ఏకంగా ఫీల్డ్‌మార్షల్ అయ్యాడు, పాకిస్థాన్ రక్షకుడుగా అవతరించి, ప్రపంచ వ్యవహారాలు చక్కబెడుతున్నాడు.

ఒక గంటలో ముగియాల్సిన ట్రంప్–మునీర్ భేటీ రెండుగంటలు సాగిందట. తమపై అణుబాంబు వేస్తే, ఇజ్రాయెల్ మీద పాకిస్తాన్ అణుబాంబు వేస్తుందని వ్యాఖ్యానించిన ఇరాన్‌ను ఈ భేటీ నివ్వెరపరిచింది. ఇరాన్‌మీద ఇజ్రాయెల్ దాడులు ఆరంభించిన మరుక్షణంలోనే మునీర్ ఎంతో ఆగ్రహంగా, ఇస్లామిక్ దేశాలన్నీ ఒక్కటిగా నిలిచి ఇరాన్‌ను కాపాడుకోవాలనీ, లేదంటే ఇలా ఒక్కోదేశమూ నాశనమైపోతూనే ఉంటుందని హెచ్చరించారు. అటువంటి మునీర్ ఇప్పుడు ట్రంప్‌తో భేటీ అయిన నేపథ్యంలో, పాక్ భూ, గగనతలాలను వాడుకొని తమను దెబ్బతీసే ప్రయత్నం జరగదన్న ఆశాభావాన్ని ఇరాన్ వ్యక్తంచేస్తోంది. ఇరాన్‌తో యుద్ధం చేస్తానో చెయ్యనో చెప్పలేనని అంటూనే అమెరికా అధ్యక్షుడు యుద్ధానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.


విషం.. విషాదం.. గుణపాఠం!

పాకిస్థాన్ నుంచి ఏం నేర్చుకోగలం? ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ప్రశ్నే అసంబద్ధంగా అనిపిస్తుంది! పహల్గాం దారుణం.. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ వ్యతిరేక ఉద్వేగాల్లో ఊగిపోవటమే ఎక్కువ కనపడుతోంది. ఉద్వేగాల్లో ఊగిపోతున్నప్పుడు తార్కిక ఆలోచన మందగిస్తుంది. గతం–వర్తమానం మధ్య సంబంధాలను పట్టించుకోలేం. దీర్ఘకాలిక దృష్టితో వ్యవహారాలను చూడలేం. నిలకడగా విషయాల లోతుల్లోకి వెళ్లలేం. ఇవన్నీ అవగాహనకు అడ్డంకులుగా నిలిచే మాట నిజమే! ఈ లోటుపాట్లు ఉన్నా ఉద్వేగభరిత వాతావరణం వాస్తవాల తీరంవైపు వెళ్లేందుకూ కొంత తోడ్పడుతుంది. దేశాల చరిత్రల నుంచి గుణపాఠాలు నేర్చుకునేలా చేస్తుంది. నియంతృత్వ రాజ్యం కిరాతకాల నుంచీ మతతత్వ ఉన్మాదాల నుంచీ, మైనారిటీల దారుణ అణచివేతల నుంచీ దూరంగా ఉందామనుకుంటే పాకిస్థాన్ నుంచి మనం నేర్చుకునేది చాలానే ఉంటుంది.

మతం ఏదైనా కావచ్చు. దాన్ని రాజకీయ ప్రయోజనాలకూ, ప్రభుత్వ విధానాలకూ ఆధారం చేసుకుంటే జరిగే నష్టం భారీగా ఉంటుంది. మెజారిటీ మతోన్మాదంతో పౌరహక్కులు హరించుకుపోతాయి. మతంలో మంచి చెడులు ఉన్నాయని చెప్పటమే జాతి వ్యతిరేకత అయిపోతుంది. మతాన్ని వ్యతిరేకించటం దేశద్రోహంగా మారిపోతుంది. లౌకిక వాదం విదేశీ సిద్ధాంతంగా ముద్రపడుతుంది. పాశ్చాత్య వైపరీత్యంగా సామ్యవాద దృక్పథంపై వ్యతిరేక ప్రచారం జరుగుతుంది. స్వేచ్ఛా ఆలోచనలకూ, ప్రయోగాలకూ సంకెళ్లు పడతాయి. మొత్తంగా దేశమే ఆలోచనలపరంగా అధోగతి వైపుగా అడుగులు వేస్తుంది. మానవ మేధే సంకుచితమైపోతుంది. ఈ విపరిణామాలన్నిటికీ పాకిస్థాన్ ఎలా రంగస్థలంగా మారిపోయిందో వివరిస్తూ ఆ దేశానికే చెందిన ప్రముఖ పరిశోధకురాలు ఫరానాజ్ ఇస్పాహానీ అద్భుతమైన పుస్తకం రాశారు. పాకిస్థాన్ అంటే పవిత్ర భూమి అనే అర్థమూ ఉంది. అట్లాంటి పవిత్రభూమిని మరింత పవిత్రంగా మారుస్తామనే లక్ష్యంతో మతతత్వవాదులు ఒడికట్టిన దారుణాలను 'ప్యూరిఫయింగ్ ద ల్యాండ్ ఆఫ్ ద ప్యూర్'లో లోతుగా విశ్లేషించారు. అమెరికాలోనూ నివసించి ఆ తర్వాత పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ తరఫున ఒక దఫా నేషనల్ అసెంబ్లీకి ఫరానాజ్ ఎన్నికయ్యారు. అయినా తాను ఒకనాడు ప్రాతినిధ్యం వహించిన పార్టీ తప్పిదాలనూ, వైఫల్యాలనూ, పరిమితులనూ నిశితంగా విమర్శించారు.

ఇస్లామిక్ తీవ్రవాదానికి అల్పసంఖ్యాక వర్గాలు.. పాక్‌లోలాగా భారీగా బలి అవ్వటం ఎక్కడా జరగలేదు. 1947 నాటి భారత నాయకత్వం పాకిస్థాన్ ఒక రాజ్యంగా మనుగడ సాగిస్తుందని భావించలేదు. ఎప్పటికైనా అది భారత్‌లో మళ్లీ కలవక తప్పదనే ప్రకటనలు అప్పుడు చాలా వెలువడ్డాయి. వాటికి భిన్నంగా పాకిస్థాన్ ఇప్పటికీ ఒక రాజ్యంగా కొనసాగుతూ ఉండొచ్చు. కానీ ప్రజాస్వామ్యయుగంలో ఆధునిక విలువలపరంగా పాకిస్థాన్ విఫల దేశంగానే మిగిలిపోయింది. ఆధిపత్య వర్గాలు మతాన్ని ఆయుధంగా చేసుకుని అధికారాన్ని నిలుపుకొనే ప్రయత్నాల్లో ఆలోచనలూ, ప్రవర్తనలూ ఎంతటి విషతుల్యంగా మారిపోతాయనటానికి పాకిస్థాన్‌ను ఉదాహరణగా చెప్పుకొన్నా ఆ ప్రమాదం భారత్‌కు పూర్తిగా లేదనీ భరోసా ఇచ్చుకోలేం. మతంకోణంతో ఆలోచించటం ఇటీవల కాలంలో పెరిగిపోతోందని ఎన్నో అధ్యయనాలు చెబుతున్నాయి. పాఠశాలలూ, కళాశాలల బోధనల్లో ఏకపక్ష చరిత్రలూ, వక్రీకరణలూ పెరిగిపోతున్నాయి. హిందూ–ముస్లిం సంస్కృతులూ పరస్పర విరుద్ధమైనవేనంటూ వ్యాఖ్యానాలూ, రెండిటి మధ్యా వెయ్యేళ్లకు పైగా సంఘర్షణలూ సాగుతున్నాయంటూ సూత్రీకరణలూ వెల్లువెత్తుతున్నాయి. హిందూ సంస్కృతికి అందరూ లోబడి మసలాలనే వాదనలూ బలపడుతున్నాయి.

మతాలు మనుషులకు కొత్తకాదు. భిన్న దేవతారాధనలూ కొత్తకాదు. ఒక మత ఆధిపత్యానికి పెద్దపీట వేసే మతతత్వాలు మాత్రం కొత్తవైనవి. రాజకీయాలు, అధికార తాపత్రయాలు లేకుండా మతతత్వాలు ఊపిరిపోసుకోలేవు. అవి లేనిదే వాటిని ఆచరణలో పెట్టే శక్తులు వ్యవస్థీకృతంగా వ్యవహరించలేవు. 1949లో ప్రకటించిన రాజ్యాంగ లక్ష్యాల తీర్మానంతోనే పాకిస్థాన్‌లో మతతత్వ రాజకీయాలకు పునాది పడింది. ఇస్లామిక్ రాజ్యాన్ని ఏర్పాటుచేయటమే రాజ్యాంగ రచన లక్ష్యంగా ఆ తీర్మానం పేర్కొంది. దాన్ని పాక్ రాజ్యాంగ సభ ఆమోదించింది. పాకిస్థాన్ ఏర్పాటుకు కీలక సూత్రధారి అయిన జిన్నా అప్పటికే మరణించారు. జిన్నా బతికి ఉంటే దాన్ని ఆమోదించేవారా? వ్యతిరేకించేవారా? అన్న విషయంపై ఇప్పటికీ ఏకాభిప్రాయం లేదు. హిందువులూ ముస్లింలూ రెండు విభిన్న జాతులకు చెందుతారనే సిద్ధాంత ప్రచారంతో పాకిస్థాన్ ఏర్పాటు కోసం జిన్నా రాజకీయ వ్యూహాలకు పదునుపెట్టటం తీవ్ర మత విభజన పరమైన ఆలోచనలకు దారితీసింది. అందులో సందేహం లేదు. కానీ ప్రత్యేక దేశంగా పాకిస్థాన్ ఏర్పాటు ఖాయమని తేలిపోయిన తర్వాత జిన్నా ద్విజాతి సిద్ధాంతం గురించి మాట్లాడలేదు. పాకిస్థాన్ రాజ్యాంగ సభలో 1947 ఆగస్టు 11న చేసిన ఉపన్యాసంలో మతానికి, రాజ్యానికి సంబంధంలేదని స్పష్టంగా వ్యాఖ్యానించారు. కుల, మత, జాతుల ఆధారంగా పాక్ ప్రభుత్వ వ్యవహారాలు ఉండవనీ ప్రతి పౌరుడికీ తాననుకున్న రీతిలో గుడికి, మసీదుకు, చర్చికి వెళ్లే స్వేచ్ఛ ఉందనీ చెప్పారు. నవీన పాకిస్థాన్‌లో హిందువు హిందువుగా ఉండడనీ, ముస్లిం ముస్లింగా ఉండడనీ, క్రిస్టియన్ క్రిస్టియన్‌గా ఉండడనీ, ప్రతి వ్యక్తీ పౌరుడుగా మాత్రమే గుర్తింపు పొందుతాడనీ మతం వ్యక్తిగత విశ్వాసానికి మాత్రమే పరిమితమవుతుందనీ ఘనంగా చెప్పారు. అందుకు అనుగుణంగా గవర్నరు జనరల్‌గా ఉండగా కొన్ని నిర్ణయాలూ తీసుకున్నారు. హిందువైన జోగేంద్రనాథ్ మండల్‌ను న్యాయశాఖ మంత్రిగా నియమించారు. అహ్మదీయ శాఖకు చెందిన జఫరుల్లా ఖాన్‌కు తొలి విదేశాంగ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. మత రాజ్యం గురించి మాట్లాడటాన్నీ గర్హించారు. అలాగే పదవుల్లో మైనారిటీ షియాలకూ సముచిత ప్రాధాన్యం ఇచ్చారు. చాలామంది అనుకున్నట్లుగా జిన్నా ఇస్లాంలోని ప్రధాన సున్నీ శాఖకు చెందినవారు కాదు. ఆయన షియా ముస్లిం. విషాదం ఏమిటంటే తర్వాతి కాలంలో షియాల ఊచకోత పాక్‌లో సర్వసాధారణమైంది. అలాగే అహ్మదీయులను ముస్లింలుగా పరిగణించకూడదంటూ రాజ్యాంగ సవరణనే తీసుకొచ్చారు.



> ప్రత్యేక దేశంగా పాకిస్థాన్ ఏర్పాటు ఖాయమని తేలిపోయిన తర్వాత జిన్నా ద్విజాతి సిద్ధాంతం గురించి మాట్లాడలేదు. పాకిస్థాన్ రాజ్యాంగ సభలో 1947 ఆగస్టు 11న చేసిన ఉపన్యాసంలో మతానికి, రాజ్యానికి సంబంధంలేదని స్పష్టంగా వ్యాఖ్యానించారు. కుల, మత, జాతుల ఆధారంగా పాక్ ప్రభుత్వ వ్యవహారాలు ఉండవనీ ప్రతి పౌరుడికీ తాననుకున్న రీతిలో గుడికి, మసీదుకు, చర్చికి వెళ్లే స్వేచ్ఛ ఉందనీ చెప్పారు. నవీన పాకిస్థాన్‌లో హిందువు హిందువుగా ఉండడనీ, ముస్లిం ముస్లింగా ఉండడనీ, క్రిస్టియన్ క్రిస్టియన్‌గా ఉండడనీ, ప్రతి వ్యక్తీ పౌరుడుగా మాత్రమే గుర్తింపు పొందుతాడనీ మతం వ్యక్తిగత విశ్వాసానికి మాత్రమే పరిమితమవుతుందనీ ఘనంగా చెప్పారు.

మతతత్వ ఆలోచనలు అధికారాన్ని సాధించటానికీ, నిలబెట్టుకోటానికీ అవసరమైనప్పుడు చరిత్ర వక్రీకరణ సర్వసాధారణంగా జరుగుతుంది. జిన్నా రాజ్యాంగ సభలో చేసిన ఆ ఉపన్యాసాన్ని పలు విధాలుగా తొక్కిపట్టి, సాధారణ ప్రజలకు దాన్ని చేరకుండా చేయటమే ఇందుకు నిదర్శనం. పాక్ తొలి ప్రధాని లియాఖత్ అలీ ఖాన్ దానికి పూనుకున్నారు. ద్విజాతి సిద్ధాంతాన్ని తిరస్కరించేలా జిన్నా ప్రసంగం ఉండటం పాకిస్థాన్ మనుగడకే ప్రమాదంగా పరిగణించారు. అందుకే దానికి పూర్తి విరుద్ధంగా రాజ్యాంగ లక్ష్యాల తీర్మానాన్ని రూపొందించారు. పవిత్ర ఖురాన్‌లోని బోధనలకు అనుగుణంగా వ్యక్తిగత, సామాజిక జీవితాన్ని తీర్చిదిద్దుకునేలా ముస్లింలకు తోడ్పటమే రాజ్యాంగ లక్ష్యమని పేర్కొన్నారు. రాజ్యాన్ని ఇస్లామిక్ పరిభాషలో నిర్వచించటంతోనే తర్వాతి కాలంలో మతపరమైన చట్టాలకు అడుగులు పడ్డాయి. మతాల వారీగా ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పరచారు. అన్ని మతాలకు చెందిన పౌరులు ఉమ్మడి ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం లేకుండా చేశారు. రాజ్యాంగ లక్ష్యాల తీర్మానం ఆమోదం పొందిన వెంటనే ముస్లిం మతగురువులు రంగంలోకి దిగి 22 సూత్రాల ప్రణాళికను ప్రకటించి షరియా చట్టాన్ని అమలుపరచటమే ప్రభుత్వ ధ్యేయం కావాలని డిమాండు చేశారు. ముస్లిం పురుషుడు మాత్రమే దేశాధినేత కావాలని స్పష్టం చేశారు. ముస్లింలతో సమానంగా ముస్లిమేతరులకు హక్కులు ఉండకూడదనీ వాదించారు. మతగురువుల డిమాండ్లలో చాలా వాటిని ఆమోదిస్తూ 1956లో రాజ్యాంగాన్ని తయారుచేయటంతోనే పాక్ గతితప్పింది ముస్లిమేతరులను రాజ్యాధినేతగా అర్హత లేకుండా నిబంధనను పొందుపరచారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్‌గా దేశాన్ని పేర్కొన్నారు. తర్వాతి కాలంలో రాజ్యాంగాలను రద్దు చేయటం, పునరుద్ధరించటం చేసినా అంతకంతకూ మతతత్వ ప్రకరణలను పెంచారే కానీ తగ్గించలేదు. జియా ఉల్ హక్ కాలంలో రాజ్యాంగం, చట్టాలు పూర్తిగా మతతత్వంతో నిండిపోయాయి. ఎన్నికల ద్వారా ఎన్ని ప్రభుత్వాలు ఏర్పడినా వాటిని తొలగించలేకపోయారు. దైవదూషణ చట్టాలతో లక్షలాది మందిని ఖైదుచేశారు. మైనారిటీ వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఎంతటి బీభత్సాన్ని, ఎంతటి మానవ హక్కుల హననానికి పాల్పడ్డారో ఫరానాజ్ తన పుస్తకంలో కళ్లకు కట్టినట్లు వర్ణించారు. ప్రభుత్వాల వెన్నుదన్నుతో, ప్రధాన పార్టీల పూనకాలతో మతతత్వం పేట్రేగితే మాటలో, చేతలో, చేతనలో ఎంత అమానవీయతా ఎంత క్రూరత్వమూ ప్రబలిపోతుందో వర్ణించలేం.



■ రాహుల్ కుమార్

దేశ విభజన నాటికి ఉమ్మడి పాకిస్థాన్‌లో 23 శాతం ముస్లిమేతరులు ఉండేవారు. ఇప్పటి పాకిస్థాన్‌లో వాళ్ల సంఖ్య 3 శాతానికి పడిపోయింది. ముస్లింమేతరుల్లో ప్రధానంగా హిందువులు ఒకనాటి తూర్పు పాకిస్థాన్‌లో (బంగ్లాదేశ్) అధికంగా (20శాతం) ఉండేవారు. 1961 నాటికి వారి శాతం 12 శాతానికి పడిపోయింది. అభద్రతా భావంతో, దాడులతో తల్లడిల్లి భారత్‌కు వలసలు రావటం వల్లే అది జరిగింది. జిన్నా ఏరికోరి నియమించిన న్యాయశాఖ మంత్రి జోగేంద్రనాథ్ మండల్ కూడా భారత్‌కు తరలిరాక తప్పలేదు. పాక్ సైన్యం బంగ్లాదేశ్‌లో (1971) పాల్పడిన ఊచకోతలతో లక్షలమంది హిందువులు శాశ్వతంగా భారత్‌కు వచ్చారు. పాక్ ముస్లింల్లో షియా వర్గం సంఖ్య 20 నుంచి 25 శాతం వరకూ ఉంటుంది. అహ్మదీయుల జనాభా ఒక శాతానికి పరిమితమైంది. అహ్మదీయులను తమని తాము ముస్లింలమని చెప్పుకొంటే దాన్ని శిక్షార్హం చేశారు. వారి చూపునీ, చేష్టనీ, మాటనీ దైవదూషణగా పరిగణించేలా చట్టాలను చేశారు. 1990ల తర్వాత అఫ్ఘనిస్థాన్ నుంచి తిరిగొచ్చిన మత తీవ్రవాదులు ఆధునిక ఆయుధాలతో మైనారిటీల ప్రాణాలు తీయటం సాధారణ చర్యలుగా మారిపోయాయి. 2009–2015 మధ్య 1659 మంది షియాలను అలాగే చంపివేశారు. అహ్మదీయులను సమర్థించిన న్యాయవాదులను, నిర్దోషులుగా ప్రకటించిన న్యాయమూర్తులను కాల్చిచంపటంతో కోర్టులు కూడా హడలెత్తిపోయాయి. అసియాబీబీ అనే అహ్మదీయ నిరక్షరాస్య మహిళను దైవదూషణ చట్టం కింద అకారణంగా ఖైదుచేస్తే పరామర్శించటానికి వెళ్లిన పంజాబ్ గవర్నర్‌ను కాల్చిచంపటం అంతర్జాతీయంగా సంచలనమైనా పరిస్థితిలో మార్పురాలేదు. మతవాదులను సంతృప్తిపరచటానికి ఆధునిక ప్రజాస్వామిక సిద్ధాంతాలను పణంగా పెట్టటంతో, సమన్యాయపాలనకు తిలోదకాలు ఇవ్వటంతో మైనారిటీలు బలిపశువులు అయ్యారు. మైనారిటీలను నిరంతరం అభద్రతతో ఉంచి, వారి ప్రతిచర్యనూ అనుమానంతో చూసి, రాజ్య విధేయతను అనుక్షణం నిరూపించుకోమని శీలపరీక్షలు కోరి హింసకు పాల్పడటం వల్లే పాక్ చరిత్ర రక్తసిక్తం అయింది. భారత్ ఉపఖండ విషాదం, బీభత్సం అదే!

> ప్రజాస్వామ్యయుగంలో ఆధునిక విలువలపరంగా పాకిస్థాన్ విఫల దేశంగానే మిగిలిపోయింది. ఆధిపత్య వర్గాలు మతాన్ని ఆయుధంగా చేసుకుని అధికారాన్ని నిలుపుకొనే ప్రయత్నాల్లో ఆలోచనలూ, ప్రవర్తనలూ ఎంతటి విషతుల్యంగా మారిపోతాయనటానికి పాకిస్థాన్‌ను ఉదాహరణగా చెప్పుకొన్నా ఆ ప్రమాదం భారత్‌కు పూర్తిగా లేదనీ భరోసా ఇచ్చుకోలేం.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

ప్రైవేట్ ఈవీలను ప్రోత్సహించాలా?

వ్యక్తిగత విద్యుత్ వాహనాల ప్రాముఖ్యత ఏమిటి? టెస్లాలు, బీవైడిలు వాతావరణ క్లిష్ట సమస్యను తీర్చగలుగుతాయా? ఇదొక సులభమైన ప్రశ్న కాదు. సమాధానం సులువుగా చెప్పగలిగేదీకాదు. అయినప్పటికీ మానవాళిని శీఘ్రగతిన వాతావరణ విపత్తుకు చేరువచేస్తున్న హరిత గృహ వాయు (జీహెచ్‌జీ) ఉద్గారాలను నిరోధించేందుకు మరింత బృహత్తర కృషి చేయవలసి ఉన్న దృష్ట్యా ఆ ప్రశ్నను లోతుగా తర్కించడం చాలా ముఖ్యం.

విద్యుత్ వాహనాలు (ఈవీ) ఎందుకు? పారిశ్రామిక యుగం తొలినాటి సంపన్న దేశాలు శిలాజ ఇంధనాల వినియోగాన్ని శీఘ్రగతిన పూర్తిగా తగ్గించుకోవల్సిన అగత్యమేర్పడింది. శిలాజ ఇంధనాలతో నడిచే Internal combustion (ఐసీ) ఇంజిన్ వాహనాల వినియోగాన్ని వదిలివేసేందుకు విద్యుత్ వాహనాలు దోహదం చేస్తాయని ఆ దేశాలు విశ్వసిస్తున్నాయి. రవాణా రంగంలో ఈవీల వాడకం ఇతోధికంగా పెరిగితే కాలుష్య కారక వాయు ఉద్గారాలు తగ్గిపోతాయని సంపన్న పారిశ్రామిక దేశాలు భావిస్తున్నాయి. అటువంటి పరివర్తన సుగమమయ్యేందుకు ఆ దేశాలు ఇప్పటికే నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకున్నాయి. 2030 నాటికి నమోదయ్యే కొత్త కార్లలో 80 శాతం తప్పనిసరిగా కాలుష్యకారక వాయువులను ఏ మాత్రం ఉద్గారించనివై ఉండాలని యూరోపియన్ దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. వీటి సంఖ్య 2035 నాటికి నూటికి నూరు శాతానికి పెరగాలని కూడా ఆ దేశాలు నిర్దేశించుకున్నాయి. అమెరికాలో కూడా 2030 నాటికి నమోదయ్యే కొత్త కార్లలో 50 శాతం తప్పనిసరిగా విద్యుత్ వాహనాలై ఉండి తీరాలని మాజీ అధ్యక్షుడు జోబైడెన్ ప్రభుత్వం ఆదేశించింది. రవాణారంగాన్ని డీ కార్బనైజ్ (హరిత గృహ వాయువుల ఉద్గారాలను, ముఖ్యంగా కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించి అంతిమంగా వాతావరణం నుంచి పూర్తిగా తొలగించే ప్రక్రియ) చేసేందుకు విద్యుత్ వాహనాలను వినియోగించడమనేది ఈ సంపన్న పాశ్చాత్య దేశాల లక్ష్యం. ఐసీ ఇంజిన్ల వాహనాలను క్రమంగా తొలగించివేసినప్పుడు మాత్రమే ఆ లక్ష్య పరిపూర్తి సాధ్యమవుతుంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

మూడు దశాబ్దాలుగా యూరోపియన్ దేశాల రవాణా రంగంలో జీహెచ్‌జీ ఉద్గారాలు బాగా పెరిగిపోయాయి. రవాణా రంగం నుంచి వెలువడుతున్న మొత్తం ఉద్గారాలలో 60 శాతం ప్రైవేట్ కార్ల నుంచే సంభవిస్తున్నాయి. ఈ వాస్తవం దృష్ట్యానే రవాణా రంగాన్ని డీ కార్బొనైజ్ చేసేందుకు ఆ దేశాలు నిర్ణయించుకున్నాయి. రవాణా రంగంలో ఆవశ్యక మార్పును సాధించేందుకు యూరోపియన్ దేశాలు ప్రైవేట్ కారు యజమానులకు సబ్సిడీలు సమకూరుస్తాయా? లేక ఆ డబ్బును రవాణా రంగాన్ని డీ కార్బొనైజ్ చేసేందుకు, సొంత వాహనాలకు బదులు ప్రజా రవాణా వ్యవస్థలను వినియోగించుకునేలా ప్రజలకు వెసులుబాటు కల్పించేందుకు ఉపయోగిస్తాయా? సంపన్న దేశాలు ఆ రెండూ చేయగలవు. చేస్తాయి కూడా.



> మనం నిర్దిష్ట కాల పరిమితిలో కాలుష్య కారకాలను ఉద్గారించని వాహనాలకు మారాలి. ఐసీ ఇంజిన్ల వాహనాలను సంపూర్ణంగా వదిలివేయాలి. ఈ విషయమై ఒక కచ్చితమైన విధాన నిర్ణయం తీసుకుని కఠినంగా అమలుపరచాలి. అప్పుడు మాత్రమే ప్రైవేట్ ఈవీల వల్ల సత్ఫలితాలు సాధ్యమవుతాయి. విద్యుత్ వాహనాల వినియోగాన్ని గణనీయంగా పెంచినంతమాత్రాన వాయు కాలుష్య నియంత్రణకు గానీ, వాతావరణ మార్పు నిరోధానికి గానీ దోహదం జరగదు.

అభివృద్ధి చెందుతున్న దేశాల విషయంలో ఈ ప్రశ్నలకు చాలా ప్రాసంగికత ఉన్నది. ఎందుకంటే మన ప్రభుత్వాలు ఆ రెండిటిలో ఏదో ఒకటి మాత్రమే చేయగలవు. ఇప్పటికే ప్రైవేట్ డీజిల్, పెట్రోల్ కార్లకు సబ్సిడీలు సమకూరుస్తున్నాయి. దీని వల్ల ప్రభుత్వ ఖజానాపై పెద్ద ఆర్థిక భారం పడుతోంది. ముఖ్యమైన విషయమేమిటంటే ఈ సబ్సిడీలు ప్రత్యక్షంగా కనపడవు. అవి ఎక్కడా చర్చింపబడవు. కారు యజమానులు చెల్లించే రోడ్ పన్నునే తీసుకోండి. బస్సు ప్రయాణీకులు ఒకొక్కరు చెల్లించే పన్ను కంటే కారు ఉన్న ఆసాములు చెల్లించే పన్ను చాలా తక్కువ. రోడ్లపై 90 శాతం కంటే ఎక్కువ చోటును చిన్న కారులే ఆక్రమించుకుంటాయి. కార్లు సుగమంగా సాగేందుకు నున్నని రోడ్లు, ఫ్లైఓవర్లు, దైనందిన రాకపోకలకు అవసరమైన ఇతర సదుపాయాల నిర్మాణానికి అవసరమయ్యే ఖర్చునూ పరిగణనలోకి తీసుకుంటే ప్రైవేట్ కారు యజమానులకు భారీ సబ్సిడీ సమకూరుతుందనేది స్పష్టం. డీ కార్బొనైజేషన్, వాయు కాలుష్యం తగ్గింపు అనే మన లక్ష్యాల పరిపూర్తికి మన రోడ్లపై ప్రైవేట్ వాహనాల సంఖ్యను ఇతోధికంగా తగ్గించవలసి ఉంటుంది; అదే సమయంలో వాహనాల కంటే ప్రజలకు ప్రాధాన్యమిచ్చే రవాణా పద్ధతుల (నగరాలలోని రవాణా వ్యవస్థలను ప్రైవేట్ వాహనాలకు అనుగుణంగా కాకుండా ప్రజల అవసరాలకు సానుకూలంగా రూపొందించడం)కు మనం మారాలి. ఇది తప్పనిసరి.

ఇందుకు మనం ఏమి చెయ్యాలి? నిర్దిష్ట కాలపరిమితిలో కాలుష్య కారకాలను ఉద్గారించని వాహనాలకు మారాలి. ఐసీ ఇంజిన్ల వాహనాలను సంపూర్ణంగా వదిలివేయాలి. ఈ విషయమై ఒక కచ్చితమైన విధాన నిర్ణయం తీసుకుని కఠినంగా అమలుపరచాలి. అప్పుడు మాత్రమే ప్రైవేట్ ఈవీల వల్ల సత్ఫలితాలు సాధ్యమవుతాయి. కేవలం విద్యుత్ వాహనాల వినియోగాన్ని గణనీయంగా పెంచినంత మాత్రాన వాయు కాలుష్యం నియంత్రణకు గానీ, వాతావరణ మార్పు నిరోధానికి గానీ దోహదం జరగదు. శుభకరమైన విషయమేమిటంటే విద్యుత్ వాహనాల విషయంలో భారత ప్రభుత్వ విధానం వాటి పట్ల పూర్తి అనుకూలత చూపడం లేదు. ప్రజా రవాణా వ్యవస్థల్లో విద్యుత్ బస్సులు ఉపయోగించేందుకు, అనుబంధ రవాణా సేవల్లో ఆటోలు మొదలైన వాహనాల విద్యుదీకరణకు సబ్సిడీలు సమకూరుస్తున్నది.

అయితే ఇది మాత్రమే సరిపోదు. ఆటోలు, టాక్సీలు, బస్సులు మొదలైనవి నిర్ణీత కాలపరిమితిలో విద్యుదీకరణ అయితీరాలనే లక్ష్యాన్ని నిర్దేశించి తీరాలి. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌కే గాక, కాలం చెల్లిన వాహనాల తొలగింపునకు కూడా ఒక కచ్చితమైన కాలపరిమితిని నిర్దేశించాలి. పార్కింగ్ చార్జీలు, ప్రజా రవాణాకు మరిన్ని ప్రోత్సాహకాల కల్పన మొదలైన చర్యల ద్వారా ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని నియంత్రించాలి. ప్రైవేట్ కార్ల స్థానంలో నడక, సైక్లింగ్, బస్సులు, ట్రాములు, మెట్రోలను ప్రోత్సహించని పక్షంలో మన లక్ష్యాలను సాధించుకోలేము. మన విద్యుదీకరణ అజెండా మొబిలిటీ ట్రాన్స్‌ఫర్మేషన్ అజెండా (మరింత స్థిరమైన, సమర్థమైన, సాంకేతికంగా అభివృద్ధి చెందిన రవాణా వ్యవస్థల దిశగా పరివర్తన)నే. అంతకు ఏమీ తక్కువ కాదు.

(సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

యుద్ధంతో సర్వనాశనం

ఏ చట్టాలకు లోబడి ఉండాల్సిన అవసరం లేని ఒక విధ్వంసకర రూపం యుద్ధం. విచ్చలవిడిగా ఒకరినొకరు చంపుకోవడం, ఆస్తులను ధ్వంసం చేసుకోవడం, ఎవరు ఎక్కువ ఈ విధంగా చేస్తే, వారే గెలిచినట్లు సంబరపడతారు. ఓడినవారే కాదు, గెలిచినవారు కూడా ఎన్నో ప్రాణాలు, సంపదను కోల్పోతారు. కానీ, అంతిమ గెలుపు తమదే అన్నట్లు సంబరాలు చేసుకుంటారు. వారు చేసిన విధ్వంసం ఎలా ఉంటుందో ఒకసారి పరిశీలిద్దాం. ప్రస్తుత ఉక్రెయిన్ రాజధాని కీవ్, సోవియట్ యూనియన్‌లో ఉన్నప్పుడు, అద్భుతమైన కట్టడాలతో ప్రపంచ పర్యాటక కేంద్రం. యుద్ధం చేసిన ఏ దేశమైనా, యుద్ధానంతరం అభివృద్ధి పనులు, ఆలోచనలు కనుమరుగై, యుద్ధం కారణంగా జరిగిన నష్టాన్ని సరిచేసుకోవడంలో ఉండిపోతాయి. అంటే.. కొన్ని దశాబ్దాలపాటు నష్ట నివారణకే పరిమితమవుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు ఆకలిచావులకు గురైనా ఆశ్చర్యం లేదు.

మూడేళ్లకు పైగా జరుగుతున్న ఉక్రెయిన్–రష్యా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియదు. కొత్తగా మొదలైన ఇజ్రాయెల్–ఇరాన్ యుద్ధం భీకరంగా సాగుతూ, ప్రపంచాన్ని భయపెడుతోంది. సంప్రదాయ యుద్ధాలకు కాలం చెల్లింది, దౌత్యపరమైన పద్ధతిలోనే దేశాల మధ్య వివాదాలు తీర్చుకునే కొత్త సంప్రదాయం మొదలైందని అందరూ భావిస్తున్న నేపథ్యంలో ఈ యుద్ధాలు జరుగుతుండడం బాధాకరం. ప్రపంచాన్ని భయానికి గురి చేస్తున్నది అణు బాంబులు. ఇవి ప్రపంచంలో కేవలం 9 దేశాలలోనే ఉన్నా, వాటని వినియోగిస్తే, భూమండలాన్ని వందసార్లు పూర్తిగా ధ్వంసం చేయవచ్చు. మరో భయం కలిగించే విషయం... ఉత్తర కొరియా, పాకిస్థాన్ వంటి ఉన్మాదుల వద్ద అణ్వాయుధాలు ఉండడం. ఇరాన్ వాటికి తోడు కాకుండా ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించింది. ఇజ్రాయెల్–పాలస్తీనా మధ్య జరుగుతున్నది యుద్ధంలా కాకుండా, హమాస్ తీవ్రవాద సంస్థను నిర్మూలించడానికి చేస్తున్న దాడులుగా ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. ఈ ప్రయత్నంలో ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తోంది. భారత్–పాకిస్తాన్ మధ్య దాడులు మూడు రోజులకే ముగియడం సంతోషించదగ్గ విషయం. అవి కొనసాగితే ఇరు దేశాలూ ఎంతో కొంత నష్టపోయేవి. ఈ యుద్ధాలు త్వరగా ముగిసి, ప్రజలు సుఖంగా జీవించే రోజులు రావాలని ఆశిద్దాం.

– మాదివాడ రామబ్రహ్మం, జన విజ్ఞాన వేదిక

ప్రాచ్య–పాశ్చాత్య వారధి ప్రాచీన పర్షియా

పర్షియన్ చరిత్ర, సంస్కృతి ప్రపంచపు అత్యంత ప్రాచీనమైన, ప్రభావవంతమైన నాగరికతలలో ఒకటిగా చరిత్రలో నిలిచింది. పర్షియన్లు అంటే నేటి ఇరాన్ దేశ ప్రజలు. ఇరాన్ భౌగోళికంగా మధ్య ప్రాచ్యంలో ఉన్నా, చరిత్రపరంగా ఇది ప్రాచ్య, పాశ్చాత్య దేశాల మధ్య వాణిజ్యం, సంస్కృతి, తత్వవాదం, మతపర సహనానికి ప్రాతినిధ్యం వహించిన గొప్ప నాగరికతగా విలసిల్లింది.

పర్షియా చరిత్ర క్రీ.పూ. 6వ శతాబ్దంలో సైరస్ మహారాజు ఆధ్వర్యంలో అఖేమెనిడ్ సామ్రాజ్య స్థాపనతో ప్రారంభమైంది. సైరస్ ధర్మపరుడు, న్యాయవాది, మానవహక్కుల పితామహుడిగా గుర్తింపు పొందాడు. అతని పాలనలో ధార్మిక స్వేచ్ఛ, ప్రజా సంక్షేమం వంటి విలువలకు ప్రాధాన్యం లభించింది. దరియస్, జెర్క్సిస్ వంటి రాజుల పాలనలో సామ్రాజ్యం మరింత విస్తరించి గ్రీకు, ఈజిప్ట్, భారత్ వరకు వ్యాపించింది. ఈశాన్య యూరోప్ వరకు విస్తరించిన ఈ సామ్రాజ్యం పరిపాలనా, న్యాయ, కౌశలాల పరంగా ప్రబలమైనదిగా చరిత్ర గుర్తించింది. పర్సెపోలిస్ వంటి నగరాలు శిల్పకళకు నిదర్శనంగా నిలిచాయి. పర్షియన్లు జొరాస్ట్రియన్ మతాన్ని అనుసరించేవారు. ఇది మంచి, చెడు మధ్య ధార్మిక యుద్ధాన్ని బోధించే తత్వవాద మతం.



క్రీ.శ. 651లో సాసానియన్ సామ్రాజ్యం అరబ్బు ముస్లిం ఖలీఫా చేతిలో ఓడిపోయింది. ఇస్లాం పర్షియాలోకి ప్రవేశించడానికి ఈ ఓటమి మార్గం వేసింది. తరువాతి శతాబ్దాల్లో పర్షియన్ ప్రజలు ప్రధానంగా ఇస్లాం మతాన్ని స్వీకరించారు. ఇస్లామీయ ధర్మశాస్త్రాల్లోని కరుణ, సమానత్వం, విద్యాభివృద్ధి, జ్ఞానప్రధానం వంటి అంశాలు పర్షియన్ తత్వవాదంతో కలిసి ఒక నూతన మానవతావాద సంస్కృతిని నిర్మించాయి. ఈ యుగంలో ఇబ్ను సినా, అల్–ఘజాలి, అల్–రాజీ వంటి గొప్ప తత్వవేత్తలు వైద్యం, తత్వం, మతం, న్యాయ రంగాల్లో అసాధారణ ప్రగతి సాధించారు. వారి రచనలు యూరోప్ దేశాల్లోకి ప్రవేశించి పునరుజ్జీవన యుగానికి దారితీశాయి. మత స్వేచ్ఛకు గౌరవం ఇచ్చే విధంగా జొరాస్ట్రియన్లు... క్రైస్తవులు, యూదులకు 'ధిమ్మీ' హోదా ఇచ్చి రక్షణ కల్పించారు.

1979లో సంభవించిన ఇస్లామిక్ విప్లవం ఆధునిక ఇరాన్ చరిత్రలో ఒక కీలక మలుపు. షా మహమ్మద్ రేజా పాలనను కూలదోసి, అయతుల్లా ఖోమేనీ నేతృత్వంలో దేశం ఇస్లామిక్ థియోక్రసీగా మారింది. అంటే, రాజ్యాధికారం పూర్తిగా మత నాయకుల చేతుల్లోకి వెళ్లింది. ఈ విప్లవం తరువాత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, విద్యావ్యవస్థ, మహిళల హక్కులు... అన్నీ షరియత్ చట్టాల ఆధారంగా మతపరమైన పరిపాలనలోకి వెళ్లాయి. మత నియమాలు చట్టబద్ధంగా మారాయి. మహిళల దుస్తులపై, యువత జీవనశైలిపై, సాంస్కృతిక కార్యక్రమాలపై గట్టి నియంత్రణలు వచ్చాయి. ఇరాన్–ఇరాక్ యుద్ధం (1980–1988)లో జిహాద్, షహీద్ వంటి మతపరమైన భావోద్వేగాలు అధికమయ్యాయి. సాంస్కృతిక పోలీసు వ్యవస్థ ద్వారా ప్రజలపై మత నియమాలను బలవంతంగా అమలుచేయటం ప్రారంభమైంది. 'మతం ప్రమాదంలో ఉంది' అనే ప్రచారంతో మత మౌలికవాదాన్ని నెమ్మదిగా బలపరిచారు.

ప్రాచీన పర్షియా శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతా విలువలను ప్రపంచానికి పరిచయం చేసింది. అయితే, ఆధునిక ఇరాన్ మత మౌఢ్యంలో చిక్కుకొని అభివృద్ధిలో వెనుకబడింది. ఇది కేవలం ఆ దేశానికే సమస్య కాదు, ప్రపంచ శాంతికి, మత సామరస్యానికి కూడా ముప్పుగా మారింది. పశ్చిమ దేశాలు ఒకప్పుడు ఈజిప్ట్, మెసపటోమియా, పర్షియన్ నాగరికత నుంచి ప్రేరణ పొందాయి. కానీ ఆ సౌందర్య సంస్కృతులే నేడు మత వైషమ్యం, అంతర్గత ఘర్షణల వల్ల తమ గొప్పతనాన్ని కోల్పోయాయి.

పాశ్చాత్య సామ్రాజ్యవాద దేశాలయిన బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, తరువాత అమెరికా ప్రపంచవ్యాప్తంగా నెరపిన వలస పాలనలతో స్థానిక సంస్కృతులు, భాషలు, సంప్రదాయాలు ధ్వంసమయ్యాయి. పశ్చిమ దేశాలు తమ ఆర్థిక స్వార్థం కోసం ప్రపంచంలోని అనేక జాతుల మధ్య దేశాల మధ్య వైరుధ్యాలు సృష్టించి నేటికీ యుద్ధాలు సాగిస్తున్నాయి. దానికి కొనసాగింపుగానే నేటి 'ఇరాన్–ఇజ్రాయెల్' యుద్ధాన్ని మనం చూడవచ్చు. ఇజ్రాయెల్ అనేది పశ్చిమ దేశాలు ఆడిస్తున్న పాత్రగానే మనం గుర్తించాలి. ప్రపంచ శాంతి కోసం మానవ మనుగడ కోసం ప్రతి దేశం కట్టుబడి ఉండేదాకా ప్రజలు పోరాడాలి.

నేడు భారతదేశం లాంటి దేశాలు, చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుని, మతసహనం, శాస్త్రీయ దృక్పథం, తత్వవాదం, ఐక్యత వంటి విలువలను పరిరక్షించాలి. మతపరమైన విభజనలకి బలవకుండా, ప్రపంచ శాంతి కోసం నిలబడి, మానవ వికాసానికి దోహదపడే విధంగా అభివృద్ధి చెందాలి. మన చరిత్రను గౌరవించాలి. ఇతర సంస్కృతుల ఘనతను అర్థం చేసుకోవాలి. తద్వారా మన దేశాన్ని సమున్నత నాగరికత విలువల సమాజంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలి.

● లెనిన్ కోగంటి
కార్మిక నాయకులు, టిఎస్‌టియుసి

గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33 కనిష్ఠం 24.4

మార్కెట్లోకి నకిలీ మందులు

● అధికారుల దాడుల్లో వెలుగులోకి..



మార్కెట్‌లో ఉన్న నకిలీ మందులు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఔషధ నియంత్రణ సంస్థ అధికారులు గురువారం కోఠిలోని ఇందర్‌బాగ్‌లోని ఓ ఫార్మసీలో దాడులు నిర్వహించి రూ.10 లక్షల విలువైన నకిలీ మందులను స్వాధీనం చేసుకున్నారు. గంగా ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ శ్రీ నందిని ఫార్మా డీలర్ల వద్ద నకిలీ నిల్వలను గుర్తించారు. మార్కెట్లో చలామణిలో ఉన్న 'రోసువాస్ ఎఫ్ 20, 'రోసువాస్ ఎఫ్ 10' టాబ్లెట్లు నకిలీవని నిర్ధారించారు. మేడ్చల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి. శ్రీనివాసులు, గోషామహల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ వి. అజయ్, గండిమైసమ్మ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రాజా రెడ్డి, కామారెడ్డి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కె. మురళీ కృష్ణ ఈ దాడుల్లో పాల్గొన్నారు. విచారణ అనంతరం నిందితులపై తగిన చర్యలు తీసుకుంటామని ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ షహనాజ్ ఖాసీం తెలిపారు.



ఎస్‌ఓటీ పోలీసులమంటూ

వ్యాపారికి బురిడీ

● రూ.72.76 లక్షలతో ఉడాయించిన ముఠా
● పోలీసుల అదుపులో కొందరు ముఠా సభ్యులు

రెజిమెంటల్‌బజార్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఓటీ పోలీసులమంటూ జువెల్లరీ వ్యాపారిని బురిడీ కొట్టించిన ఓ ముఠా రూ.72 లక్షలు దోచుకెళ్లింది. ఈ ఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బోయిన్‌పల్లిలో నివాసం ఉండే హరిరామ్ సికింద్రాబాద్ సెకండ్‌బజార్‌లో బంగారం షాపు నిర్వహిస్తుంటాడు. బుధవారం హరిరామ్‌కు తెలిసిన రాధేశ్యామ్ ఫోన్ చేసి 'కిలో బంగారం ఉంది, మార్కెట్ రేటు కంటే ఐదు శాతం తక్కువకే అమ్ముతా' అని తెలిపారు. ఇది నమ్మిన హరిరామ్ ఎస్డీ రోడ్‌లోని సింధ్ బేకరీలో రాధేశ్యామ్‌తో పాటు మరొక వ్యక్తిని కలిశాడు. వారు డబ్బులు చూపించాలని కోరడంతో అందరూ హరిరామ్ ఆఫీస్‌కు వెళ్లారు. హరిరామ్ డబ్బులు చూపిస్తుండగా నలుగురు వ్యక్తులు వచ్చి అందులో ఒకరు తన పేరు కేశవులు

మిగతా 6వ పేజీలో..

ఏర్పాటులో శ్రద్ధ.. నిర్వహణలో అశ్రద్ధ!

అక్రమార్జన మార్గాలుగా వర్టికల్ గార్డెన్లు

ఏర్పాటుకు రూ.కోట్లు వెచ్చింపు

నిర్వహణ వ్యయమూ రూ.లక్షల్లోనే

అయినా అలంకరణ అంతంతమాత్రమే

నల్లకుంట బ్రిడ్జి వద్ద కుప్పకూలిన వర్టికల్ గార్డెన్

గతంలో నాగోల్ బ్రిడ్జిపై..

నాణ్యత, నిర్వహణ లోపం వల్లేనని ధ్రువీకరణ

ఆరంభ శూరత్వంగా సుందరీకరణ


నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి నాలా బ్రిడ్జి వద్ద కుప్పకూలిన వర్టికల్ గార్డెన్

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రూ.లక్షలు వెచ్చించి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన వర్టికల్ గార్డెన్ బుధవారం కుప్పకూలింది. నాణ్యత, నిర్వహణ లోపం, ఫ్రేమ్‌ల మధ్య ఖాళీ లేకుండా ఏర్పాటు చేయడం వల్లే ఆ గార్డెన్ కూలినట్టు అధికారులు గుర్తించారు. ఇక్కడే కాదు.. చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంది. వర్టికల్ గార్డెన్ల ఏర్పాటులో చూపుతున్న శ్రద్ధ, నిర్వహణలో లేకపోవడం వల్ల అవి పాడైపోతున్నాయి. అవి అక్రమార్జనకు మార్గాలుగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర సుందరీకరణలో భాగంగా వంతెనల కింద పిల్లర్లకు, నాలాలపై ఉన్న బ్రిడ్జిల వద్ద వర్టికల్ గార్డెన్లను జీహెచ్‌ఎంసీ అర్బన్ బయో డైవర్సిటీ విభాగం(యుబీడీ) ఏర్పాటు చేసింది. 108 ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసింది. మొక్కలు, అవి పెట్టేందుకు అవసరమైన హ్యాంగింగ్ ప్లాంటర్స్, వర్టికల్ గార్డెన్ ఫ్రేమ్, తదితరాల కోసం చదరపు అడుగుకు 1000 నుంచి రూ.1500 చొప్పున అధికారులు వెచ్చించారు. ఇందులో అవినీతి జరిగిందంటూ గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదులూ అందాయి. వర్టికల్ గార్డెన్ల నిర్వహణకు ప్రస్తుతం చదరపు అడుగుకు నెలకు రూ.20 చొప్పున చెల్లిస్తున్నారు. ఏటా టెండర్ పిలిచి బాధ్యతలు అప్పగిస్తున్నట్టు యూబీడీ వర్గాలు చెబుతున్నాయి.

పాడవుతున్న గార్డెన్లు

నగరంలోని నాలాలపై ఉన్న బ్రిడ్జిలు, వంతెనల పిల్లర్లకు వర్టికల్ గార్డెన్లు ఉన్నాయి. సుందరీకరణ పనులకు సంబంధించి వాటి ఏర్పాటు సమయంలో చూపుతున్న శ్రద్ధ, నిర్వహణపై జీహెచ్‌ఎంసీ చూపడం లేదు. నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించి చేతులు దులుపుకున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వర్టికల్ గార్డెన్లు పాడవుతున్నాయి. గతంలో నాగోల్ బ్రిడ్జిపైనా వర్టికల్ గార్డెన్ కూలడంతో తిరిగి కొత్తది ఏర్పాటు చేశారు. రూ.150కోట్లతో ప్రస్తుతం నగరంలోని ప్రధాన జంక్షన్ల అభివృద్ధి చేపట్టారు. స్థానికత ప్రతిబింబించేలా శిల్పాలు, ఇతరత్రా ఏర్పాట్లు చేశారు. వీటి నిర్వహణకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

వర్టికల్ గార్డెన్ల వివరాలు...

జోన్	వర్టికల్ గార్డెన్లు ఉన్న వంతెనల పిల్లర్లు
ఎల్‌బీనగర్	--
చార్మినార్	20
ఖైరతాబాద్	38
శేరిలింగంపల్లి	33
కూకట్‌పల్లి	1
సికింద్రాబాద్	16
మొత్తం	108

నోట్- నాగోల్, నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి, పీఎఫ్ ఆఫీస్ తదితర నాలాలపై ఉన్న బ్రిడ్జిల వద్దా వర్టికల్ గార్డెన్లు ఉన్నాయి.


సీజ్ చేసిన వాటర్ బాటిల్స్‌తో బీఐఎస్ అధికారులు

వాటర్ బాటిల్స్ కంపెనీపై

బీఐఎస్ దాడి

● అక్రమంగా ఐఎస్ఐ మార్క్ ముద్రణ, బాటిళ్లు సీజ్

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఐఎస్ఐ మార్కును ముద్రిస్తూ పలు హోటళ్లు, వాణిజ్య కేంద్రాల పేర్లతో వాటర్ బాటిళ్లు తయారు చేస్తున్న కంపెనీపై బీఐఎస్ అధికారులు దాడులు చేశారు. గురువారం మూసాపేట్‌లోని వాటర్ బాటిళ్ల కంపెనీపై దాడులు నిర్వహించిన అధికారులు.. వేల సంఖ్యలో బాటిళ్లపై లైసెన్సు గడువు ముగిసినా ఐఎస్ఐ ముద్ర వినియోగిస్తున్నట్లు గుర్తించారు. దాదాపు 13 వేల ఆఫ్ లీటర్ వాటర్ బాటిళ్లు, 8వేల లీటరు బాటిళ్లు, 15వేల పావు లీటర్ బాటిళ్లను బీఐఎస్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ సవిత మాట్లాడుతూ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌తో పాటు ఏ ఉత్పత్తి అయినా బీఐఎస్ ధ్రువీకరణ లేకుండా ఐఎస్ఐ ముద్ర వినియోగించడం నేరమన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గోల్కొండ బోనాలకు వాటర్‌బోర్డు ఏర్పాట్లు

హైదరాబాద్‌సిటీ, జూన్19 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ బోనాలకు వాటర్‌బోర్డు ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకు జరిగే బోనాల ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు రానుండడంతో తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతోంది. గోల్కొండ కోట మెట్ల మార్గంలో భక్తుల తాగునీటి అవసరాలకు సుమారు రూ.15లక్షల వ్యయంతో చర్యలు చేపడుతున్నారు. దాదాపు పది లక్షల నీటి ప్యాకెట్లను పంపిణీ చేయడానికి కసరత్తు చేస్తున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఎక్కడా మురుగు ప్రవాహం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ఇప్పటికే వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి ఆదేశాలిచ్చారు.

పాఠశాల సమీపంలో భద్రతా లోపాలకు

యాజమాన్యానిదే బాధ్యత

పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్

ప్రమాదాల నివారణకు

ప్రామాణిక విధానం : కలెక్టర్

పాఠశాలల వద్ద డ్రోన్లతో నిఘా

: జాయింట్ సీపీ జోయల్ డేవిస్



6

రూ.249.21 కోట్లు

పేరుకుపోతున్న హెచ్‌టీ బకాయిలు

వసూళ్లపై డిస్కం ఫోకస్

అధికారుల నిర్లక్ష్యంపై సీఎండీ ఆగ్రహం

ముగ్గురు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లకు మెమోలు



హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలకు ఆదాయ మార్గమైన హెచ్‌టీ కనెక్షన్ల (వాణిజ్య, పరిశ్రమలు) పాత బకాయిల వసూళ్లపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టి సారించింది. హెచ్‌టీ కేటగిరీ విద్యుత్ సర్వీసుల (బిల్ స్టాప్‌డ్)పై సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇటీవల సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పలు సర్కిళ్లలో హెచ్‌టీ బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయినట్లు గుర్తించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రేటర్ పరిధి మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలో హెచ్‌టీ కేటగిరీలో 511 విద్యుత్ కనెక్షన్లకు రూ.249.21 కోట్ల విద్యుత్ బకాయిలు పేరుకుపోయినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. వాణిజ్య, పరిశ్రమలకు చెందిన నిర్వాహకుల్లో కొంతమంది పాత బకాయిలు చెల్లించకుండా మరొకరి పేరుతో కొత్త విద్యుత్ కనెక్షన్లు తీసుకున్నట్లు గుర్తించారు. పాత బకాయిలు చెల్లించకుండా కొత్త కనెక్షన్లు ఎలా మంజూరు చేస్తారంటూ ముగ్గురు

మిగతా 6వ పేజీలో..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పూడిక తీతలో జాప్యంపై

కమిషనర్ అసహనం

● వేగవంతం చేయాలని ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాలాల పూడికతీతలో జాప్యంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. 'మీరిచ్చే నివేదికల్లో వ్యర్థాల తొలగింపు దాదాపు పూర్తయినట్టు చూపుతున్నారు. కానీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల నుంచి పూడిక తీయలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. పలు ప్రాంతాల్లో పౌరులూ అదే విషయం చెబుతున్నారు. అసలు ఏం జరుగుతోంది..? క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించండి.. వర్షాలు కురిసే అవకాశమున్న దృష్ట్యా.. వ్యర్థాల తొలగింపును వేగవంతం చేయండి' అని గురువారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆదేశించారు. పూడికతీతలో జాప్యంపై ప్రకటనల్లోనే పూడిక తీత శీర్షికన ఈనెల 18న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది.

మెట్రో కార్డుదారులకు షాక్!

● పలు కారణాలతో జరిమానాలు



హైదరాబాద్ సిటీ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మెట్రో స్మార్ట్ కార్డు వినియోగదారులకు ఒక్కోసారి షాక్‌లు తగులుతున్నాయి. సిస్టమ్‌లో ఎర్రర్ వస్తుందని, కార్డు పనిచేయడం లేదని చెబుతూ సిబ్బంది పెనాల్టీల పేరుతో డబ్బులు తీసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎల్‌అండ్‌టీ సంస్థ కొన్ని నెలల క్రితం స్మార్ట్‌కార్డు, సూపర్ సేవర్ ఆఫర్ (ఎస్ఎస్ఓ)-59 డిస్కౌంట్, కాంటాక్ట్ లెస్ కార్డ్స్ (సీఎస్‌సీ) కార్డులను ప్రవేశపెట్టింది.



స్మార్ట్ కార్డులో మొదట ప్రయాణికుడు రూ.100తో కార్డును కొనుగోలు చేసి, ఆ తర్వాత ఎంతైనా రీచార్జ్ చేసుకోవచ్చు. కార్డుల ద్వారా ప్రయాణంపై 10 శాతం రాయితీ అందిస్తోంది.

సాంకేతిక సమస్యలు

స్మార్ట్‌కార్డు, టీసవారీ యాప్ లాంటి ఆన్‌లైన్ సేవలను వినియోగించుకుంటున్న కొంతమంది మెట్రో ప్రయాణికులకు సాంకేతిక సమస్యలు అసహనానికి గురిచేస్తున్నాయి. నాలుగు రోజుల క్రితం ఎల్‌బీ నగర్‌కు చెందిన ఓ ప్రయాణికుడు కార్డుతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు స్టేషన్‌లో మెట్రో ఎక్కాడు. ఎల్‌బీనగర్ స్టేషన్‌లో బయటకు వెళ్లేందుకు ఎగ్జిట్ గేటుపై ఉన్న స్క్రీన్‌పై కార్డు పెట్టగానే తలుపులు తెరుచుకున్నాయి. అయితే మరుసటి రోజు అదే ఎల్‌బీనగర్ స్టేషన్‌కు వచ్చి లోపలికి వెళ్లేందుకు ఎంట్రీ గేటు స్క్రీన్‌పై కార్డు పెడితే పనిచేయలేదు. దీంతో ఆయన పక్కనే ఉన్న టికెట్ కౌంటర్‌లో సంప్రదిస్తే, 'నిన్న రాత్రి మీరు కార్డు ద్వారా ఎగ్జిట్ కానట్లుగా చూపిస్తోంది. రూ.60 పెనాల్టీ కడితే కంప్యూటర్‌లో కార్డులో ఎగ్జిట్ అయినట్లు ఎంట్రీ చేస్తాం. దీంతో పాటు ఎగ్జిట్ చార్జీ రూ.56 కూడా కట్టాలి' అని సూచించారు. దీంతో ఆయన మొత్తం రూ.116 చెల్లించి కార్డును పునరుద్ధరించుకున్నాడు. మెట్రో రైళ్లతోపాటు స్టేషన్లలో కూడా ప్యాసింజర్లను సాంకేతిక సమస్యలు ఇబ్బందులు పెడుతుండడంతో వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



హిట్ అండ్ రన్ కేసుల్లో..

వాహనాల గుట్టురట్టు

● నాలుగు నెలల్లో.. 363 ప్రమాదాలు
● 103 కేసులను ఛేదించిన సైబరాబాద్ పోలీసులు

6



చర్లపల్లి చెరువుకు మహర్దశ

● అభివృద్ధికి హైడ్రా కసరత్తు
● పరిశీలించిన రంగనాథ్
● సీఎస్ఆర్ నిధులతో పనులు

6

వెలుగులు 40శాతమే

గ్రేటర్‌లో వెలగని వీధి దీపాలు

భారీగా పెరుగుతున్న ఫిర్యాదులు

అంబర్‌పేటలో కొత్త వంతెనపై చీకట్లు

బల్దియా నిర్వహణలోనూ మెరుగుపడని వైనం

టెలి కాన్ఫరెన్స్‌లో కమిషనర్ అసహనం


అంబర్‌పేట వంతెనపై వెలగని వీధి దీపాలు, (ఇన్‌సెట్లో) వంతెనపై బీరు సీసాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట 6 నంబర్ వంతెనను మే 5వ తేదీన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించారు. ప్రస్తుతం వంతెనపై వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో కొందరు మద్యం తాగి, ఆ మార్గంలో వచ్చే వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. నెల క్రితం ప్రారంభించిన వంతెనపైనే ఈ పరిస్థితి ఉంటే నగరంలోని ఇతర ప్రాంతాల్లో రహదారులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. 5.50 లక్షలకు పైగా వీధి దీపాల స్తంభాలు ఉండగా, అందులో 40 శాతంలోపే వెలుగుతున్నాయని ఇటీవల జీహెచ్‌ఎంసీ నిర్వహించిన సర్వేలో గుర్తించడం గమనార్హం. గ్రేటర్‌లో వీధి దీపాల పరిస్థితి మెరుగుపడడం లేదు. అవసరమైన లైట్లు, ఇతర సామగ్రి సమకూర్చుతున్నాం.. వీలైనంత మేర గ్లోయింగ్ పర్సంటేజీ పెంచుతామని అధికారులు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయి. నగరంలోని ఏ రోడ్డులో చూసినా సగానికిపైగా వీధి దీపాలు వెలగడం లేదు. దీపాలు వెలగని ప్రాంతాలను(బ్లాక్ స్పాట్స్) అడ్డాలుగా మార్చుకుంటూ కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మహిళలను ఇబ్బందులకు గురి చేయడం, చైన్ స్నాచింగ్‌కు పాల్పడడం వంటివి చేస్తున్నారు. అయినా బల్దియా మాత్రం అలవాటైన శైలిలో 'పనులు చేస్తున్నాం. పరిశీలిస్తున్నాం' అని చెబుతుండడం గమనార్హం. జోనల్ కమిషనర్లకు వీధి దీపాల మరమ్మతుకు

మిగతా 6వ పేజీలో..

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం

ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసాలకు పాల్పడుతున్న ముఠాలోని ఇద్దరు సభ్యులను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్, లాలాగూడ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారు. నాచారం ప్రాంతానికి చెందిన నస్రీన్ బేగం (40), బేగంపేటకు చెందిన సయ్యద్ అలీ (23)తో కలిసి నాచారంలో 'వరల్డ్ వైడ్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ' ప్రారంభించింది. ఇందులో తన చెల్లి ఫాతిమాతో పాటు మరో యువతి రేఖను ఉద్యోగులుగా నియమించుకుంది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సోషల్‌మీడియాలో ప్రచారం చేసి, సంప్రదించిన వారి నుంచి అందినకాడికి వసూలు చేసేవారు. ఈ ముఠా సభ్యులు 11మంది నుంచి రూ.34 లక్షల వరకు వసూలు చేసి మోసం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు లాలాగూడ ప్రాంతంలో ఉన్న నస్రీన్ బేగం, సయ్యద్ అలీలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 9 పాస్‌పోర్టులు, 5 విజిటింగ్ వీసా కాపీలు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.


నిందితులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి


స్టేడియంలో ఏర్పాటు చేసిన యోగా ఫొటోలను తిలకిస్తున్న కిషన్‌రెడ్డి

యోగా కౌంట్‌డౌన్

● నేడు ఎల్బీ స్టేడియంలో ప్రారంభం
● ఏర్పాట్లను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 24 గంటల ముందు ఎల్బీ స్టేడియంలో యోగా కౌంట్‌డౌన్ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కేంద్ర ఉక్కు, బొగ్గు గనుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 5.30కు ఈ కౌంట్‌డౌన్ వేడుకలు ప్రారంభం కానున్నాయి. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ శాఖ మంత్రి శ్రీనివాసవర్మ, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, రఘునందన్‌రావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సినీ నటులు కుష్బూ, మీనాక్షి చౌదరి, సాయిధరమ్‌తేజ్, తేజ తదితరులు పాల్గొననున్నారు. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం సాయంత్రం స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. వికసిత్ భారత్‌గా అభివృద్ధి చెందాలంటే ప్రతీ వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రధాని మోదీ ఆశయమని కిషన్‌రెడ్డి అన్నారు. విశాఖపట్నంలో జరిగే వేడుకల్లో ప్రధాని మోదీ పాల్గొంటున్నారని తెలిపారు.



సమ్మె నోటీస్ అందించిన టీవీజేఏసీ నాయకులు

ఆర్టిజన్లకు అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలి

● తెలంగాణ విద్యుత్‌ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ

● విద్యుత్ సంస్థ యాజమాన్యాలకు సమ్మె నోటీస్

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు అర్హతనుబట్టి కన్వర్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్‌ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ సంస్థ యాజమాన్యాలకు గురువారం సమ్మె నోటీస్ అందజేశారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్‌లకు అర్హతబట్టి కన్వర్షన్ ఇవ్వాలని, ఆర్టిజన్‌లకు ప్రస్తుత సర్వీస్ రూల్స్ అమలు చేయాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీష్, టీజీ ట్రాన్స్‌కో జేఎండీ సూర్యప్రకాష్, టీజీ ఎస్‌పీడీసీఎల్ ఎండీ ముషారఫ్ అలీఫారూకీలకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కె.నాగేశ్వరరావు, కన్వీనర్ ఎంఏ వజీర్, కోచైర్మన్ గాంబో నాగరాజు, సురేందర్, కందికొండ వెకంటేష్, సెక్రెటరీలు ఎస్.చంద్రారెడ్డి, లింగం, మురళి, ఆర్గనైజింగ్ సెక్రట రీలు పి.కోటి, సలీంపాషా, ప్రసాద్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

భద్రత లోపాలకు స్కూల్ యాజమాన్యానిదే బాధ్యత

● సీపీ సీవీ ఆనంద్



కార్యక్రమంలో పాల్గొన్న సీపీ సీవీ ఆనంద్, కలెక్టర్ హరిచందన, డీఈఓ రోహిణి తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సుల తనిఖీ, భద్రత ఏర్పాట్లపై పాఠశాల యాజమాన్యం దృష్టి సారించాలని, స్కూల్ సమీపంలోని 200 మీటర్ల పరిధిలో జరిగే భద్రతా లోపాలకు పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించాల్సి వస్తుందని, నగర సీపీ సీవీ ఆనంద్ హెచ్చరించారు. విద్యార్థుల భద్రతపై ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీ పాల్గొని మాట్లాడారు. రోడ్డు నిబంధనలు పాటించని కారణంగా గత మూడేళ్లలో 8 మంది చిన్నారులు మృత్యువాత పడ్డారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. స్కూల్ యాజమాన్యాలు, డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సూచించారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా ప్రామాణిక విధానం (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) రోహిణి మాట్లాడుతూ స్కూల్ బస్సుల్లో తప్పనిసరిగా మహిళా సహాయకులను ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌లు సరిచూసుకోవడంతో పాటు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్ మాట్లాడుతూ పాఠశాలల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించేందుకు త్వరలో డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ గోపాల్, ట్రాన్స్‌పోర్ట్ జాయింట్ కమిషనర్ రమేష్, కంటోన్మెంట్ బోర్డ్ సీఈఓ మధుకర్‌నాయక్, హెచ్‌సీఎస్‌సీ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి, పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ లింగయ్యతో పాటు ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

సరిత మహిళలకు ఆదర్శం: మంత్రి కొండా సురేఖ



సరితను అభినందిస్తున్న మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో తొలి మహిళా డ్రైవర్‌గా విధుల్లో చేరిన సరిత ఎంతోమంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారని మంత్రి కొండా సురేఖ అన్నారు. మంత్రి కొండా సురేఖను ఆమె నివాసంలో డ్రైవర్ సరిత గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుటుంబ పరిస్థితిని సరిత మంత్రికి వివరించగా.. వీలైన సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా సరితను సన్మానించి మంత్రి కొండా సురేఖ అభినందించారు.

బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై కేసు కొట్టివేత

జైలు నుంచి విడుదలై విజయోత్సవం చేసుకున్నట్టు ఆరోపణ

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు రాజాసింగ్‌కు నాంపల్లి కోర్టులో ఊరట లభించింది. మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసి అరెస్టైన కేసులో బెయిల్‌పై వచ్చి ఓ వర్గం వారిని రెచ్చగొట్టేలా రాజాసింగ్, అతడి అనుచరులు విజయోత్సవాలు చేసుకున్నారనే కేసును కొట్టివేసింది. ఆయనపై 2022 ఆగస్టులో మంగళ్‌హాట్ పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని 14వ మెట్రోపాలిటన్ కోర్టు రెండున్నరేళ్ల సుదీర్ఘ విచారణానంతరం ఈ కేసులో సరైన సాక్ష్యాధారాలు లేవంటూ కొట్టేసింది. పాకిస్తానీ స్టాండప్ కమిడియన్ మునావర్ ఫరూకీ హిందు దేవుళ్ల గురించి అవమానకరంగా వ్యాఖ్యానిస్తూ చేసిన వీడియోకు కౌంటర్‌గా రాజాసింగ్ ఒక వీడియో చేసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మహ్మద్ ప్రవక్తను కించపర్చేలా రాజాసింగ్ ఆ వీడియోలో వ్యాఖ్యలు చేశారని ముస్లింలు పెద్ద ఎత్తున నిరసన తెలపడంతో ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. వెంటనే బెయిల్‌పై విడుదలయ్యాడు. ఇంటికి వచ్చాక రాజాసింగ్, అతడి అనుచరులు ముస్లిం మతస్థులను రెచ్చగొట్టేలా విజయోత్సవాలను చేసుకున్నారని మహ్మద్ జహంగీర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ కేసునే కోర్టు కొట్టివేసింది.



వెలుగులు 40శాతమే

(5వ పేజీ తరువాయి)

అవసరమైన మెటీరియల్, సిబ్బందితో సేవలు చేయించుకునే అధికారం ఇచ్చినా అదే దుస్థితి నెలకొంది.

సమస్య పరిష్కరించండి : కర్ణన్

వీధి దీపాలు వెలగడం లేదన్న ఫిర్యాదులు ఎక్కువగా వస్తోన్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు, జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీధి దీపాలు, పూడికతీత, పారిశుధ్యం, దోమల నివారణ, ఆస్తి పన్ను వసూళ్లపై పలు సూచనలు చేశారు. 100 కంటే ఎక్కువ మంది ఉండే పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు దోమల నివారణ పట్ల అవగాహన కల్పించాలని సూచించారు.

రూ.249.21 కోట్లు

(5వ పేజీ తరువాయి)

సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లకు దక్షిణ డిస్కం మోమోలు జారీ చేసింది.

రంగారెడ్డి జోన్‌లో అత్యధికం

బకాయిల్లో అత్యధికంగా రంగారెడ్డి జోన్‌లో రూ.177.51 కోట్లు పేరుకు పోయాయి. మేడ్చల్ జోన్‌లో 313 హెచ్‌టీ కనెక్షన్లకు రూ. 65.75 కోట్లు, మెట్రోజోన్‌లో 31 హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లకు రూ. 5.95 కోట్ల మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయి. వాణిజ్య పరిశ్రమలకు పాత బకాయిలుంటే వాటిని చెల్లించేవరకు ఆ పరిశ్రమలున్న ప్రాంతంలో కొత్త కనెక్షన్లు ఇవ్వరాదని నిబంధనలు చెబుతున్నాయి. కొంతమంది పాతబకాయిలు చెల్లించకుండానే మరో పేరుతో కనెక్షన్లు తీసుకుంటూ కరెంటు వినియోగిస్తున్నారు. కొంత మంది అధికారులు వారికి సహకరిస్తున్నారు.

ఎస్‌ఓటీ పోలీసులమంటూ వ్యాపారికి బురిడీ

(5వ పేజీ తరువాయి)

జవహర్‌నగర్ ఎస్‌ఓటీలో పనిచేస్తున్నాని ఐడీ కార్డు చూపించాడు. వెంటనే ఐదుగురు ముఠా సభ్యులు ముందుగా వేసుకున్న పథకం ప్రకారం హరిరామ్‌పై దాడి చేసి అతని వద్ద ఉన్న రూ.72,76,200 డబ్బు లాక్కొని అప్పటికే కింద సిద్ధంగా ఉన్న కారు, రెండు బైకుల మీద పారిపోయారు. బాధితుడు మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ముఠాలోని కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని, పరారీలో ఉన్న మిగతా వారి కోసం మార్కెట్, టాస్క్‌ఫోర్సు పోలీసులు గాలిస్తున్నారు.





పెళ్లైన ఆరునెలలకే నిండు నూరేళ్లు

● దుర్గం చెరువులోదూకి ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

● మృతురాలు మూడు నెలల గర్భవతి

● వరకట్న వేధింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు

హైటెక్ సిటీ, జూన్ 19 ఆంధ్రజ్యోతి): అత్తారింటి వేధింపులు తాళలేక పెళ్లైన ఆరునెలలకే ఓ ఇల్లాలు దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుని తనువు చాలించింది. మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్టకు చెందిన సుష్మ(27)కు నగరంలోని నేరేడ్‌మెట్ ప్రాంతానికి చెందిన అమృత్(30)తో వివాహం జరిగింది. ఆ సమయంలో కట్నకానుకల కింద రూ. 5 లక్షల నగదు, 6 తులాల బంగారు ఆభరణాలు సుష్మ తల్లిదండ్రులు ఇచ్చారు. వివాహం అనంతరం నేరేడ్‌మెట్‌లోని అత్తారింట్లోనే ఉంటున్నారు. కాగా సుష్మ హైటెక్ సిటీలో ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. ప్రస్తుతం మూడు నెలల గర్భవతిగా ఉందని తెలుస్తోంది. ఇటీవల అనారోగ్యానికి గురైన సుష్మ తల్లిదండ్రుల వద్దకు వచ్చి చికిత్స తీసుకుంటోంది. విధుల్లో భాగంగా ఎప్పటిలాగే బుధవారం కార్యాలయానికి వెళ్లిన కుమార్తె ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తండ్రి అంజయ్య గురువారం తెల్లవారుజామున మాదాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని గాలింపుచర్యలు మొదలుపెట్టారు. అయితే ఉదయం 7గంటల ప్రాంతంలో దుర్గం చెరువులో ఓ యువతి శవం తేలినట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు అక్కడకు వెళ్లి చూడగా మృతదేహం సుష్మదిగా గుర్తించారు. సుష్మ మృతికి అత్తింటి వేధింపులే కారణమని సుష్మ తల్లితండ్రులు ఆరోపిస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపారు. ఆమె మృతిపై భర్త, అత్త మామ, మరిదిపై 304బీ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ బూటకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

నల్లకుంట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా మారేడుమిల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్ బూటకమని, దానిపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని ప్రొఫెసర్ జి.హరగోపాల్ డిమాండ్ చేశారు. కేంద్రం, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులను చంపి ఎన్‌కౌంటర్ పేరిట కట్టుకథలు చెబుతున్నాయని మండిపడ్డారు. పౌర హక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్‌తో కలిసి హైదర్‌గూడలో గురువారం విలేకరులతో మాట్లాడారు. మారేడుమిల్లి అటవి ప్రాంతంలో ఈ నెల 18న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్‌తో పాటు ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు అరుణ, అంజులు కూడా చనిపోయారని తెలిపారు. అటవి ప్రాంతంలో ఉన్న భౌతిక పరిస్థితులను చూస్తే సజీవంగా పట్టుకుని కాల్చి చంపినట్లు స్పష్టమవుతోందన్నారు. చట్టాలను, రాజ్యాంగాన్ని పాలకులు ఖాతరు చేయడం లేదని ధ్వజమెత్తారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో కలిసి గ్రేహౌండ్స్ బలగాలను ఉపయోగించి ఎన్‌కౌంటర్లు చేపిస్తూ మావోయిస్టులపై ప్రతీకారం తీర్చుకుంటున్నారని ఆరోపించారు. మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు శవాన్ని కూడా ఏపీలోకి రానీవ్వకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. న్యాయస్థానాలు తమకు పట్టనట్లుగా ఉండడం వల్ల ప్రభుత్వాలు ఇష్టానుసారంగా ప్రజలపై హింసను ప్రయోగిస్తున్నాయని విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి కాల్పుల విరమణ వెంటనే ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో ఇప్పటికైనా చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

58 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టారు. మల్కాజిగిరి ప్రాంతంలో నిఘా పెట్టిన ఎక్సైజ్ అధికారులు దున్న అనే వ్యక్తి ఇంట్లో 30 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఘట్కేసర్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కారులో డిఫెన్స్ మద్యం బాటిళ్లు సరఫరా చేస్తున్న మెరుగు నిఖిల్‌ను అరెస్ట్ చేసి 28 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. గడిచిన నెల రోజుల వ్యవధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు పలు ప్రాంతాల్లో 1188 డిఫెన్స్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసిం తెలిపారు.

కల్తీ మద్యం తయారీదారుడి అరెస్ట్

ఖరీదైన మద్యం బాటిళ్లలో తక్కువ ధర మద్యం పోసి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. కాచిగూడ ఉస్మాన్‌నగర్‌లో ఉంటున్న శ్రీనివాసరావు ఇంట్లోనే నకిలీ మద్యం బాటిళ్లు తయారు చేసి విక్రయిస్తున్నాడు. పార్టీల్లో ఖాళీ చేసిన ఖరీదైన మద్యం బాటిళ్లు కొనుగోలు చేసి, వాటిలో తక్కువ ధర మద్యం నింపి మార్కెట్ ధరకు విక్రయిస్తున్నాడు. ఇతడి ఇంటిపై దాడి చేసిన ఎక్సైజ్ పోలీసులు ఖరీదైన మద్యం ఖాళీ బాటిళ్లతో పాటు తక్కువ ధర మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.



పద్మశ్రీ మంద కృష్ణమాదిగ, జ్యోతి దంపతులను సన్మానిస్తున్న వీహెచ్‌పీఎస్ జాతీయ, రాష్ట్ర కమిటీ నాయకులు


మాదిగలు, దివ్యాంగులు, అణగారిన వర్గాలకు దక్కిన గౌరవం

● పద్మశ్రీ అవార్డుపై మంద కృష్ణమాదిగ

మన్సూరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డును తాను అందుకున్నప్పటికీ అది యావత్ మాదిగలు, దివ్యాంగులు, అణగారిన వర్గాలకు దక్కినదిగా తాను భావిస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ అన్నారు. పద్మశ్రీని అందుకోవడాన్ని హర్షిస్తూ నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ సెంటర్‌లో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం మంద కృష్ణమాదిగకు సన్మాన సభను నిర్వహించారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంద కృష్ణమాదిగతో పాటు ఆయన సతీమణి జ్యోతిని ఘనంగా సన్మానించారు. అనంతరం మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ 1994లో ఒక కులం కోసం ప్రారంభమైన తన పోరాట ప్రస్థానం అణగారిన అన్ని వర్గాల కోసమూ సాగిందని వివరించారు. ఈ పద్మశ్రీ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ముసాయిదా కమిటీ, వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్‌రావు, కో చైర్మన్ అందె రాంబాబు, జాతీయ కమిటీ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ, మహిళా అధ్యక్షురాలు ఎస్.భవానీ చౌదరి, వీహెచ్‌పీఎస్ ఏపీ అధ్యక్షుడు అన్యం చిన్న సుబ్బయ్య యాదవ్, ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్‌మాదిగ, ప్రధానకార్యదర్శి ఉపేందర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మేనత్తను హత్య చేసిన కేసులో నిందితుడికి ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి జీవితఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మమ్మ(53) భర్త సత్తయ్య, ఇద్దరు కొడుకులు రాజు, కిరణ్ కుమారులతో కలిసి నగర శివార్లలోని ఇంజాపూర్‌లో స్థిరపడ్డారు. సత్తయ్య వాచ్‌మన్‌గా, లక్ష్మమ్మ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. లక్ష్మమ్మ సొంత అన్న కొడుకు మాదగోని రాజు(29) కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీలో ఉంటూ కారు డ్రైవింగ్ పని చేస్తున్నాడు. లక్ష్మమ్మ వద్ద రాజు కొన్ని నెలల క్రితం కొంత డబ్బును వడ్డీకి తీసుకున్నాడు. అసలు చెల్లించగా వడ్డీ ఇవ్వలేదు. 2024 ఫిబ్రవరి 17న లక్ష్మమ్మ ఇంటికి రాజు వెళ్లాడు. ఈ సందర్భంగా లక్ష్మమ్మ తనకు రావాల్సిన వడ్డీ డబ్బులు ఇవ్వాలని నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో క్షణికావేశానికి గురైన రాజు పక్కనే ఉన్న సిమెంట్ ఇటుకతో లక్ష్మమ్మ తలపై పలుమార్లు కొట్టాడు. దీంతో ఆమె తల పగిలి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. లక్ష్మమ్మ కొడుకు కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తు అనంతరం కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



సుగుణమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

రజకార్లను ఎదిరించిన ధైర్యశాలి సుగుణమ్మ

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మియాపూర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దోపిడీ, అసమానతల పునాదిని ప్రశ్నించే ఉద్యమ నిర్మాణంలో ఒకరు.. నిరంకుశ నిజాం సైన్యానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసిన ధైర్యశాలి సుగుణమ్మ అని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ అన్నారు. సోమవారం రాత్రి11గంటలకు మృతిచెందిన సుగుణమ్మ పార్థవదేహాన్ని ప్రజల సందర్శనార్థం కొండాపూర్ సీఆర్.ఫౌండేషన్‌లో ఉంచారు. ఆమె భౌతిక కాయానికి నారాయణ, సీపీఐ ఎమ్మెల్సీ నేలకంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు నివాళులు అర్పించారు.

కథ అడ్డం తిరిగింది

● కోడలిపై కత్తితో దాడి చేసిన మామ

● కేసు నుంచి తండ్రిని తప్పించేందుకు నేరం తనపై వేసుకున్న కొడుకు

● చివరకు నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కత్తితో దాడి కేసులో వృద్ధుడైన తండ్రి జైలుకు వెళితే పరువుపోతుందని కుమారుడు నేరం తన మీద వేసుకోవాలనుకున్నాడు. ఇందుకు కుటుంబసభ్యులంతా సహకరించారు. చివరకు పోలీసులు తనదైన శైలిలో విచారణ చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకృష్ణానగర్‌లో నివసించే అరుణ్‌ప్రసాద్ మేఘకృష్ణ నిర్మాణ సంస్థలో అకౌంటెంట్. భార్య, కుమారుడు, తండ్రితో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నాడు. తండ్రి వెంకటేశ్వరరావు జూనియర్ ఆర్టిస్ట్. కోడలు జయలక్ష్మిపై తరచూ చికాకు పడుతుంటాడు. ఈనెల 18న ఆమెతో గొడవ పడ్డాడు. ఇంట్లో కూరగాయలు కోసే కత్తితో దాడి చేశాడు. ఆమె మెడ వెనక భాగంలో తీవ్ర గాయమైంది. విషయం తెలుసుకున్న అరుణ్‌ప్రసాద్ ఇంటికి వచ్చి జయలక్ష్మిని ఆస్పత్రికి తరలించాడు. ఆమెకు ప్రాణాపాయం లేదని తెలుసుకున్నాడు. తండ్రి జైలుకు వెళితే కుటుంబ పరువు పోతుందని భావించిన అరుణ్‌ప్రసాద్ నేరం తన మీద వేసుకోవాలని భావించాడు. ఇదే విషయాన్ని భార్యకు చెప్పి ఒప్పించాడు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు జూబ్లీ హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబసభ్యుల వాంగ్మూలం తీసుకునే సమయంలో పొంతన లేని సమాధానాలు వచ్చాయి. వెంకటేశ్వర రావు తనకు ఆరోగ్యం బాగోలేదంటూ హడావిడి చేశాడు. పోలీసులకు అనుమానం వచ్చి లోతుగా ప్రశ్నించగా నేరం చేసింది వెంకటేశ్వరరావు అని తేలింది. అతడిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో 7 నెలల గర్భిణి దుర్మరణం

రాజేంద్రనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో 7 నెలల గర్భిణి గురువారం దర్మరణం చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... వికారాబాద్ జిల్లాకు చెందిన సయ్యద్ జమీర్, అస్రా ఫాతిమ భార్యాభర్తలు. ప్రస్తుతం వీరు బాలాపూర్‌లో నివాసం ఉంటున్నారు. అస్రా ఫాతిమా 7 నెలల గర్భిణి కావడంతో ఆమెను, నాలుగు సంవత్సరాల కుమార్తెను భర్త జమీర్ తన(టీఎస్ 07 జీపీ 4768) స్కూటీపై గురువారం పిల్లర్ నెంబర్ 90 జ్యోతినగర్ వద్ద ఉన్న బటర్‌ఫ్లై ఆస్పత్రిలో చూపించుకొని తిరిగి బాలాపూర్ వెళ్తున్నారు. వారు అత్తాపూర్ నుంచి హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి పిల్లర్ నెంబర్ 199 డీ మార్ట్ వద్దకు రాగానే అక్కడ ఓ కారు పార్కు చేసి ఉంది. ఆ కారు డోర్‌ను సడన్‌గా లోపల ఉన్న వ్యక్తులు తెరవగా, సయ్యద్ జమీర్ స్కూటీకి తగిలింది. దీంతో జమీర్‌తో పాటు ఆస్రా ఫాతిమా, కుమార్తె కింద పడిపోయారు. వెనుకాల వస్తున్న బండ్లగూడ ఆర్టీసీ బస్సు డిపోకు చెందిన 300 నెంబర్ రూట్ బస్సు (టీఎస్ 03జెడ్ 0353) అస్రా ఫాతిమాకు బస్సు ఢీ కొంది. ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందింది. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి



నార్సింగి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కోకాపేట్ గ్రామం నియోపోలిస్ లేఅవుట్ సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళ పడిపోయిందని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకోగా సుమారు 50 నుంచి 60 ఏళ్ల వయస్సున్న మహిళ గాయలతో పడిపోయింది. ఆమెను ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొట్టివుంటుందని అనుమానం వ్యక్తం చేశారు. బాధితురాలిని వెంటనే కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. మెరుగైన చికిత్స కోసం ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఈ మహిళ గురించి ఎవరికైనా సమాచారం తెలిస్తే నార్సింగి పోలీసులను 9491039034ను సంప్రదించాలని కోరారు.

భర్త ఇంటి ఎదుట భార్య న్యాయ పోరాటం



భర్త ఇంటి ఎదట బైఠాయించిన భార్య

నార్సింగి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): భర్త రెండో పెళ్లికి సిద్ధమవ్వడంతో భార్య న్యాయ పోరాటానికి దిగిన సంఘటన గురువారం రాత్రి నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. భర్త ఇంటి ఎదటే తన తల్లితో కలిసి ప్లకార్డులు చేత పట్టు కొని బైఠాయించింది. వివరాల్లోకి వెళ్తేతే.. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్‌లోని సాయి బాలాజీనగర్ కాలనీ రోడ్ నెంబర్-4లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీధర్‌కుమార్, ఆయన భార్య స్రవంతి నివాసముంటారు. ఐదేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న స్రవంతిని ప్రేమ పేరుతో శ్రీధర్‌కుమార్ వెంట పడ్డాడు. అతని ప్రేమ నిజమని నమ్మిన స్రవంతి తల్లిదండ్రులను ఎదిరించి మరీ ప్రేమ వివాహం చేసుకుంది. అయితే నా ఇంట్లో నుంచి వెళ్లిపో.. నేను వేరే అమ్మాయితో వివాహం చేసుకుంటానంటూ ఇటీవల శ్రీధర్‌కుమార్ బెదిరింపులకు దిగుతున్నాడు. తనకు న్యాయం కావాలని భర్త ఇంటి ఎదుట మౌన పోరాటం చేస్తోంది. పెళ్లైన నాలుగు నెలల నుంచే వేదిస్తున్నాడని, పిల్లలు కాకుండా తరచూ టాబ్లెట్స్ వేశారని, తనకు న్యాయం జరిగేంత వరకు కదిలేది లేదంటూ స్రవంతి భర్త ఇంటి ఎదుట భీష్మించి కూర్చున్నారు.

బీదర్ నుంచి నగరానికి గంజాయి

- నలుగురు యువకుల అరెస్ట్

రాజేంద్రనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బీదర్ నుంచి ఎండు గంజాయిని నగరానికి తీసుకొస్తున్న నలుగురు యువకులను రాజేంద్రనగర్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. బుద్వేల్‌కు చెందిన డి.జగదీశ్(22), చింతల్‌మెట్‌కు చెందిన ఎం.రాంకుమార్(23), బుద్వేల్‌కు చెందిన బి.మనోజ్(19), బి.నాగేందర్(21) కలిసి కారులో బీదర్ వెళ్లి బీదర్‌కు చెందిన మహేశ్ అనే వ్యక్తి వద్ద ఐదు కిలోల ఎండు గంజాయిని తీసుకొస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ పోలీసులు గురువారం వాహనాలను తనిఖీ చేస్తుండగా గంజాయి కలిగి ఉన్న కారును ఆపి తనిఖీ చేసి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేశారు. నలుగురు యువకులను రిమాండ్‌కు తరలించిన రాజేంద్రనగర్ పోలీసులు గంజాయి సరఫరా చేసిన బీదర్‌కు చెందిన మహేశ్ కోసం గాలిస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం



ఇంటి నుంచి వెళ్ళిపోయిన తల్లి రాధ ఇద్దరు పిల్లలు

పహాడిషరీఫ్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పహాడిషరీఫ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైంది. ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. నిత్య ఎంక్లేవ్‌లో నివాసం ఉండే జటవత్ వెంకటేష్, రాధ, భార్యాభర్తలు, వీరికి ఇద్దరు కుమారులు, సుశాంత్, శ్రీశాంత్, భార్య భర్తలు తరచూ గొడవ పడుతుంటారు. ఈనేల 17న గొడవ పడ్డ తర్వాత భర్త పనికి వెళ్లి బుధవారం సాయంత్రం ఇంటికి రాగ భార్య పిల్లలు కనిపించలేదు. బస్తీ పరిసరాల్లో బంధువుల ఇళ్ల వద్ద వేదికినా ఆచూకీ లభించక పోవడంతో వెంకటేష్ గురువారం పహాడిషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారత ప్రజల భద్రతపై ఎస్ఐఓ ఆందోళన



ఇరాన్ కాన్సుల్ జనరల్ మహ్దీ షారోఖిని కలిసిన ఎస్ఐఓ బృందం

మదీన, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇజ్రాయెల్ దాడులవల్ల ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ ప్రజల పట్ల తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని ఇస్లామిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఐఓ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఫరాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి అనీస్ ఉర్ రెహ్మాన్, కార్యదర్శి మహ్మద్ అహ్మదుద్దీన్ అన్నారు. ఈమేరకు గురువారం వారు ఇరాన్ కౌన్సిల్ జనరల్ మహ్దీ షారోఖిని కలిసి సానుభూతిని తెలియజేశారు. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ విద్యార్థులు ముఖ్యంగా హైదరాబాద్, తెలంగాణ నుంచి వెళ్లినవారి భద్రత పట్ల తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. భారత ప్రభుత్వం, ఇరాన్ దౌత్య మిషన్‌తో సంప్రదించి భారతీయుల భద్రతల కోసం అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

22న వరంగల్ భద్రకాళి అమ్మవారికి బంగారు బోనం



చాంద్రాయణగుట్ట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ భద్రకాళి అమ్మవారికి ఆదివారం బంగారు బోనం సమర్పించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ మారుతీ యాదవ్, కన్వీనర్ జి.అరవింద్‌కుమార్ గౌడ్, మాజీ చైర్మన్ కె.వెంకటేశ్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ విచ్చేసి సంప్రదాయ బద్ధంగా అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారని తెలిపార. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కూడా పాల్గొంటారని తెలిపారు.

ఎఫ్‌టీఎల్ పేరుతో పేదల గూడు కూల్చవద్దు

- ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ఖబా కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

పహాడిషరీఫ్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం వచ్చినప్పటినుంచి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. గురువారం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఖబా కాలనీలో పర్యటించారు. బుధవారం రెవన్యూ, ఇరిగేషన్ అధికారులు ఎఫ్‌టీఎల్ మార్క్ చేశారని తెలియడంతో బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పర్యటించాగా స్థానిక మహిళలు రోదిస్తూ పదిహేను సంవత్సరాలుగా ఇళ్లు నిర్మించుకొని అన్ని అనుమతులు తీసుకొని నివసిస్తున్నామని, ఇప్పుడు అధికారులు మార్క్ చేశారని రోదిస్తూ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వెంటనే సబితా ఇంద్రారెడ్డి బాలాపూర్ తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ.. ఇక్కడ ఏదైనా చేయాలంటే ఎమ్మెల్యేగా తనకు సమాచారం ఇవ్వాలని, ప్రజలు కష్టపడి ఒక్కొక్క రూపాయి కూడబెట్టి నిర్మించుకున్న ఇళ్లు వీరికి జీవనాధారంగా మారాయి. వీళ్లు అక్రమంగా భూమిని ఆక్రమించిన వారు కాదు. రెక్కాడితే డొక్కాడే జీవితం గడిపే సామాన్య ప్రజల ఇళ్లు కూల్చేయడం అన్యాయం. ఈ చర్యలు మానుకోవాలని హైడ్రా ప్రజలు భరోసాతో ఉండేలా చూడడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. పదిహేను సంవత్సరాలుగా ఉంటున్నా కుటుంబాలను రోడ్డు పాలు చేయవద్దన్నారు. అనంతరం జల్‌పల్లి మున్సిపాలిటీ 28వ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను కూడా ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, షర్ఫుద్దీన్ హమేద్, సూరెడ్డి కృష్ణారెడ్డి, పల్లపు శంకర్, వై.అర్జున్, సయ్యద్ బదర్, సయ్యద్ హుస్సేని, షేక్ మహమ్మద్, అజీమ్ ఖాన్, ఫైసల్ ఖాన్, సలీం, ఆరిఫ్ అలీ, అలీ మన్సూరి, మాఖ్దూమ్ పటేల్, మేరాజ్ ఖాన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



నేడు మాతా పోచమ్మ ఆలయ వార్షికోత్సవం

రాజేంద్రనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ మాతా పోచమ్మ ఆలయం 18వ వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 7:30 గంటలకు పంచామృత అభిషేకం, 10 గంటలకు ఓడి బియ్యం కార్యక్రమంతో పాటు కుంకుమార్చన, లలితా సహస్రానామ పారాయణం ఉంటాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యంలో పూజలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

గండిపేట జలాశయంలోకి మురుగు.. స్పందించిన అధికారులు





ఆయిల్ బాల్స్‌ను నీళ్లల్లోకి విసురుతున్న మున్సిపల్ సిబ్బంది, బుల్కాపూర్ నాలాను అధ్యయనం చేస్తున్న డీఈఈ నరేశ్‌కుమార్ బృందం

నార్సింగ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గండిపేట జలాశయంలోకి బుల్కాపూర్ నాలా ద్వారా మురిగునీరు చేరే ప్రమాదం ఉందన్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో గురువారం వచ్చిన ప్రత్యేక కథనానికి నార్సింగ్ మున్సిపల్ అధికారులు స్పందించారు. వెంటనే కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శానిటరీ సూపర్‌వైజర్ లచ్చిరాం జన్వాడ గ్రామానికి వెళ్లి పారిశుధ్య సమస్యపై దృష్టిని కేంద్రీకరించారు. ఇందులో భాగంగా నీళ్లలో ఆయిల్‌బాల్స్ వేయడంతో పాటు మురుగునీరు ద్వారా స్థానికులకు ఎలాంటి రోగాలు రాకుండా మందులను పిచికారీ చేశారు. ఇందులో నీటిని డ్రైయింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఈ విషయంపై తమ మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ప్లానింగ్ చేస్తున్నారని గండిపేటలో కలవకుండా ప్రయత్నిస్తున్నామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం తెలిపారు. ఇక నార్సింగ్ మున్సిపాలిటీ డీఈఈ నరేశ్‌కుమార్ ఈ బుల్కాపూర్ నాలాను శుభ్రం చేస్తూ గండిపేటలో కలవకుండా కోకాపేట్ వైపు ఎలా తిప్పొచ్చనే విషయంపై అధ్యయనం చేశారు. ఆయన బృందం జన్వాడ, మిర్జాగూడ ప్రాంతంలో బుల్కాపూర్ నాలాను సర్వే చేశారు. ఈ సమస్యకు రెండు, మూడు శాఖలు కలిసి పనిచేసే అవకాశం ఉండడంతో ఆ దిశగా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఏదిఏమైనా అదిపెద్ద సమస్యను వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'కి, స్పందించిన అధికారులకు జన్వాడ, మిర్జాగూడ, ఖానాపూర్, గండిపేట ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/uT6oTteలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు. నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

అర్హులకు రేషన్ కార్డులు జారీ చేయాలి



ఏఎస్ఓ పుష్పలతతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌యాదవ్, ధనరాజ్, రాజ్‌కుమార్ తదితరులు

గన్‌పార్క్, జూన్ 19, (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలో అర్హులైన పేదలకి రేషన్ కార్డులు అందించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం టీపీసీసీ గోషామహల్ నియోజకవర్గ మీడియా సెల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో నాంపల్లి పౌర సరఫరాల శాఖ సహాయ కార్యాలయంలో ఏఎస్ఓ పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షుడు ఎస్.ధనరాజ్, జాంబాగ్ డివిజన్ అధ్యక్షుడు డి.రాజ్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాంపల్లి సర్కిల్‌లోని పలు ప్రాంతాలకు చెందిన వారు రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నట్టు తెలిపారు. ఈ దరఖాస్తుల విచారణ ప్రక్రియను అధికారులు వేగవంతం చేసి పేదలకు సకాలంలో కార్డులను జారీ చేయాలని విన్నవించామన్నారు. తమ వినతికి ఏఎస్ఓ పుష్పలత సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సహాయ కార్యాలయం సూపరింటెండ్ నరేశ్ పాల్గొన్నారు.

పాఠశాలలో యోగా



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

చాంద్రాయణగుట్ట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గౌలిపురాలోని శాలిబండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యోగాపై అవగాహన కల్పించారు. పంజేషా ప్రభుత్వ హోమియో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.లక్ష్మి విద్యార్థులకు యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.రామ్మోహన్, ఉపాధ్యాయులు మధుసూదన్ రావు, డాక్టర్ ఎస్.విజయభాస్కర్, ప్రమీల, మంజుల, శ్రీదేవి, జి.నవనీత తదితరులు పాల్గొన్నారు.



సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందిన రాజేంద్రనగర్ నివాసి డి.బాలయ్యను సన్మానిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ ఎంటమాలజీ, ఫాగింగ్ స్ప్రే సిబ్బంది
- రాజేంద్రనగర్, (ఆంధ్రజ్యోతి)

వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్, తదితరులు

గోషామహల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం 11ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వికసిత్ భారత్ లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ, అభివృద్ధి పథకాల పట్ల ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అమర్‌సింగ్, రాజేశ్‌కుమార్, జగపతి నాయక్, మహేందర్, రఘునాథ్, జె.అరుణ్, కిరణ్, జై తివారి, జనార్దన్, ప్రమోద్, బాల్‌రాజ్, నవీన్, శ్రీకాంత్, వెంకటరెడ్డి, రాజేందర్ జైస్వాల్ పాల్గొన్నారు.

'ఆసియా, పసిఫిక్ దేశాల అభివృద్ధి మోడల్స్' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరించిన డాక్టర్ చంద్రశేఖర

రాజేంద్రనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థ(ఎన్ఐఆర్డీపీఆర్)లో గురువారం ఆసియా, పసిఫిక్ ప్రాంతం సమగ్ర గ్రామీణాభివృద్ధి మోడల్స్ అనే పుస్తకాన్ని ఆసియా, పసిఫిక్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్(సిర్‌డాప్) డీజీ డాక్టర్ పి.చంద్రశేఖర గురువారం ఆవిష్కరించారు. రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్డీపీఆర్‌లో ఆసియా, పసిఫిక్ దేశాలైన ఇండోనేషియా, శ్రీలంక, మలేషియా, వియత్నం, లావో పీడీఆర్, మయన్మార్, థాయ్‌లాండ్, ఫిజి, ఫిలిప్పీన్స్, బంగ్లాదేశ్ భారత్‌కు చెందిన గ్రామీణాభివృద్ధి నిపుణుల శిక్షణ కార్యక్రమం జరుగుతుంది. ఈ శిక్షణ కార్యక్రమంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.



- ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా ఏఐసీసీ ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ నిర్మల్ కుమార్ యాదవ్ నేతృత్వంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొంటున్న నాయకులు శ్యామ్‌సింగ్ తదితరులు
- అఫ్జల్‌గంజ్, జూన్ 19(ఆంధ్రజ్యోతి)

పాత అట్టపెట్టెల దుకాణంలో అగ్నిప్రమాదం

- మంటలను అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- భవనంలో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపు

చార్మినార్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలోని మొఘల్‌పురా దర్గా భోలాషా సాహెబ్ వద్ద ఓ నివాస భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని కార్టూన్ పాత అట్టల గోదాంలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగింది. అట్టల షాప్ యజమాని వహీద్ రోజూ రోడ్డుపై పాత కార్టన్‌లు కొనుగోలు విక్రయాలు చేసి రాత్రి సమయంలో ఎదురుగా ఉన్న భవనంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని గదిలో పెట్టి ఇంటికి వెళ్తాడు. బుధవారం రాత్రి తొమ్మిది గంటలకు షాప్ బంద్ చేసి వెళ్లిపోయిన గంటసేపటికి గోదాంలో అగ్ని ప్రమాదం సంభవించింది. దీంతో స్థానికులు మొగల్‌పురా పోలీసులకు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపక శాఖ అధికారులు ముందుభవనంలోని మొదటి రెండో అంతస్తులో ఉన్నవారిని పక్క భవనంలోకి పంపించారు. పది నిమిషాల్లో మంటలను ఆర్పారు. తర్వాత మొదటి రెండో అంతస్తులో ఉన్న వారికీ వారి ఇళ్లలోకి వెళ్లి పోయారు. ఈవిషయంపై మొగల్‌పురా ఇన్‌స్పెక్టర్ శ్రీనును వివరణ కోరగా రాత్రి మొఘల్ పురాలో గ్రౌండ్ ఫ్లోర్‌లో చిన్న అగ్నిప్రమాదం జరిగిందని వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశామని, ఎలాంటి నష్టం జరగలేదని ఫిర్యాదు కూడా చేయలేదన్నారు. మొఘల్‌పురా ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డికి వివరణ కోరగా సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలం చేరుకున్నామని, గ్రౌండ్ ఫ్లోర్ లో అగ్నిప్రమాదం జరుగడంతో మొదటి రెండో అంతస్తులో ఉన్న రెండు కుటుంబాలకు పక్క భవనంలోకి పంపించి మంటలను అదుపు చేశామన్నారు. ఎలాంటి నష్టం జరుగలేదని తెలిపారు.



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న సిబ్బంది

'ఎంఎన్‌జే'లో అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్

గోషామహల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రెడ్‌హిల్స్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో గురువారం అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎఫ్ఓ టి.వెంకన్న నేతృత్వంలో జరిగిన ఈ మాక్ డ్రిల్‌లో రోగులు, రోగి సహాయకులకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడి అమానుషం



సమావేశంలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

నార్సింగ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాలస్తీనా గాజానగరంపై ఇజ్రాయిల్ అమానుష దాడి సరైనది కాదని, తక్షణమే ఇజ్రాయిల్ యుద్ధాన్ని ఆపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో గౌలిదొడ్డిలో నిర్వహించిన కార్యక్రమానికి పద్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ఇజ్రాయిల్ పాలస్తీన దేశం గాజా నగరంపై పలు దఫాలుగా అనురసాయన బాంబులను ప్రయోగించి అమాయక ప్రజలను చంపడం దుర్మార్గపు చర్య అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ దేశానికి వివిధ దేశాల నుంచి వెళ్లే ఆహార ఇతర వస్తువులను దిగుమతి చేయకుండా కఠినమైన చర్యలు తీసుకొని యుద్ధాన్ని ఆపాలని ఆమె డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు మద్దతుగా మోదీ నిలవడం సిగ్గుచేటని ఆమె అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జంగయ్య, రామకృష్ణ, చందు యాదవ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు. అమెరికన్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ నాయకులని నార్సింగ్ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా మౌనిక



మౌనికకు నియామక పత్రం అందజేస్తున్న మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

రాజేంద్రనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మహిళా కాంగ్రెస్ రాజేంద్రనగర్ మండల అధ్యక్షురాలుగా ఉప్పర్‌పల్లికి చెందిన పలుగుచెరువు మౌనిక నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆమెకు మహిళా కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి నియామక పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీత రావు ఆదేశాల మేరకు పలుగుచెరువు మౌనికను రాజేంద్రనగర్ మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమించినట్టు పామెన జ్యోతి తెలిపారు. తనపై నమ్మకముంచి మహిళా కాంగ్రెస్ రాజేంద్రనగర్ సర్కిల్ అధ్యక్షురాలుగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి మౌనిక కృతజ్ఞతలు తెలియజేశారు.

లాల్‌దర్వాజ మహంకాళి ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న ఛత్రినాక ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌వర్మ

చాంద్రాయణగుట్ట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని గురువారం పలువురు పోలీస్ అధికారులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర ప్రసాద్‌వర్మ, ఎస్ఐలు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ వారికి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. వచ్చే నెలలో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఆలయంలో ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ మారుతీ యాదవ్ పోలీస్ అధికారులకు వివరించారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు స్వరనివాళి

రవీంద్రభారతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పాటలకు వాయిద్య సంగీతం ఆహ్లాదంగా ఉండాలని ప్రముఖ సంగీత దర్శకుడు మాధవపెద్ది సురేష్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో సుస్వర వాహిని సాంస్కృతిక కళా సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు స్వర నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ గాయకుడు అమీన్ పాషా నేతృత్వంలోని గాయనీగాయకులు బృందం చక్కటి స్వరాలతో గీతాలాపన చేశారు. ఎస్పీ బాలు ఆలపించిన గీతాలను పాడిన గాయకులు ప్రేక్షకుల్ని మైమరిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాధవపెద్ది సురేష్ కళాకారులను సత్కరించి అభినందించారు. తెలుగు సంగీతం ప్రపంచంలో చిరస్థాయిగా నిలిచిపోయే పేరు ఎస్పీ బాలు అని స్మరించుకున్నారు. అమీన్ పాషా నేతృత్వంలోని గాయకుల బృందం చక్కటి పాటలతో ఎస్పీ బాలుకు స్వర నివాళి అర్పించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, రమాదేవి, పద్మిని తదితరులు పాల్గొన్నారు.

'బుద్ధిసత్వ అంబేడ్కర్ బుద్ధ ధర్మ మిషన్ తెలుగు అనువాద' పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): లతా రాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి సి.ఆంజనేయరెడ్డి రచించిన బుద్ధిసత్వ అంబేడ్కర్ బుద్ధ ధర్మ మిషన్ ఆంగ్ల పుస్తకాన్ని డాక్టర్ ఎండ్లూరి తెలుగు అనువాద చేసిన గ్రంథం ఆవిష్కరణ సభ జరిగింది. గురువారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత ఐఏఎస్ శ్యాం తగాడే హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్, బుద్ధిజం గురించి ఒకే దగ్గర పుస్తకం రూపంలో రావడం అభినందనీయమని అన్నారు. ఈ దేశానికి అంబేడ్కర్ స్ఫూర్తిప్రదాతగా నిలిచారని కీర్తించారు. అంబేడ్కర్ విశిష్ట, బుద్ధిజం విలువలను ఈ పుస్తకంలో చక్కగా వివరించారన్నారు. బుద్ధుని బోధనలు నాడు ప్రపంచంలోని పలు దేశాలపై ప్రభావం చూపాయని అన్నారు. కార్యక్రమంలో బిక్కు ధమ్మరక్కిత, టి.సురేష్, పరంధాములు, కె.కె.రాజా, పీఎస్ఎన్. మూర్తి, సిద్దోజీ రావు తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో..
వాహనాల గుట్టురట్టు



- నాలుగు నెలల్లో.. 363 ప్రమాదాలు
- 103 కేసులను ఛేదించిన సైబరాబాద్ పోలీసులు
- మరో 260 కేసుల్లో విచారణ ముమ్మరం

హైదరాబాద్ సిటీ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ రోడ్డు ప్రమాద కేసుల్లో గుర్తుతెలియని వాహనాల గుట్టును సైబరాబాద్ కమిషనరేట్‌లో ఉన్న రోడ్ ట్రాఫిక్ యాక్సిడెంట్స్ మానిటరింగ్ విభాగం (ఆర్టీఏఎమ్) రట్టు చేస్తోంది. టెక్నికల్ ఎవిడెన్స్‌ను సేకరించి గుర్తుతెలియని వాహనం వివరాలను రాబడుతున్నారు. దాదాపు 80శాతం నేర పరిశోధనను పూర్తి చేసి ప్రమాదం చేసిన వారిని పట్టించేందుకు లా అండ్ ఆర్డర్ పోలీసులకు సహకరిస్తున్నారు. హిట్ అండ్ రన్ కేసులో మృతిచెందిన వారి కుటుంబీకులకు, క్షతగాత్రులకు న్యాయం జరగడానికి కృషి చేస్తున్నారు.

నిర్లక్ష్యంగా ఢీ కొట్టి వెళ్లిపోతున్నారు..

మద్యం మత్తు, నిర్లక్ష్యం, అతివేగంతో ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు ఇతర వాహనాలను, పాదచారులను ఢీకొట్టి వారి మృతికి కారణమవుతున్నారు. క్షతగాత్రులు రక్తపు మడుగులో పడి ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నా తిరిగిచూడకుండా పారిపోతున్నారు. ఈ ఏడాది నాలుగు నెలల్లో ఒక్క సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే 363 హిట్ అండ్ రన్ కేసులు నమోదైనట్లు ఆర్టీఏఎమ్ సెల్ అధ్యయనంలో తేలింది. వాహనదారులు రోడ్డు ప్రమాదాల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో దాన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

> **103 కేసులు ఛేదించాం..**
> నాలుగు నెలల్లో నమోదైన 363 హిట్ అండ్ రన్ కేసుల్లో 103 కేసులను ఛేదించాం. అందుకు కారణమైన వాహనాలను, వాహనదారులను పట్టుకున్నాం. పెండింగ్‌లో ఉన్న మరో 260 కేసుల్లో సాంకేతిక ఆధారాలు సేకరించి దర్యాప్తు ముమ్మరం చేశాం.
> — గజరావ్ భూపాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ, సైబరాబాద్

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు

ఈ ఏడాది మార్చిలో నార్సింగ్ పరిధిలోని ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో వేగంగా వచ్చిన గుర్తుతెలియని టిప్పర్ లారీ యువకుడిని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొక వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీఏఎమ్ పోలీసులు టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తునకు సహకరించారు.

- ఇటీవల కేపీహెచ్‌బీ పరిధిలో రోడ్డు దాటుతున్న మహిళను ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. అడ్డుగా వచ్చిన ఆటోనే ఢీ కొట్టిందంటూ ద్విచక్ర వాహనదారుడు బుకాయించే ప్రయత్నం చేశాడు. ఆ తర్వాత ఆర్టీఏఎమ్ విభాగం పోలీసులు సీసీటీవీ కెమెరాలను చెక్ చేసి ప్రమాద ఘటనను బయటపెట్టారు. అయితే వాహనం ఢీకొన్న మహిళకు స్వల్ప గాయాలే కావడంతో నిందితుడిని పోలీసులు వదిలిపెట్టారు.



కెడెట్స్ తయారు చేసిన ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ హిమాన్షురాయ్, కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే

దేశరక్షణలో సాంకేతిక పరిజ్ఞానానిదే కీలక పాత్ర

అల్వాల్, జూన్19 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానానిదే కీలక పాత్ర అని ఐఐఎం ఇండోర్ డైరెక్టర్ ప్రొఫెసర్ హిమాన్షురాయ్ పేర్కొన్నారు. గురువారం తిరుమలగిరిలోని ఎంసీఈఎంఈ ఆడిటోరియంలో నిర్వహించిన స్నాతకోత్సవంలో ఇంజినీరింగ్ పూర్తిచేసిన 20మంది కెడెట్స్‌కు బీ-టెక్ (జేఎన్‌టీయూ)పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం 43వ టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ కోర్సులో ప్రతిభ కనపరిచిన లెఫ్టినెంట్ డి.సుభాష్ డీజీఈఎంఈ ట్రోఫీతో పాటు ఆర్మీ ట్రైనింగ్ కమాండ్, జనరల్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చాఫ్ (జీవోసీ-ఇన్-సీ, ఏఆర్‌టీఆర్‌ఏసీ) ట్రోఫీని అందించారు. మెకానికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన లెఫ్టినెంట్ అభినవ్ నాయర్, లెఫ్టినెంట్ ఆదర్శ్‌కుమార్ సింగ్‌లకు కమాండెంట్ సిల్వర్ మెడల్ లభించింది. అంతకుముందు ఎంసీఈఎంఈ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్‌వర్షనే మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దేశ రక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక మైలురాయిని సాధించినందుకు ఆయన యువ కెడెట్స్‌ను అభినందించారు.

చర్లపల్లి చెరువుకు మహర్దశ

- అభివృద్ధికి హైడ్రా కసరత్తు.. పరిశీలించిన రంగనాథ్
- సీఎస్ఆర్ నిధులతో పనులు



చెరువు ఇన్‌లెట్‌ను పరిశీలిస్తున్న రంగనాథ్, సౌమ్యా మిశ్ర తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి చెరువు సుందరీకరణ, అభివృద్ధికి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపొందించాలని హైడ్రాలోని ఇరిగేషన్, ఇంజనీరింగ్ విభాగం అధికారులను కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశించారు. చర్లపల్లి చెరువును జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యమిశ్రాతో కలిసి గురువారం ఆయన సందర్శించారు. 58 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు ఇన్‌లెట్, అవుట్ లెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ సోలార్ లైటింగ్, సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, తద్వారా భద్రత ఉంటుందని పేర్కొన్నారు. చెరువు చుట్టూ 3 కి.మీల మేర నడక దారి, చుట్టూ పాత్ వే, మినీ పార్కులు, చెట్లు, కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. అయితే, స్థానిక పరిశ్రమల యజమానులు సామాజిక బాధ్యతగా నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని, సమగ్ర నివేదిక ఇస్తే నిధులు సమకూరుస్తామని సౌమ్యమిశ్ర ఈ సందర్భంగా రంగనాథ్‌తో పేర్కొన్నారు.

రైతు భరోసా ఎందుకు వేయడం లేదు?

- జిల్లాలో రైతులే లేరనుకుంటున్నారా?
- నిధులు విడుదల చేయించాలని మేడ్చల్ కలెక్టర్‌కు వినతి

దుండిగల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో రైతులు వరిధాన్యం పండించడం లేదా.. అసలు రైతులే లేరా? రైతు భరోసా' నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం ఎందుకు పక్షపాతం చూపుతుందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జిల్లా పార్లమెంట్ సభ్యులుగా గెలిపించి రాజకీయ భవిష్యత్‌కు పునాదులు వేసిన ప్రజలను, రైతులను మరిచిపోవడం బాధాకరమని వాపోయారు. ఈ మేరకు పీఏసీఎస్, ఎఫ్‌సీఎస్ ఛైర్మన్ల ఆధ్వర్యంలో గురువారం రైతన్నలు జిల్లా కలెక్టర్‌ను, జిల్లా వ్యవసాయ అధికారులను కలిసి వినతి పత్రం ఇచ్చారు. జిల్లాలో ఉన్న ఏ ఒక్క అన్నదాతకు రైతు భరోసా' నిధులు విడుదల కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో రెండు విడతలుగా రైతు భరోసా నిధులు విడుదల చేసినా మేడ్చల్ జిల్లాలో రైతుల ఖాతాలో ఒక్కసారి కూడా జమ కాలేదంటూ కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. గతంలో రైతన్నలందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం జిల్లాలో సగం రైతులకు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అందరికీ రుణమాఫీ చేయాలని కోరారు. రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు వేయకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని వారు హెచ్చరించారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో సింగిల్‌విండో ఛైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రణదీప్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు పెద్ద ఉన్నారు.



మేడ్చల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు, సింగిల్‌విండో ఛైర్మన్లు

రజాకార్ సినిమాకు ఇచ్చిన అవార్డును వెనక్కి తీసుకోవాలి

పలువురు వక్తలు

బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చరిత్ర, సంస్కృతిని వక్రీకరించి రజాకార్ సినిమా తీశారని పలువురు వక్తలు ఆరోపించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కనుసన్నల్లో తీసిన ఈ సినిమాకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చి తెలంగాణను అవమాన పర్చిందని వారన్నారు. రజాకార్ సినిమాకు ఇచ్చిన అవార్డును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని వారు స్పష్టం చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ హైదరాబాద్ చాప్టర్ (ఏపీసీఆర్) ఆధ్వర్యంలో 'రజాకార్ ఫ్యాక్ట్స్ ఆర్ ఫ్లాష్ ఉడ్ ద గద్దర్ అవార్డు కాంట్రవర్సీ' అంశంపై సమావేశం నిర్వహించారు. వీక్షణం సంపాదకులు వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర వారసత్వానికి విరుద్ధంగా ఈ సినిమా తీశారని, అసత్యాలనే ప్రధానంగా చూపించారని ఆరోపించారు. ప్రజాకోర్టులో ఈ సినిమాను తిరస్కరించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పసునూరి రవీందర్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్ర, సంస్కృతి, జానపదానికి రజాకార్ సినిమా పూర్తి వ్యతిరేకమని, చరిత్రను పూర్తిగా వక్రీకరించి ఈ సినిమా తీశారని ఆరోపించారు. రచయిత స్కైబాబా మాట్లాడుతూ మైనార్టీ డిక్లరేషన్ ఊసే లేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. సీపీఐ కార్మిక నేత స్వర్గీయ రాజా బహదూర్‌గౌర్ సోదరి అవరీచ్ బాణీ మాట్లాడుతూ, తప్పులను మతానికి అంటగట్టడం సరైంది కాదని రజాకార్లను కూడా ఆ నాడు కొంతమంది ముస్లింలు వ్యతిరేకించారని ఆమె అన్నారు. రైతుస్వరాజ్య వేదిక ప్రతినిధి రవికన్నెగంటి మాట్లాడుతూ తెలంగాణ వాస్తవ చరిత్రను ఈ సినిమాలో చూపించలేదన్నారు. ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని కుట్రపూరితంగా ఈ సినిమా రూపొందించారని ఈ సినిమాకు ఇచ్చిన అవార్డును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి హనీఫ్ అహ్మద్ అధ్యక్షత వహించగా న్యాయవాది అఫ్సర్ జహాన్, ఫరాజ్ అహ్మద్, మారియా హరీఫుద్దీన్, సనావుల్లా, ప్రేమ్‌రాజ్, మాథ్యూస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పసునూరి రవీందర్

రామకృష్ణశాస్త్రి జాతీయ యోగారత్న అవార్డుకు ఎంపిక



బర్కత్‌పుర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ యోగా గురువు, సంఘానబోయిన రామకృష్ణశాస్త్రిని జాతీయ యోగారత్న పురస్కార్ - 2025 అవార్డుకు ఎంపికయ్యారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఈ విషయాన్ని వెల్లడించారు.

మహిళలను ప్రోత్సహించేందుకు 'వీ రీచ్'



'వీ రీచ్' ప్రారంభోత్సవంలో కలెక్టర్ హరిచందన, వీ హబ్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సొంత వ్యాపారాలను ప్రోత్సహించడం, సాధికారికత కల్పించడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధించవచ్చని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన అన్నారు. బంజారాహిల్స్‌లోని వీహబ్ కార్యాలయంలో గురువారం 'వీ రీచ్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలోని టైర్ 2, టైర్ 3 ప్రాంతాల్లో మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీ రీచ్ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. వీహబ్ సీఈఓ సీత మాట్లాడుతూ వీ రీచ్‌లో భాగంగా జిల్లాల వారీగా ఎంపికైన 120 మంది మహిళా పారిశ్రామిక వేత్తలను రెండు బ్యాచ్‌లుగా విభజించి శిక్షణ ఇస్తున్నామని, అనంతరం వారు వ్యాపార రిజిస్ట్రేషన్‌లు చేసుకొని యూనిట్లను ప్రారంభిస్తారని తెలిపారు.

అత్యవసర పరిస్థితిలో చికిత్సపై 'కేర్' అవగాహన



పంజాగుట్ట చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న కేర్ ఆస్పత్రి బృందం

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయంలో వేగంగా స్పందించడం, సమష్టిగా పనిచేయడం వల్లే ప్రాణాలు రక్షించగలుగుతామని కేర్ ఆస్పత్రి చీఫ్ మార్కెటింగ్, సేల్స్ ఆఫీసర్ (సీఎంఎస్ఓ) శలభ్ డాంగ్ తెలిపారు. 'ది పవర్ ఆఫ్ 3' ప్రచారంలో భాగంగా అత్యవసర పరిస్థితుల్లో చికిత్స తీసుకోవడం ఎంత కీలకమో తెలియజేస్తూ కేర్ ఆస్పత్రి బృందం గురువారం పంజాగుట్ట చౌరస్తాలో ప్లకార్డులను ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచుతూ, అత్యవసర సమయాల్లో సమయానుకూల చికిత్స ఎంత ముఖ్యమో వివరిస్తున్నట్లు చెప్పారు.

ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే ఆపాలి

రాయదుర్గం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్ యుద్ధాన్ని వెంటనే ఆపివేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గచ్చిబౌలి నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లోని అమెరికన్ కాన్సులేట్ ఎదుట పాలస్తీనాకు మద్దతుగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వామపక్షాలు నిరసన ప్రదర్శన చేశారు. సీపీఐ, సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్), న్యూడెమోక్రసీ, మాస్‌లైన్, ఎంసీపీఐ(యు), రివల్యూషనరీ, సోషలిస్టు పార్టీ వామపక్ష పార్టీల నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వామపక్ష నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఇండియన్ పీపుల్ ఇన్ సాలిడారిటి విత్ పాలస్తీనా ఫోరం సభ్యురాలు భార్గవి మాట్లాడుతూ 2023, అక్టోబర్ 7 నుంచి ఇజ్రాయిల్ బాహాటంగా పాలస్తీనాపై దాడులు చేస్తూ వచ్చిందని, ఇప్పటి వరకు 60వేల మందికి పైగా పాలస్తీనా ప్రజలను అమానుషంగా చంపివేసిందన్నారు. ఐపీఎస్‌పీ సభ్యుడు డాక్టర్ సుహాస్ మాట్లాడుతూ వేలకు పైగా విద్యారంగ సిబ్బందిని ఈ దాడిలో ఇజ్రాయిల్ చంపుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నానక్‌రాంగూడలోని అమెరికన్ కాన్సులేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష నాయకులు

ఏక్‌నాథ్ షిండేను కలిసిన రాష్ట్ర శివసేన నేతలు



ఏక్‌నాథ్ షిండేతో శివాజీ, సుధాకర్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్19 (ఆంధ్రజ్యోతి): శివసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి, శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండేను థానేలోని ఆయన నివాసంలో రాష్ట్ర శివసేన నేతలు కలిశారు. ఈ సందర్భంగా శివసేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సింకారు శివాజీ, ప్రధాన కార్యదర్శి జి.సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శివసేన పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. శివ సైనికులందరూ గ్రామ గ్రామాన పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని అన్నారు. త్వరలో హైదరాబాద్ వేదికగా భారీ సభ నిర్వహిస్తామని తెలిపారు.

విద్య భారం కాకుండా చూడండి



పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆప్ ప్రతినిధులు


ఖైరతాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ ఆందోళనకు దిగింది. గురువారం పాఠశాల విద్యాశాఖ సంచాలకుని కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తూ విద్యాలయాలను వ్యాపార సంస్థలుగా మార్చకండి అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పార్టీ తెలంగాణ మాజీ కన్వీనర్ బుర్ర రాముగౌడ్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల ఫీజులు కుటుంబాలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయన్నారు. అనంతరం ప్రతినిధులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని విద్యాశాఖ సంచాలకుని కార్యాలయంలో అందజేశారు. ఈ ఆందోళనలో ఆప్ ప్రతినిధులు డాక్టర్ అన్సారి, మహమ్మద్ మాజిద్, డాక్టర్ సోలోమన్ రాజు, అఫ్షా సల్మా, విజయ్ మల్లంగి, హేమ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన చికిత్స

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మల విసర్జన సమస్యతో ఇబ్బంది పడుతున్న ఓ మహిళకు బంజారాహిల్స్‌లోని అంకుర ఆస్పత్రిలో అరుదైన సర్జరీ నిర్వహించారు. ఇటీవల ఆమెకు అత్యాధునిక, మినిమల్ ఇన్వెసివ్ వైద్య ప్రక్రియను నిర్వహించారు. గాంధీనగర్‌కు చెందిన సాయిసుమన్ (32)కు చిన్న వయస్సు నుంచే మల విసర్జన సాఫీగా లేక ఇబ్బంది పడుతుండేది. పదేళ్ల క్రితం ఆమెకు శస్త్రచికిత్స చేసి ట్యూబ్‌ను ఏర్పాటు చేసినా సరైన శుభ్రత లేక ఇన్‌ఫెక్షన్ బారిన పడేది. ఇటీవల అంకుర ఆస్పత్రి వైద్యులను సంప్రదించింది. పరిశీలించిన వైద్యులు అరుదైన సర్జరీతో సమస్యకు పరిష్కారం చూపినట్లు వైద్యులు వీఎస్ చంద్రశేఖరం, పరిజాత్ రామ్ త్రిపాఠి వివరించారు.

ప్రీలాంచ్ పేరుతో ఘరానా మోసం

- రూ.40లక్షల ఫ్లాట్ రూ.12 లక్షలకే అంటూ శఠగోపం
- రియల్ ఎస్టేట్ కంపెనీపై మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు



పోలీసులకు మున్సిపల్ కమిషనర్ అందజేసిన ఫిర్యాదు పత్రం

ఆదిభట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రీలాంచ్ పేరుతో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ఘరానా మోసానికి పాల్పడింది. రూ.40లక్షల విలువైన ప్లాట్‌ను రూ.12లక్షలకే విక్రయిస్తామని నమ్మించి ప్రజల నుంచి రూ.కోట్లలో డబ్బు వసూలు చేసింది. ఈమేరకు ప్రజలను మోసం చేస్తున్న సదరు రియల్ ఎస్టేట్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కమిషనర్ గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. కొంగరకలాన్ సర్వేనంబర్ 349/పీ, 350/పీ, 351/పీ, 353/పీ, 354/పీ, 355/పీలో రీమాక్స్ డ్రీమ్ క్యాచ్ అపార్ట్‌మెంట్ పేరిట 2018లో ల్యాండ్ కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. మున్సిపాలిటీ నుంచి గానీ, హెచ్ఎండీఏ నుంచి గానీ ఎలాంటి అనుమతి తీసుకోలేదని తెలిపారు. ప్రీలాంచ్ పేరుతో రూ.40లక్షల విలువ చేసే ప్లాట్‌లను కేవలం రూ.12లక్షలకే అంటూ విక్రయాలు జరిపి, ప్రజల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేశారని పేర్కొన్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా ప్రీలాంచ్ పేరుతో ప్రజలను మోసం చేసిన సదరు కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు, అతని అనుచరుడిపై కేసు


రాయదుర్గం,జూన్19(ఆంధ్రజ్యోతి): సంధ్య కన్వెన్షన్ శ్రీధర్‌రావు, అతని అనుచరుడిపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. హైడ్రా అధికారులు రోడ్డు మార్కింగ్ పనులు చేస్తుండగా బాధితుడు కుషిచంద్ వడ్డే ఆ పనులను వీడియో తీశాడు. ఈ క్రమంలో శ్రీధర్‌రావు అనుచరుడు వెంకటేష్ వేగంగా కారు నడిపి ఢీ కొట్టేందుకు ప్రయత్నించాడని, తిరిగి ఇంటికి వెళ్తుండగా రాళ్లతో దాడి చేశారని గచ్చిబౌలి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు శ్రీధర్‌రావు, వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యవసాయాన్ని హరిస్తున్న కార్పొరేట్ కంపెనీలు

రాంనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలు హరిస్తున్నాయని, సరళీకరణ విధానాల దుష్ప్రభావంతో రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయని అఖిల భారత కిసాన్ సభప్రధాన కార్యదర్శి డాక్టర్ విజూక్రిష్ణన్ పేర్కొన్నారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విద్యావన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డి.రాజిరెడ్డి మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు వేయాలన్నారు. అనంతరం ఆరిబండి ప్రసాదరావు రచించిన 'నేను - మనభూమి- ఒక జీవన స్మృతి' పుస్తకావిష్కరణ జరిగింది. కార్యక్రమంలో రైతుసంఘం ఉపాధ్యక్షుడు జూలకంటి రంగారెడ్డి, ప్రధానకార్యదర్శి సాగర్ తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నివేదన

నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం



విశేషం

యోగాకు మతంతో సంబంధం లేదు!

భారత ఉపఖండానికి యోగ విద్య కొత్తదేం కాదు. వేల ఏళ్ళ క్రితమే భారతీయులకు యోగ సాధన తెలుసని రుజువుపరిచే పురావస్తు ఆధారాలెన్నో లభించాయి. సామాన్య శక పూర్వం (బీసీఈ) 2500 కాలం నాటి సింధు నాగరికతకు చెందిన కొన్ని మట్టి ముద్రల మీద... యోగాసన భంగిమలలో కూర్చొని తపస్సు చేస్తున్న సాధకుల బొమ్మలు ఉన్నాయి. ఇవి నేటి పాకిస్తాన్‌లోని లార్కానాలో... మొహెంజదారో శిథిలాలలో బయటపడ్డాయి. అలాగే బీసీఈ 1500 నాటి ఋగ్వేద మంత్రాల్ని పరిశీలిస్తే నాటి ప్రజలకు అప్పటికే యోగాభ్యాసం గురించి తెలుసునని గ్రహించగలం. వివిధ ఉపనిషత్తులు, భగవద్గీత (ఆత్మ సంయమ యోగం)లో యోగ సాధన ప్రయోజనాలు, మార్గాలు విపులంగా చర్చించారు. ప్రాచీన కాలంలో యోగ సాధనను అందరూ శారీరక, మానసిక ఆరోగ్య ప్రదాయినిగా భావించారు. అయితే... యోగ సాధన ఫలితాల గురించి భారతీయులలో పలు అశాస్త్రీయ విశ్వాసాలు కూడా క్రమంగా ఏర్పడ్డాయి.

ఇతర మతాల్లోనూ...

కొందరు భావిస్తున్నట్టు యోగా కేవలం సనాతన (హిందూ) ధర్మానికి సంబంధించిన సాధన మాత్రమే కాదు. వైదికేతరమైన జైన, బౌద్ధానుయాయులు, ఇస్లామ్ మతానికి చెందిన సూఫీలు, దర్వేషీలు కూడా యోగ సాధన చేస్తారు. తాంత్రిక బౌద్ధ శాఖ అయిన 'వజ్రయానం'లో యోగాసనాలకు, ప్రాణాయామానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. బౌద్ధ గ్రంథమైన 'దీర్ఘనికాయం'లో వీటి ప్రస్తావనలు ఉన్నాయి. సాంఖ్య సిద్ధాంతం పునాదిగా, బౌద్ధం ద్వారా ప్రభావితుడైన పతంజలి మహర్షి 'యోగ సూత్రములు' అనే గ్రంథం రచించి, యోగను ఎనిమిది అంగాలతో కూడిన సమగ్ర సాధనంగా రూపొందించాడు. వేదాలను ప్రమాణాలుగా భావించే భారతీయ షట్ (ఆరు) ఆస్తిక దర్శనాలలో యోగ దర్శనం ఒకటి. కపిల మహర్షి రూపొందించిన సాంఖ్య దర్శనం... నిరీశ్వర (దైవం ప్రస్తావన లేని) సిద్ధాంతం కాగా... దాని ఆధారంగా పతంజలి రచించిన 'యోగ సూత్రాలు' దానికి దైవం, మోక్షం లాంటి భావనలను జోడించాయి. అందుకే పతంజలి యోగ సిద్ధాంతానికి 'సేశ్వర (స+ఈశ్వర) సాంఖ్యం' అనే పేరు వచ్చింది. 'యోగ' అనే మాటకు 'ఉపాయం, కూర్పు, కలయిక' అనే సాధారణ అర్థాలు ఉన్నాయి. సాంఖ్య సిద్ధాంతం ఆత్మను 'పురుషుడు' అని, పదార్థాన్ని 'ప్రకృతి' అని వ్యవహరిస్తూ... అవి రెండూ అంతిమ సత్యాలని నమ్ముతుంది. శుద్ధ చైతన్య స్వరూపుడైన పురుషుడు (ఆత్మ) పదార్థ జనితమైన చిత్తంతో చెందే సంయోగం కారణంగా వివిధ చిత్తవృత్తుల (మెంటల్ మోడిఫికేషన్స్)కు లోనవుతాడని, తన స్వభావ సిద్ధమైన వివేక జ్ఞానాన్ని కోల్పోతాడని, చిత్తవృత్తులను నిరోధించి, వివేక జ్ఞానం పొందడం ద్వారా మోక్షాన్ని సాధించే మార్గమే యోగమని పతంజలి సిద్ధాంతం.

శాస్త్రీయ దృక్పథంలో...

ఇప్పుడు దీన్ని శాస్త్రీయ దృక్పథంతో పరిశీలిద్దాం. సిద్ధాంతపరంగా మిగిలిన అయిదు ఆస్తిక దర్శనాలు ఎదుర్కొన్న తార్కికమైన, తాత్త్వికమైన చిక్కులనే యోగ దర్శనం కూడా ఎదుర్కొంది. యోగ సాధన ద్వారా దైవ స్వరూపం అవగతమవుతుందని, పలు సిద్ధులు, అతీంద్రియ శక్తులు లభిస్తాయని యోగ సూత్రాలలో పేర్కొన్న విషయాలను కొందరు విశ్వసిస్తారు. అయితే వాటికి శాస్త్రీయ ఆధారాలను మాత్రం చూపలేరు. అయితే మన శారీరక, మానసిక ఆరోగ్యాలకు యోగసాధన ప్రయోజనకరమని మాత్రం శాస్త్రీయంగా రుజువయింది. యోగాసనాల వల్ల పలు శరీరావయవాలకు, మెదడుకూ రక్తప్రసరణ మెరుగుపడుతుందని, అనేక శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని నిరూపితం అయింది. 'అష్టాంగయోగ' సాధనలో అంతర్భాగమైన ప్రాణాయామం ద్వారా శ్వాసకోశాలు శుభ్రపడి, రక్తశుద్ధి మరింత చక్కగా జరుగుతుంది. గుండె పనితీరు మెరుగుపడుతుంది. ధారణ ద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత మెరుగవుతాయి. ధ్యానం చిత్తశుద్ధినీ, ప్రశాంతతను చేకూరుస్తుంది. యోగ సాధన ప్రయోజనాలు వైద్య విజ్ఞాన శాస్త్రవేత్తల అధ్యయనాల్లో రుజువయ్యాయి. అంతేతప్ప అతీంద్రియ శక్తులు లభిస్తాయని ఎవరూ రుజువు చేయలేదు. అందుకే వాటిని అంధ విశ్వాసాలుగా విజ్ఞులు, శాస్త్రవేత్తలు కొట్టి పారేస్తారు. కాగా... శారీరక, మానసిక ఆరోగ్యాలకు ఎంతో మేలు చేకూర్చే యోగ సాధనను కొందరు మత విశ్వాసాలతో ముడిపెడుతున్నారు. యోగ శిక్షణ తరగతులలో చేసే సాధనను భక్తి, ప్రార్థనలు, భజనలతో మిళితం చేస్తున్నారు. యోగ సాధనకు మత విశ్వాసాలతో ఎలాంటి సంబంధం లేదని, ఏ మతస్థులైనా యోగ సాధన చేసి పొందవచ్చని, ఎందరో అలా పొందుతున్నారని అందరూ గ్రహించాలి.



ముత్తేవి రవీంద్రనాథ్
చరిత్ర పరిశోధకుడు

అష్టాంగ యోగం

చిత్తవృత్తులను నిరోధించడమే యోగమని చెబుతూ... 'యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి' అనే ఎనిమిది అంగాలను పతంజలి వివరించాడు. ఈ ఎనిమిది అంగాలు కలిగిన యోగ సాధనను 'అష్టాంగ యోగం' అంటారు. వాటిలో మొదటి అయిదు బహిరంగ సాధనాలని, మిగిలిన మూడు అంతరంగ సాధనలని పేర్కొంటారు. యమ, నియమాలు సాధకులకు నైతిక క్రమశిక్షణ చేకూర్చితే... ఆసన ప్రాణాయామాలు సాధకుల శరీరారోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. 'ఆసనం' అంటే శరీరాన్ని ఒకే స్థితిలో నిశ్చలంగా ఉంచగలగడం. 'ప్రాణాయామ సాధన' అంటే మనం పీల్చే ప్రాణవాయువును వివిధ విధాలుగా బిగబట్టి, వదులుతూ చేసే ఆయామం (నియంత్రణ). 'ప్రత్యాహారం' అంటే సాధకులు తమ పంచేంద్రియాలను, మనస్సును విషయ వాంఛలకు దూరంగా ఉంచడం. సాధకులు 'భ్రుకుటి' (కనుబొమల మధ్య ప్రదేశం), 'నాసాగ్రం' (ముక్కు కొన) లాంటి వాటిపై దృష్టి కేంద్రీకరించి... ఏకాగ్ర సాధన చేయడాన్ని 'ధారణ' అంటాం. మనస్సును నిరంతరం ఒకే విషయం మీద లగ్నం చెయ్యడాన్ని 'ధ్యానం' అని పిలుస్తారు. ధ్యానం కూడా ఆగిపోయి... ఆత్మ, మనం ధ్యానం చేసే విషయం... ఈ రెండూ ఒకటై పోయే దశను 'సమాధి స్థితి' అంటారు.

విశ్వశాంతి మంత్రం

సద్గురువాణి

ఆ అద్భుతాన్ని అనుభూతి చెందుదాం

'యోగా' అంటే 'మీ శరీరాన్ని ఎలా వంచాలి? లేదా శ్వాసను ఎలా బిగబట్టాలి?' అనే దాని గురించి కాదు. ఇది మొత్తం మానవ వ్యవస్థను అర్థం చేసుకొనే విజ్ఞాన శాస్త్రం. 'యోగ' అనే పదానికి అర్థం ఐక్యత . ఐక్యత అంటే 'మీరు' అనే దానిలోంచి విశ్వజనీనతను అనుభూతి చెందడం. ఉదాహరణకు... ఈ అస్తిత్వం అంతా వివిధ రూపాల్లో వ్యక్తమవుతున్న ఒకే శక్తి అని ఆధునిక విజ్ఞాన శాస్త్రం నిరూపించింది. ఈ శాస్త్రీయ వాస్తవం మీకు జీవన వాస్తవంగా మారితే... అంటే మీరు ప్రతిదాన్నీ ఒకటిగా అనుభూతి చెందడం ప్రారంభిస్తే... మీరు యోగాలో ఉన్నట్టే.

మీలోపల ఏం జరుగుతోంది?

ఈ అంతర్గత సాంకేతికతను మానవులకు అందించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఈ రోజున ఐక్యరాజ్యసమితిలోని నిపుణులు 'మానసిక అనారోగ్యం' అనే మహమ్మారి గురించి మాట్లాడుతున్నారు. ప్రపంచంలో ఒంటరితనం ఎక్కువైపోతోంది. యునైటెడ్ స్టేట్స్‌లో... సర్జన్ జనరల్ నివేదిక ప్రకారం ప్రతి ఇద్దరిలో ఒకరు ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారు. ఒంటరితనంలో గడిపే సమయం... మానసిక అనారోగ్యాలను పొదిగే సమయం. మానసిక అనారోగ్యం కేవలం కొన్ని రకాల వ్యక్తులనే కాదు... ఎవరినైనా ప్రభావితం చేయవచ్చు. మీరు ఆ స్థితికి వెళ్ళకుండా చూసుకోవడం ఉత్తమం. ఎందుకంటే బాధ, ఆనందం, సంతోషం, దుఃఖం, ఆవేదన, పారవశ్యం లాంటి వాటిద్వారా మానవ అనుభవం అనేది అంతర్గతంగా నిర్ణయం అవుతుంది. బాహ్య సంఘటనలు... ఆఖరికి ఒకే కుటుంబంలోని ఇద్దరు సభ్యుల మధ్య కూడా ఎప్పుడూ నూటికి నూరు శాతం మీరు కోరుకున్నట్టు జరగవు. కానీ మీలో అంతర్గతంగా ఏం జరుగుతోందనేది మీరే నిర్ణయించుకోవాల్సి ఉంటుంది.

వారే కర్తలుగా, యజమానులుగా...

ఈ సమస్యను పరిష్కరించడం కోసం... ఈ ఏడాది ఫిబ్రవరిలో మేము 'మిరాకిల్ ఆఫ్ మైండ్' అనే యాప్‌ను ప్రారంభించాం. ఇది ఒకరి జీవితంలో శాంతిని, ఆనందాన్ని, ఉల్లాసాన్ని తీసుకురావడానికి దోహదపడే, ఎక్కడైనా సాధన చేయగలిగే సులభమైన ప్రక్రియను అందిస్తుంది. ఇది తెలుగుతో సహా పలు భాషల్లో ఉంటుంది. ప్రత్యేకించి తెలుగులో ధ్యానం కోసం అందుబాటులోఉన్న మొదటి యాప్ ఇది. ఈ భూమి మీద ఉన్న ప్రతి మానవుడు మనసు చేసే అద్భుతాన్ని అనుభూతి చెందాలనేది నా కోరిక, నా ఆశీస్సు. మానవులందరూ ఏ మినహాయింపు లేకుండా... తమ ఆనందానికి తామే కర్తలుగా, తమ భవితకు తామే యజమానులుగా మారే సామర్థ్యాన్ని కలిగి ఉంటారు. మీరు ఆ విధంగా రూపుదిద్దుకొనే మార్గాన్ని యోగా అందిస్తుంది. భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం ఈ అత్యంత ముఖ్యమైన కార్యానికి సాయం చేయడానికి, నెరవేర్చడానికి అందరికీ సుస్వాగతం. ఎందుకంటే ప్రస్తుతం మనకన్నా మెరుగైన తరం మానవులను లోకానికి అందించి నిష్క్రమించడం మనం విస్మరించలేని బాధ్యత.



సద్గురు జగ్గీవాసుదేవ్

సహజయోగ

ప్రస్తుతం ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీనికి మతాలు, జాతులు మధ్య వైరాలు, సరిహద్దుల కోసం, ఆధిపత్యం కోసం పోరాటాలు... ఇలా ఎన్నో కారణాలు. ఈ యుద్ధ వాతావరణంలో అమాయకమైన ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. విశ్వశాంతికి భంగం కలిగిస్తున్న అనేక సమస్యలకు యోగా చక్కటి పరిష్కారాన్ని చూపిస్తుంది. 'మన కోసం, మన సమాజం కోసం యోగా' అనే నినాదంతో... జూన్ 21వ తేదీని '.అంతర్జాతీయ యోగా దినం'గా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. జీవితానికి శాంతిని, ఆరోగ్యాన్ని, శ్రేయస్సును అందించే ప్రక్రియ యోగా. సహజయోగ ధ్యాన ఆవిష్కర్త శ్రీమాతాజీ నిర్మలాదేవి విశ్వశాంతి స్థాపన ధ్యేయంగా పలు దేశాల్లో పర్యటించినప్పుడు ఇచ్చిన సందేశాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుందాం.

ఆ కలయికే యోగా...

ఈ రోజుల్లో చాలామంది యోగ అంటే కేవలం ఆసనాలు, సూర్యనమస్కారాలు అనుకుంటున్నారు. నిజానికి ఆ పదానికి అర్థం చాలా విస్తృతమయినది, ఎంతో సూక్ష్మమైనది. సంస్కృత భాషలో 'యోగ' అనే పదానికి 'కలయిక' అనే అర్థం ఉంది. ప్రతి మానవునిలో అంతర్గతంగా ఉండే భగవంతుని శక్తి జాగృతం చెంది, మన చుట్టూ సర్వవ్యాపితమై ఉన్నభగవంతుని శక్తితో కలయిక చెందడాన్నే 'యోగ' అని పిలుస్తారు..

శాంతి మనలో ఉండాలి



వేదికల మీదకు ఎక్కి... 'శాంతి, శాంతి' అని గొంతెత్తి అరచినంతమాత్రాన ప్రపంచంలో శాంతి స్థాపన చేయలేం. మనిషిలోనే ప్రశాంతత లేనప్పుడు శాంతి సాధన కోసం చర్చలు జరపడం వల్ల ఫలితం ఏముంటుంది? ఒక వేళ శాంతికోసం చర్చలు జరిపినా, ఒప్పందం చేసుకున్నా... ఏదో ఒక రూపంలో మళ్ళీ అశాంతి మొదలవుతుంది. మనలోని ఆత్మ ద్వారా శాంతి వ్యక్తం కావాలి. ముందుగా శాంతి అనేది మనలో ఉండాలి. మనం మానసిక ప్రశాంతతతో ఉండాలి. మనలో అశాంతి ఉన్నప్పుడు, అహంకారంతో మన కళ్ళు మూసుకుపోయినప్పుడు 'నేనెంతో ప్రశాంతంగా ఉన్నాను' అని భావిస్తే... అది కేవలం భ్రమ. శాంతి కోసం యుద్ధాలు చేయనవసరం లేదు. దాన్ని ఆత్మ ద్వారా అనుభూతి చెందాలి. అంతర్గతంగా ప్రశాంతతతో ఉన్నవారు ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటారు. అందరికీ ఆనందాన్ని పంచుతారు. ప్రతి మనిషిలో నిద్రాణ స్థితిలో ఉన్న దైవ శక్తి అయిన కుండలినీ శక్తిని జాగృతం చేసి, ఆత్మసాక్షాత్కారం పొందినప్పుడు... మన హృదయానికి, మెదడుకు మధ్య ఐక్యత ఏర్పడుతుంది.


అదే సహజయోగం. ఆ కాంతి మనలో ప్రవేశించినప్పుడు... మన జీవితం నెమ్మదిగా, స్థిరంగా మారడం, పరివర్తన చెందడం గమనిస్తాం. అప్పుడు మానవులలో అత్యున్నత శ్రేణికి చెందిన కొత్త కోణాన్ని మనం చూస్తాం. రూపాన్ని గురించి చింతించడం, ప్రత్యేకమైన ఇష్టాలు, అయిష్టాలు, అనవసరమైన ఆలోచనలు లాంటివి ఉండవు. మనలో శాంతి క్రమంగా స్థిరపడడం ప్రారంభమవుతుంది. మనలో స్థిరపడిన ఈ అంతర్గత శాంతి మనల్నే కాదు... మన చుట్టూ ఉన్న సమాజాన్ని, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. అలా విశ్వశాంతికి దోహదపడే మంత్రమే యోగా.



డాక్టర్ పి. రాకేష్,
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్',
తెలంగాణ

తెలుసుకుందాం

బ్రాహ్మీ ముహూర్తం అంటే...



'బ్రాహ్మీ ముహూర్తం' అనే మాట మనం వింటూనే ఉంటాం. అది తెల్లవారుజాము సమయం అని అందరికీ తెలుసు. కానీ సరైన సమయం మాత్రం చాలామందికి తెలియదు. అలాగే బ్రాహ్మీ ముహూర్తంలో నిద్రలేవాలని, పూజ చేయాలని, పిల్లలు చదువుకోవాలని ఎందుకు సూచిస్తారో తెలుసుకుందాం. సూర్యోదయానికి ముందున్న 48 నిమిషాల సమయాన్ని 'బ్రాహ్మీముహూర్తం' అంటారు. ఇది పూజలకు, జపాలకు, మంత్రసాధనకు విశిష్టమైనదని పూర్వులు చెప్పారు.

ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి...

మన శరీరంలోని జీవక్రియలన్నీ మన లోపల ఉండే జీవ గడియార సమయం ప్రకారం జరుగుతాయి.
బ్రాహ్మీ ముహూర్తంలో మేలుకొనేవారికి జీవక్రియ సక్రమంగా సాగుతుంది. ఎందుకంటే ఉదయం వేళ మన శరీరంలో కార్టిసోల్ హార్మోన్ ఎక్కువ మోతాదులో విడుదల అవుతుంది.
ఈ హార్మోన్ మనలోని ఒత్తిడిని తగ్గించి, జ్ఞాపకశక్తిపై సానుకూల ప్రభావం చూపిస్తుంది. అందుకే విద్యార్థులు ఆ సమయంలో చదువుకుంటే బాగా గుర్తుంటుందని, వారి జ్ఞాపకశక్తి పెరుగుతుందని విశ్వాసం ఉంది. అలాగే ఆ సమయంలో పరిసరాలు నిశ్శబ్దంగా ఉంటాయి. కాబట్టి చదివినది నేరుగా మెదడులో నిక్షిప్తం అవుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. రాత్రి తొందరగా నిద్రపోయి, సూర్యోదయానికి ముందే లేచేవారికి ఆరోగ్య సమస్యలు ఎక్కువగా రావంటోంది ఆయుర్వేదం. రాత్రంతా చెట్లు విడుదల చేసిన ఆక్సిజన్... వేకువ జామున కాలుష్యం బారిన పడకుండా ఎక్కువ పరిమాణంలో మనకు అందుబాటులో ఉండేది బ్రాహ్మీ ముహూర్త సమయంలోనే. ఉదయం నడకకు వెళ్ళేవారికి ఇది చాలా ఉపయోగంగా ఉంటుంది. ప్రతిరోజూ సూర్యోదయాన్ని చూసే అలవాటు ఉన్నవారి గుండె, మెదడు ప్రశాంతంగా, ఆరోగ్యంగా ఉంటాయి. లేలేత సూర్యకిరణాలు మనపైన ప్రసరించడం వల్ల ఎంతో ఉపయోగం ఉంది. సూర్యరశ్మిలో ఉండే 'విటమిన్-డి' మన ఎముకలు బలంగా ఉండడానికి దోహదం చేస్తుంది.

• సి.ఎస్. మూర్తి,అంబాజీపేట
8328143489

సమాచారం

ఆదిపరాశక్తిని తమ ఇంటి ఆడబిడ్డగా భావించి, అత్తవారి ఇంటి నుంచి పుట్టింటి తీసుకువచ్చి, నైవేద్యాలు సమర్పించి, సారెతో అత్తవారింటికి తిరిగి సాగనంపే సంప్రదాయమే బోనాల పండుగ.

ఆషాఢ జాతర వచ్చేస్తోంది!



ఆషాఢమాసంలోని తొలి ఆదివారం లేదా తొలి గురువారం గోల్కొండలోని జగదాంబిక ఆలయంలో నిర్వహించే ఉత్సవాలతో మొదలై, నెలరోజులపాటు జరిగే ఈ పండుగ ఎన్నో విశేషాల సమాహారం. ఈ ఏడాది జూన్ 26 నుంచి జూలై 26 వరకూ ఈ వేడుకలు కొనసాగుతాయి.

ఎక్కడంటే...

జూన్ 26న: గోల్కొండ బోనాలతో ఉత్సవాలు ప్రారంభం
జూలై 29న: విజయవాడ కనకదుర్గమ్మకు బోనం సమర్పణ
జూలై 13న: సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర
జూలై 14న: రంగం, భవిష్యవాణి
జూలై 20న: భాగ్యనగర్ (లాల్ దర్వాజా) బోనాల జాతర
జూలై 21న : ఉమ్మడి దేవాలయాల ఘటాల ఊరేగింపు
జూలై 24న: బోనాల ఉత్సవాల ముగింపు

వ్యాసపీఠం

హరే శ్రీనివాస!

దాదాపు రెండేళ్ళపాటు టి.టి.డి. ఎగ్జిక్యూటివ్ అధికారిగా... స్వామి వారి ప్రథమ సేవకుడిగా తాను చేసిన విశేష కార్యక్రమాలను వివరిస్తూ డాక్టర్ కె.వి.రమణాచారి రచించిన గ్రంథం 'హరే శ్రీనివాస!'. ఇందులో 'శ్రీనివాసుడు నాకు జవాబిచ్చాడు' మొదలు 'వెంకటాద్రి దిగి వెంకటాద్రి ఎక్కి వరకూ'... ఇరవై రెండు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల శీర్షికలు వాటిని చదవాలన్న ఉత్సుకతను పాఠకుల్లో రేకెత్తిస్తాయి.

"ఎందుకు ఈ భక్తులందరూ వందలాది కిలోమీటర్ల దూరం రైళ్ళు, బస్సులు, కార్లు, కాలినడక... ఇలా ఇన్ని రకాలుగా ఆపసోపాలు పడుతూ తిరుపతి వస్తున్నారు?..." అనే ప్రశ్నతో ఈ గ్రంథం ప్రారంభం అవుతుంది. "నిన్నే తమ సర్వస్వంగా భావిస్తున్న భక్తులు నిన్ను దర్శించాలని ఇంత కష్టపడి, ఇంత దూరం వస్తే నువ్విచ్చే దర్శనం లిప్తకాలమా?..." అనే ప్రశ్నను... తను టి.టి.డి. ఈవో కాకముందు డాక్టర్ రమణాచారిగారు తనలోతాను అనేకసార్లు వేసుకున్నారట. అలాగే "సర్వశక్తిమంతుడివి కదా! నీ భక్తుల దగ్గరకు నీవే వెళ్ళి, సంతృప్తికరమైన దర్శనంతో వాళ్ళను తరింపజేయవచ్చు కదా! స్వామే భక్తుల దగ్గరకు ఎందుకు వెళ్ళకూడదు?..." ఇది భక్తుడిగా ఆయన స్వామివారికి వేసిన ప్రశ్న. టి.టి.డి. ఈవోగా బాధ్యతలు స్వీకరించాక ఆ ప్రశ్న ఆయనలో మళ్ళీ ఉదయించింది. దానికి స్వామి ఇచ్చిన సమాధానం ఏమిటి? అది ఇచ్చిన పద్ధతి ఏమిటి? 'చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర'కు బీజం ఎలా పడింది? వీటన్నిటికీ జవాబులు ఈ గ్రంథంలో లభిస్తాయి. ఆ సర్వాంతర్యామి సేవకుడిగా తన అనుభవాలను ఆసక్తికరంగా, సభక్తికంగా ఈ పుస్తకంలో డాక్టర్ రమణాచారి నిక్షిప్తం చేశారు.

ఆసక్తి పెంచేలా...

డాక్టర్ రమణాచారి తలపెట్టి విజయవంతం చేసిన చతుర్యుగ బంధ భక్తి చైతన్య యాత్ర, అఖండ హరినామ సంకీర్తన, నిత్యకళ్యాణం, పుస్తక, ప్రసాదం, దివ్య భారతి, ఎస్వీబీసీ, శ్రీ అన్నమాచార్య ఆరువందల జయంతి వేడుక, పాలకమండలి అమృతోత్సవం... ఇలా ఎన్నో కార్యక్రమాలు, ప్రాజెక్టుల గురించి చదువుతూ ఉంటే... ఆయన భక్తి తత్పరత, పాలనానుభవం, కార్యదక్షత ఎంతటివో అర్థమవుతుంది. ఈ గ్రంథం చదవడం ప్రారంభిస్తే... పూర్తి అయ్యేవరకూ ఆగలేం. రచన అటువంటిది. విషయం భగవంతునిది. రచయిత పండిత, సంప్రదాయ కుటుంబానికి చెందినవారు. ఎం.ఎ. తెలుగు చేసి, పిహెచ్.డి. పట్టా పుచ్చుకున్నారు. వీరి రచనలో చదివించే లక్షణం ఉంది. పఠనాసక్తిని పెంచే విధంగా శీర్షికలు ఉన్నాయి. తన ఆలోచనను చెప్పి, దాన్ని అమలుపరిచే క్రమంలో ఎదురైన సమస్యలను వివరిస్తున్న సందర్భంలో... పాఠకుని మనసు మరింత వేగంగా పరిగెడుతుంది. 'సమస్య ఎలా పరిష్కారమవుతుంది? దైవ కార్యం ఎట్లా విరబూసి పరిమళిస్తుంది?' అనే ఆసక్తిని పెంచే విధంగా రచన సాగింది. పుస్తకం ముగించినప్పుడు అనిపిస్తుంది... 'ఇంతలోనే నూట ఎనభై పుటలు చదివేసినామా!' అని. డాక్టర్ కె.వి.రమణాచారిగారి ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామి పాఠకులకు అందించిన ప్రసాదం ఈ 'హరే శ్రీనివాస!' గ్రంథం.




• అనూమాండ్ల భూమయ్య

సినిమాకు ప్రత్యేకాకర్షణగా



మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మెగా 157'- (వర్కింగ్ టైటిల్). నయనతార కథానాయిక. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఇటీవలె ప్రారంభమైన మసూరి షెడ్యూల్‌లో చిరంజీవి, నయనతార కలయికలో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా, ఈ షెడ్యూల్ ముగిసిందని, ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేకాకర్షణగా ఉండనున్నాయని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఎడిటర్: తమ్మిరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి

రామ్ బుజ్జి పాత్రలో...



రామ్‌చరణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకుడు. ఇటీవలే విడుదలైన గ్లింప్స్‌లో రామ్‌చరణ్ క్రికెటర్‌గా కనిపించి ఆకట్టుకున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో 'మీర్జాపూర్' సిరీస్ ఫేమ్ బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కీలకపాత్రలో నటిస్తున్నారు. గురువారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో రామ్ బుజ్జి అనే పాత్రలో దివ్యేందు శర్మ కనిపించనున్నారు. మాస్ అవతార్‌లో క్రికెట్ బంతిని ఎగరేస్తున్న ఆయన లుక్ ఆకట్టుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన భారీ సెట్‌లో 'పెద్ది' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఓ భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రబృందం ప్రస్తుతం తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ కనిపించనున్నారు. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు కీలకపాత్రలు పోషిస్తున్నారు. రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా వచ్చే ఏడాది మార్చి 27న 'పెద్ది' విడుదలవనుంది. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఆర్. రత్నవేలు, ఎడిటర్: నవీన్‌నూలి.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ఇలాంటి సినిమా చేయడానికి గట్స్ కావాలి

- అక్కినేని నాగార్జున



"కుబేర' చిత్ర కథ, ఇందులోని క్యారెక్టర్లు, స్ర్కీన్‌ప్లే అన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. ఇలాంటి సినిమా చేయడానికి గట్స్ కావాలి. ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇచ్చే సినిమా ఇది' అని అన్నారు హీరో అక్కినేని నాగార్జున. ఆయన, ధనుష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించారు. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మించారు. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా నాగార్జున విలేకరులతో మాట్లాడారు.

- మంచి కథ రావాలంటే స్టార్స్ కలసి పనిచేయాలి. ఇంతకుముందు కూడా నేను చాలా సినిమాలు చేశాను. నాన్నగారు, ఎన్టీఆర్ గారు, కృష్ణగారు, శోభన్‌బాబుగారు.. ఇలా అందరూ కలసి ఎన్నో సినిమాలు చేశారు.
- శేఖర్ కమ్ములతో పనిచేయాలని ఎప్పటి నుంచో ఉంది. 'ఆనంద్' దగ్గర నుంచి ఆయన సినిమాలు మనందరికీ తెలుసు. ఆయన సినిమాలంటే నాకు బాగా ఇష్టం. ఆ కథల్లో సామాజిక స్పృహ ఉంటుంది. వాణిజ్య హంగులతో పాటు అద్భుతమైన పాటలూ ఉంటాయి.
- 'కుబేర' చిత్రంలో యూనిక్ పాయింట్ ఉంది. నేటి సమాజానికి ఆ పాయింట్ చాలా రిలెవెంట్.
- శ్రీమంతుడు, మధ్యతరగతి వాడు, బిచ్చగాడు... ఇలా మూడు సొసైటీల మధ్య సంఘర్షణే ఈ చిత్ర కథ.
- ఈ సినిమాలో నాది మధ్యతరగతి మనిషి క్యారెక్టర్. సీబీఐ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తాను. మంచి చేయాలా? చెడు చేయాలా? అనే సంఘర్షణ మధ్య ఆ క్యారెక్టర్ ఉంటుంది. శేఖర్ చాలా అద్భుతంగా రాశారు. నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు, రియాక్షన్.. అన్నీ కొత్తగా శేఖర్ కమ్ముల స్టయిల్‌లో ఉంటాయి. సినిమాలో చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి.
- అవన్నీ కూడా మన నిజ జీవితాన్ని ప్రతిబింబించేలా ఉంటాయి. ధనుష్ తన పాత్రలో ఒదిగిపోయి చేశారు. రష్మిక చాలా చక్కగా నటించారు. సినిమా చూసి నువ్వే స్టార్ అని ఆమెతో చెప్పాను. దేవిశ్రీ ప్రసాద్ మంచి సంగీతం అందించారు. ఇందులోని పాటలన్నీ సందర్భోచితంగా ఉంటాయి.
- పాన్ ఇండియా సినిమాలు చేయడం చాలా కష్టమైన పని. అన్ని చిత్రాలు పాన్ ఇండియా కాలేవు. 'శివ' సినిమా 4కె వర్క్ పూర్తయింది. ఒక రీల్ చూశాను. చాలా అద్భుతంగా ఉంది. 'కూలీ'లో డిఫరెంట్ క్యారెక్టర్ చేస్తున్నాను. మొదటి సారి ఇలాంటి క్యారెక్టర్ చేస్తున్నాను. లోకేశ్ కనగరాజ్ కంప్లీట్ న్యూ ఏజ్ డైరెక్టర్. నా 100వ సినిమా ప్లానింగ్ చేస్తున్నాం. వర్కింగ్ టైటిల్ 'కింగ్ 100' అని పెట్టాం.

ఏపీలో కుబేర టికెట్ ధరల పెంపు

ఆంధ్రప్రదేశ్‌లో 'కుబేర' చిత్రానికి టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. మల్టీప్లెక్స్, సింగిల్ స్ర్కీన్ థియేటర్లలో రూ.75 రూపాయలు (జీఎస్టీ అదనం) పెంచుకునే అవకాశం ఇచ్చింది. సినిమా విడుదలైన 10 రోజుల వరకూ పెరిగిన టికెట్ ధరలు అమల్లో ఉండనున్నాయి. మరోవైపు, తెలంగాణలో మాత్రం టికెట్ రేట్లు యథాతథంగా ఉంటాయి. ధరల పెంపు కోసం చిత్రబృందం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేదని సమాచారం.

సోలో బాయ్ వినోదం



గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి జంటగా నటించిన చిత్రం 'సోలో బాయ్'. శ్వేతా అవస్తి, షఫీ, భద్రం కీలకపాత్రలు పోషించారు. నవీన్‌కుమార్ దర్శకత్వంలో సెవెన్‌హిల్స్ సతీశ్ నిర్మించారు. జూలై 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ 'మధ్య తరగతి నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగుల కలబోతగా తెరకెక్కింది. గౌతమ్‌కృష్ణ అద్భుతంగా నటించాడు' అని చెప్పారు. సెవెన్‌హిల్స్ సతీశ్ మాట్లాడుతూ 'గౌతమ్‌కృష్ణ ఈ చిత్రానికి పారితోషికం తీసుకోలేదు. నిర్మాణంలోనూ పాలు పంచుకున్నాడు. సినిమా హిట్టయ్యాక పారితోషికం తీసుకుంటానని చెప్పాడు. ఈ సినిమాతో ఆయనకు మంచి విజయం దక్కాలి' అని కోరుకున్నారు. ఈ చిత్రానికి కంటెంటే హీరో, అన్ని వర్గాలను అలరించే అంశాలతో దర్శకుడు తీర్చిదిద్దాడు అని గౌతమ్‌కృష్ణ తెలిపారు.

ఉత్కంఠ రేకెత్తించేలా..



అభిజ్ఞ వూతలూరు ప్రధాన పాత్రలో నటించిన ఉత్కంఠ భరిత వెబ్ సిరీస్ 'విరాటపాలెం: పీసీ మీనా రిపోర్టింగ్'. పోలూరు కృష్ణ దర్శకత్వం వహించారు. సౌత్ ఇండియన్ స్ర్కీన్స్ బేనర్‌పై కేవీ శ్రీరామ్ నిర్మించారు. ఈనెల 27న జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేకర్స్ ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. విరాటపాలెం గ్రామానికి ఓ శాపం ఉంటుంది. ఆ ఊర్లో ఏ పెళ్లి జరిగినా సరే మరుసటి రోజు పెళ్లి కూతురు చనిపోతుంది. అలా పదేళ్లుగా ఆ ఊరిని శాపం పట్టి పీడిస్తోందని ప్రజలు నమ్ముతుంటారు. అలాంటి ఊరికి లేడీ కానిస్టేబుల్ మీనా వస్తుంది. ఆ తర్వాత ఏం జరిగిందనే దాని చుట్టూ కథ సాగుతుంది. కథ 1980 కాలానికి చెందినదని ట్రైలర్‌ని చూస్తే అర్థమౌతుంది. చరణ్ లక్కరాజు, లావణ్య సాహుకర, రామరాజు, గౌతమ్‌రాజు, సతీశ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ సిరీస్‌కు సంగీతం: రోహిత్ కుమార్, డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫీ: మహేశ్ కె.స్వరూప్.

భారీ టెంపుల్ సెట్



విరాట్ కర్ణ, నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'నాగ బంధం'. అభిషేక్ నామా దర్శకత్వంలో కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. చిత్రీకరణ కోసం కేరళలోని అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌ను వేశారు. ఇందులో ఓ కీలక సన్నివేశాన్ని, పాటను షూట్ చేస్తున్నారు. గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ అందించే ఈ పాట చిత్రీకరణలో విరాట్ కర్ణతో పాటు దాదాపు 500 మంది నృత్యకారులు పాల్గొంటున్నారు. గుప్త నిధుల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా విజువల్ వండర్‌లా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

ఆకట్టుకునే హాస్యం



సుహాస్, కీర్తి సురేశ్ జంటగా అని ఐ.వి. శశి తెరకెక్కించిన హాస్య భరిత చిత్రం 'ఉప్పు కప్పురంబు'. రాధిక లావు నిర్మించారు. జూలై 4 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మేకర్స్ ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కీర్తి సురేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమా కథలోని హాస్యం నన్ను బాగా ఆకట్టుకుంది. ఇందులో నా పాత్ర పేరు అపూర్వ. 1990 నాటి గ్రామీణ నేపథ్యంలో సినిమా చిత్రీకరణ జరిగింది' అని తెలిపారు. 'ఇది వరకు నేను చేసిన పాత్రలకు పూర్తి భిన్నంగా ఇందులో నా క్యారెక్టర్ ఉంటుంది' అని చిత్ర కథానాయకుడు సుహాస్ చెప్పారు.

థగ్‌లైఫ్‌కు భద్రత కల్పిస్తాం

- సుప్రీం కోర్టులో కర్ణాటక ప్రభుత్వం



కమల్‌హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' సినిమాకు భద్రత కల్పిస్తామని కర్ణాటక ప్రభుత్వం సుప్రీం కోర్టుకు తెలిపింది. ఈ మేరకు గురువారం అఫిడవిట్ దాఖలు చేసింది. సినిమా విడుదలపై ఎటువంటి నిర్బంధం విధించలేదని అందులో పేర్కొంది. కర్ణాటక వ్యాప్తంగా సినిమా విడుదల చేయాలని నిర్మాతలు నిర్ణయించారని, అవసరమైతే ప్రేక్షకులకు భద్రత కల్పిస్తామని తెలిపింది. కన్నడ భాషపట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు క్షమాపణ చెప్పాలని కర్ణాటక చలనచిత్ర వాణిజ్య మండలి నటుడు కమల్‌హాసన్‌ను లేఖ రాసిన విషయాన్ని అఫిడవిట్‌లో ప్రస్తావించింది. కాగా, కన్నడ సంఘాల నేతలకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. సినిమా విడుదలను అడ్డుకోవద్దని ఆదేశించింది. ఈ విషయమై కర్ణాటక రక్షణ వేదిక అధ్యక్షుడు ప్రవీణ్ శెట్టి మీడియాతో మాట్లాడుతూ. థగ్‌లైఫ్ సినిమా విడుదలకు తమ సంఘం అభ్యంతరం వ్యక్తం చేయలేదని అన్నారు. కానీ తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలకు అభ్యంతరం తెలిపామని అన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను కన్నడ సంఘాలతో పాటు అందరూ పాటించాలని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. చట్టాన్ని ఎవరూ ఉల్లంఘించవద్దని, కర్ణాటక శాంతికి కేంద్రమనే విషయాన్ని మరువరాదని ఆయన అన్నారు. -బెంగళూరు, (ఆంధ్రజ్యోతి)

రూ.14,000 కోట్లతో హైదరాబాద్ విమానాశ్రయం విస్తరణ!

కొత్తగా మరో టెర్మినల్, రన్‌వే ఏర్పాటు
2029 సెప్టెంబరు నాటికి విస్తరణ పూర్తి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్, శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని (ఆర్‌జీఐఏ) పెద్దఎత్తున విస్తరించాలని ఎయిర్‌పోర్టు నిర్వహణ సంస్థ జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్) భావిస్తోంది. ఇందుకోసం వచ్చే మూడేళ్ల కాలంలో దాదాపు రూ.14,000 కోట్లు ఖర్చు చేయనున్నట్లు జీహెచ్ఐఏఎల్ ఒక అంతర్గత డాక్యుమెంట్‌లో పేర్కొంది. ఈ విస్తరణలో భాగంగా ప్రస్తుత టెర్మినల్‌ను విస్తరించడంతో పాటు కొత్తగా మరో టెర్మినల్‌ను రన్‌వేను అభివృద్ధి చేయాలని యోచిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఈ పనులు ప్రారంభించి 2029 సెప్టెంబరు నాటికి ఈ విస్తరణ పనులు పూర్తి చేయాలని జీహెచ్ఐఏఎల్ భావిస్తోంది.



ఎందుకంటే ?

ఏటా 3.4 కోట్ల మంది ప్రయాణికులు, గంటకు 42 విమానాల రాకపోకలు సాగించేందుకు వీలుగా జీఎంఆర్ గ్రూప్ శంషాబాద్ ఎయిర్‌పోర్టును నిర్మించింది. 2017-18లో 1.83 కోట్లుగా ఉన్న ప్రయాణికుల సంఖ్య ఏటా 7.1 శాతం వృద్ధి రేటుతో గత ఆర్థిక సంవత్సరం 2.95 కోట్లకు చేరింది. రాకపోకలు సాగించే విమానాల సంఖ్యా గంటకు 36కు చేరింది. అంటే ఎయిర్‌పోర్టు త్వరలోనే గరిష్ఠ సామర్థ్యానికి చేరువవుతోంది. దీంతో వెంటనే విమానాశ్రయ సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరం ఏర్పడింది. దీంతో ప్రస్తుత టెర్మినల్ ప్రయాణికుల వార్షిక సామర్థ్యాన్ని 3.4 కోట్ల నుంచి 4.7 కోట్లకు విస్తరించడంతో పాటు కొత్తగా 2 కోట్ల మంది ప్రయాణికులు, 46 నుంచి 47 విమానాల రాకపోకలు సాగించేలా ఇంకో టెర్మినల్, 3,800 మీటర్ల పొడవైన రన్‌వే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది.

అత్యాధునిక సౌకర్యాలు

ఈ విస్తరణ, ఆధునీకరణను అధునాతన సదుపాయాలతో పూర్తి చేయాలని జీహెచ్ఐఏఎల్ భావిస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసే రన్‌వేలో క్యాటగిరీ-1 ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్, అధునాతన నావిగేషన్ పరికరాలను ఏర్పాటు చేయనుంది. దీంతో రన్‌వే సరిగా కనిపించక పోయినా పైలెట్లు విమానాలను సురక్షితంగా ల్యాండింగ్ చేయగలుగుతారు.



మొత్తం 9.17 లక్షలకు చేరిక
అమెరికాలో గంటకు 1,000 మంది
యూబీఎస్ 'గ్లోబల్ వెల్త్' నివేదిక వెల్లడి

గత ఏడాది భారత్‌లో కొత్తగా 39,000 మిలియనీర్లు

న్యూఢిల్లీ: ప్రపంచంలో ఆర్థిక వ్యత్యాసాలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయి. ఇదే సమయంలో డాలర్ మిలియనీర్ల (10 లక్షల డాలర్లు) సంఖ్యా పెరిగి పోతోంది. గత ఏడాది మన దేశంలో కొత్తగా 39,000 మంది ఈ జాబితాలో చేరారు. దీంతో మన దేశంలో డాలర్ మిలియనీర్ల సంఖ్య 9.17 లక్షలకు చేరింది. అయితే చైనాలో ఇప్పుడు ఉన్న 63 లక్షల మిలియనీర్లతో పోలిస్తే మన దేశంలో ఉన్న మిలియనీర్ల సంఖ్య తక్కువే. 2023తో పోలిస్తే భారత్‌లో మిలియనీర్ల సంఖ్య 4.4 శాతం పెరిగింది. స్విట్జర్లాండ్‌కు చెందిన ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ యూబీఎస్ తన తాజా 'గ్లోబల్ వెల్త్' నివేదికలో ఈ విషయం వెల్లడించింది. రష్యా, బ్రెజిల్, దక్షిణాఫ్రికా దేశాలతో పోల్చినా మన దేశంలోనే డాలర్ మిలియనీర్ల సంఖ్య ఎక్కువ.

నివేదిక ఇతర ముఖ్యాంశాలు

- 2024 నాటికి 119 లక్షల కోట్ల డాలర్లకు చేరిన ప్రపంచ మిలియనీర్ల ఆస్తుల విలువ
- గత ఏడాది అమెరికాలో గంటకు 1,000 మంది చొప్పున ఏడాదిలో 3.79 లక్షల మంది కొత్త మిలియనీర్లు
- ప్రపంచ మిలియనీర్లలో 40 శాతం మంది అమెరికన్లు
- మిలియనీర్ల పెరుగుదలలో టర్కీ, యూఏఈ, రష్యా తర్వాత భారత్‌కు నాలుగో స్థానం.
- ఆర్థిక అసమానతలు ఎక్కువగా ఉన్న 56 దేశాల్లో భారత్‌కు ఏడిమిదో స్థానం
- భారత్‌లోని మొత్తం ఆస్తుల్లో ఫైనాన్షియల్ (ఆర్థిక) ఆస్తుల వాటా 20 శాతం మాత్రమే
- వచ్చే పాతికేళ్లలో ఒక తరం నుంచి మరో తరానికి 83 లక్షల కోట్ల డాలర్ల ఆస్తుల బదిలీ. ఈ విషయంలో అమెరికాకు అగ్రస్థానం. భారత్‌కు ఏడో స్థానం
- గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులు సగటున 4.6 శాతం చొప్పున పెరిగితే అమెరికాలో 11 శాతం చొప్పున పెరుగుదల.

హైదరాబాద్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్

63 ఫ్లోర్లతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్


జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీహెచ్ఆర్ ఇన్‌ఫ్రా, లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్ బ్లాక్స్ రియల్టీ జాయింట్ వెంచర్ సంస్థ జీహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా.. హైదరాబాద్, కోకాపేట్‌లో ది కాస్‌కేడ్స్ నియోపోలిస్ పేరుతో మెగా లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నియోపోలిస్‌లో 7.34 ఎకరాల విస్తీర్ణంలో 63 ఫ్లోర్లతో కూడిన ఐదు టవర్లు, మొత్తం 1,189.. 3 బీహెచ్‌కే, 4 బీహెచ్‌కే అపార్ట్‌మెంట్లతో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వామి కర్నేశ్ రెడ్డి వెల్లడించారు. రూ.3,169 కోట్లతో అభివృద్ధి చేస్తున్న ఈ ప్రాజెక్ట్ 2030 నాటికి పూర్తిగా అందుబాటులోకి రానుందన్నారు. 2,560 చదరపు అడుగుల నుంచి 4,825 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ ఫ్లాట్స్ అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కాగా ఈ ప్రాజెక్టుకు ఎస్‌బీఐ రూ.900 కోట్ల నిధులను సమకూర్చిందని సంస్థ డెసిగ్నేటెడ్ భాగస్వాములు లక్ష్మీ నారాయణ, శరత్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో రెండు హెలిపాడ్స్ సహా అన్ని టవర్లను కనెక్ట్ చేసే విధంగా స్కైబ్రిడ్జ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు.

శీతల పానీయాలపై రిలయన్స్ రూ.8,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) రిటైల్ అనుబంధ విభాగమైన రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (ఆర్ఆర్‌వీఎల్) శీతల పానీయాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు వచ్చే 12-15 నెలల్లో రూ.8,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిసింది. వినియోగదారుల ఉత్పత్తుల విభాగంలో రిలయన్స్‌కు ఇప్పటివరకిదే అతిపెద్ద పెట్టుబడి కానుంది. ఈ నిధులతో దేశవ్యాప్తంగా మరో 10-12 పానీయాల తయారీ, ప్యాకింగ్ యూనిట్లను ఏర్పాటు చేసే ఆవకాశం ఉందని సమాచారం. రిలయన్స్ కాంపా సాఫ్ట్ డ్రింక్స్‌ను మార్కెట్లోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

మార్కెట్లో మూడో రోజూ నష్టాలే..

ముంబై: భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజు నష్టపోయాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 82.79 పాయింట్లు కోల్పోయి 81,361.87 వద్దకు జారుకోగా.. నిఫ్టీ 18.80 పాయింట్ల నష్టంతో 24,793.25 వద్ద ముగిసింది. ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రతరమవుతుండటం, తత్ఫలితంగా ముడిచమురు ధరలు ఎగబాకుతున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అమ్మకాలను కొనసాగించడం ఇందుకు కారణమైంది. ప్రధాన కంపెనీలతో పోలిస్తే చిన్న, మధ్య స్థాయి షేర్లలో అమ్మకాల ఒత్తిడి అధికమైంది. దాంతో బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 1.77 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.64 శాతం క్షీణించాయి.

సాయి లైఫ్‌సైన్సెస్‌లో 6% వాటా విక్రయం

హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్ట్ డ్రగ్ రీసెర్చ్, మాన్యుఫాక్చరింగ్ కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్ లిమిటెడ్‌లో అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీ ఏషియా వాటా తగ్గించుకుంది. సాయి లైఫ్‌లో 6 శాతం వాటాకు సమానమైన 1.25 కోట్ల షేర్లను టీపీజీ ఏషియా బ్లాక్ డీల్స్ ద్వారా ఓపెన్ మార్కెట్లో విక్రయానికి పెట్టినట్లు తెలిసింది. షేరు కనీస ధరను రూ.710గా నిర్ణయించినట్లుగా సమాచారం. కంపెనీ ప్రస్తుత మార్కెట్ ధర కంటే 2.5 శాతం తక్కువ ఇది. తద్వారా టీపీజీ ఏషియాకు రూ.885 కోట్ల వరకు సమకూరనుంది. సాయి లైఫ్ సైన్సెస్‌లో టీపీజీ ఏషియా ప్రస్తుతం 24.73 శాతం వాటా కలిగి ఉంది. బీఎస్ఈలో సాయి లైఫ్ షేరు గురువారం 1.26 శాతం క్షీణించి రూ.729.20 వద్ద ముగిసింది.

25న హెచ్‌డీబీ ఫైనాన్షియల్ ఐపీఓ

ప్రైమరీ మార్కెట్లో వచ్చేవారం పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)ల సందడి పెరగనుంది. మూడు కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.15,000 కోట్ల వరకు నిధులు సమీకరించేందుకు సిద్ధమయ్యాయి. అందులో సింహభాగం 'హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్'దే. ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అనుబంధ విభాగమైన హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఐపీఓ ఈ నెల 25న (బుధవారం) ప్రారంభమై 27న (శుక్రవారం) ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.12,500 కోట్లు సమీకరించనుంది. కాగా వచ్చే వారం పబ్లిక్ ఇష్యూల జాబితాలో ముంబైకి చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ కల్పతరు లిమిటెడ్ సహా ఎల్లెన్‌బ్యారీ ఇండస్ట్రియల్ గ్యాసెస్ కూడా ఉన్నాయి. కల్పతరు ఐపీఓ ఈ నెల 24న (మంగళవారం) ప్రారంభమై 26న (గురువారం) ముగియనుంది. ఐపీఓ ద్వారా రూ.1,590 కోట్లు సమీకరించనున్న ఈ కంపెనీ ఒక్కో షేరు ధరను రూ.387-414గా నిర్ణయించింది. ఎల్లెన్‌బ్యారీ గ్యాసెస్ ఐపీఓ కూడా 24న మొదలై 26న ముగియనుంది. షేరు ధరను రూ.380-400గా నిర్ణయించింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (రూ. 100 గుడ్లు)

20వ తేదీ



హైదరాబాద్	515	విజయవాడ	540
వరంగల్	517	గోదావరి	520
చిత్తూరు	583	విశాఖపట్నం	565
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	99
వరంగల్	93	గుంటూరు	104
కరీంనగర్	93	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	95
కర్నూలు	93	నెల్లూరు	100
విశాఖపట్నం	89	అనంతపురం	100
గోదావరి	99		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,01,080 ▲	92,650 ▲	1,22,000 ▲
విజయవాడ	1,00,200 ▲	94,000 ▼	1,12,000 ▲
విశాఖపట్నం	1,02,330 ▼	92,650 ▲	1,22,000 ▲
రాజమండ్రి	1,01,070 ▲	92,650 ▲	1,11,400 ▼
ప్రొద్దుటూరు	98,000 ▼	90,160 ▼	1,07,500 ▼
ముంబై	99,261 ▼	90,923 ▼	1,07,383 ▼

స్విస్ బ్యాంకుల్లో పెరిగిన భారత నిధులు

2024 నాటికి రూ.37,600 కోట్లు

న్యూఢిల్లీ/జ్యూరిచ్: స్విస్ బ్యాంకుల్లో మన దేశ నిధులు పెరుగుతున్నాయి. గత ఏడాది చివరికి ఇవి 350 కోట్ల స్విస్ ఫ్రాంక్స్‌కు (సుమారు రూ.37,600 కోట్లు) చేరాయి. 2023తో పోలిస్తే ఇది మూడింతలు ఎక్కువ. అయిన మన దేశ వారూ పెద్దలు స్విస్ బ్యాంకుల్లో భద్రంగా దాచుకున్న సొమ్మంతా ఇందులో కలపలేదు. అది ఎంత మొత్తం ఉంటుందనే విషయాన్ని స్విట్జర్లాండ్ కేంద్ర బ్యాంక్ అయిన స్విస్ నేషనల్ బ్యాంక్ వెల్లడించలేదు. అలాగే ఎన్ఆర్ఐలు, ఇతరులు ఇంకో దేశం నుంచి జమ చేసిన మొత్తాన్ని కూడా ఇందులో కలపలేదు. మన దేశానికి చెందిన ఆర్థిక సంస్థలు, కంపెనీలు తమ స్థానిక శాఖల ద్వారా జమ చేసిన మొత్తాన్ని మాత్రమే ప్రస్తుతానికి స్విస్ బ్యాంక్ వెల్లడించింది. ప్రస్తుతం ఉన్న రూ.37,600 కోట్లలో దాదాపు పదో వంతు (సుమారు రూ.3,675 కోట్లు) భారత కంపెనీల ఖాతాదారుల ఖాతాల్లో ఉంది. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ఇది 11 శాతం ఎక్కువ.

అమెజాన్ రూ.2,000 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కార్యకలాపాల విస్తరణ, కస్టమర్ సేవల పెంపుపై ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఈ ఏడాది రూ.2,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. కొత్త ప్రాంతాలకు కార్యకలాపాల విస్తరించడంతో పాటు ఇప్పటికే పని చేస్తున్న ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను మరింత ఆధునీకరించనుంది కూడా ఈ పెట్టుబడులు సహాయకారి అవుతాయి. దీనివల్ల ఆధునిక టెక్నాలజీలు, ఇన్నోవేషన్ సహాయంతో కస్టమర్లకు మరింత విశ్వసనీయంగా, వేగంగా సేవ అందించగలుగుతామని పేర్కొంది.

గిల్ సేనకు కఠిన సవాల్

మధ్యాహ్నం 3.30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో..


గిల్

సంధి దశలో టీమిండియా
నేటి నుంచి ఇంగ్లండ్‌తో తొలి టెస్టు

లీడ్స్: పాతికేళ్ల కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో టీమిండియా తొలిసారిగా సుదీర్ఘ ఫార్మాట్‌లో ఆడబోతోంది. క్రికెట్‌మానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్న ఐదు టెస్టుల అండర్సన్-టెండూల్కర్ సిరీస్ శుక్రవారం నుంచే ఆరంభం కానుంది. అలాగే ఇందులో భాగంగా జరిగే తొలి టెస్టుకు హెడింగ్లీ వేదిక కానుంది. అయితే దశాబ్దాలుగా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, స్పిన్నర్ అశ్విన్ లేకుండానే భారత జట్టు ఇప్పుడు బరిలోకి దిగాల్సిన పరిస్థితి. ఆదికూడా అత్యంత కఠిన పరిస్థితులు ఎదురయ్యే ఇంగ్లండ్ గడ్డపై కావడం గమనార్హం. ప్రస్తుతం సంధిదశలో ఉన్న జట్టును కోచ్ గంభీర్ సహకారంతో కెప్టెన్ గిల్ ఎలా ముందుకు తీసుకెళ్లగలడన్న ఆసక్తి నెలకొంది. గత 93 ఏళ్ల ఇక్కడ పర్యటిస్తున్నా.. కేవలం మూడు సార్లు (1971, 1986, 2007) మాత్రమే భారత జట్టు సిరీస్‌ను సాధించింది. ఈసారి పరిస్థితి అంత మెరుగ్గా లేకపోయినా.. ఇక సొంత గడ్డపై భారత జట్టు ఏడుసార్లు ఆడితే ఓ మ్యాచ్ డ్రా చేసుకుని కేవలం రెండింట్లోనే నెగ్గింది.


బెన్ స్టోక్స్

బ్యాటింగ్ ప్రభావమెంత?

ఇంగ్లండ్ పిచ్‌లపై భారత బ్యాటర్లు ఏమేరకు ప్రభావం చూపగలరనే సందేహం నెలకొంది. ఓపెనర్ జైస్వాల్ ఇక్కడ మొదటిసారి ఆడబోతున్నాడు. ఇక అతడికి జతగా రాహుల్ దిగే అవకాశముంది. సాయి సుదర్శన్‌కు అరంగేట్రం చాన్సిస్తే వన్‌డౌన్‌లో రావచ్చు. ఇక కీలక నాలుగో నెంబర్‌లో కెప్టెన్ గిల్ ఖాయమే. ఆ తర్వాత పంత్, కరుణ్ నాయర్ దిగవచ్చు. అయితే ఇంగ్లండ్‌లో గిల్ 3 టెస్టులు ఆడి కేవలం 88 పరుగులే చేశాడు. గత పర్యటనలో రాహుల్, పంత్ శతకాలు సాధించారు. అలాగే బౌలింగ్ విభాగంలో పేసర్ బుమ్రాపైనే అధికంగా ఆధారపడింది. సిరాజ్, ప్రసిద్ధ్ ఇతర పేసర్లుగా బరిలోకి దిగనున్నారు. ఒకే స్పిన్నర్‌ను తీసుకుంటే అది జడేజానే అవుతాడు. ఇక ఆల్‌రౌండర్ కోటాలో నితీశ్‌కుమార్ కంటే శార్దూల్ ఠాకూర్‌కే చాన్సులున్నాయి.

జో రూట్ అండగా..

అండర్సన్, స్టువర్ట్ బ్రాడ్ లేని ఇంగ్లండ్ బౌలింగ్ దళం కాస్త బలహీనంగానే కనిపిస్తోంది. పేసర్లు వోక్స్, కార్స్, టంగ్, స్పిన్నర్ బషీర్ భారత బ్యాటర్లను ఏమేరకు నిలువరించగలరో చూడాలి. ఇక ఆతిథ్య బ్యాటింగ్ విభాగం మాత్రం పటిష్ఠంగానే ఉంది. 36 శతకాలు, 13వేలకు పైగా టెస్టు పరుగులు సాధించిన జో రూట్ జట్టుకు కొండంత అండగా చెప్పవచ్చు. వన్‌డౌన్‌లో రానున్న ఒల్లీ పోప్ జింబాబ్వేపై 170 రన్స్‌తో ఫామ్ కనబర్చాడు. క్రాలీ, డకెట్ శుభారంభం అందిస్తే రూట్, బ్రూక్, స్టోక్స్, స్మిత్‌లతో కూడిన మిడిలార్డర్ భారీ స్కోరు అందించే అవకాశం ఉంది. 8వ స్థానంలో వచ్చే వోక్స్ ఖాతాలో ఓ సెంచరీ ఉంది.

తుది జట్లు

భారత్ (అంచనా): రాహుల్, జైస్వాల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్, కరుణ్ నాయర్, జడేజా, శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ క్రిష్ణ.

ఇంగ్లండ్: జాక్ క్రాలీ, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్, క్రిస్ వోక్స్, బ్రైడన్ కార్స్, జోష్ టంగ్, షోయబ్ బషీర్.


తమ పేరిట జరుగనున్న సిరీస్ ట్రోఫీతో అండర్సన్-సచిన్

భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన అన్ని ఫార్మాట్ల మ్యాచ్‌ల్లో కలిపి ఎక్కువ రన్స్ సాధించిన ఆటగాడిగా నిలిచేందుకు జో రూట్ మరో 179 పరుగులు సాధిస్తే చాలు. ప్రస్తుతం విరాట్ (4036) టాప్‌లో, సచిన్ (3990) రెండో స్థానంలో ఉన్నారు. అలాగే ఇరు జట్ల మధ్య జరిగిన టెస్టుల్లో ఎక్కువ హాఫ్ సెంచరీలు గవాస్కర్ (16) పేరిట ఉన్నాయి. రూట్ మరో ఆరు అర్ధసెంచరీలు సాధిస్తే ఈ రికార్డు కూడా బ్రేక్ అవుతుంది.

పిచ్, వాతావరణం

లీడ్స్‌లో శుక్రవారం 29 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండనుంది. దీనికి తోడు పిచ్‌పై 8 మి.మీ మేర పచ్చిక ఉండడంతో ఆరంభంలో పేసర్లకు అనుకూలించనుంది. అయితే సమయం గడిచేకొద్దీ పిచ్ పొడిబారి బ్యాటింగ్‌కు సులువుగా మారనుంది. దీంతో బ్యాటర్లు ఓపిగ్గా నిలిస్తే భారీ స్కోర్లు ఖాయమే. ఆకాశం మబ్బులతో కూడి ఉన్నా వర్షం పడే అవకాశం లేదు.

ఆ విజయం ఐపీఎల్‌కంటే పెద్దది

'ఐపీఎల్ ప్రతీ ఏడాది వస్తుంటుంది. అలాగే ప్రతీ సీజన్‌లోనూ గెలిచే అవకాశం ఉంటాయి. కానీ ఆసీస్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, కివీస్‌లో ఆడే టెస్టు సిరీస్ గెలవడం ఐపీఎల్‌కన్నా మిన్న. ఇక టెస్టు జట్టుకు నాయకత్వం వహించడాన్ని అతిపెద్ద గౌరవంగా భావిస్తున్నాను. అలాగే ఈ ఫార్మాట్‌లో ఎన్ని పరుగులు సాధించినా 20 వికెట్లు తీయలేకపోతే గెలుపు సాధ్యం కాదు. మా బౌలర్ల లక్ష్యం కూడా అదే'
- గిల్

బుమ్రాకు భయపడం..

'బుమ్రా అద్భుత బౌలర్. కచ్చితంగా తను ప్రమాదకారే. కానీ మేం కేవలం ఒక్క బౌలర్‌పై దృష్టి సారించి ముందుకెళ్లలేం. అంతర్జాతీయ క్రికెట్‌లో భయమనేది ఉండదు. ఆతడొక్కడే సిరీస్‌ను గెలిపిస్తాడని భావించలేం. సమష్టి ప్రదర్శన వల్లే విజయం వరిస్తుంది. అలాగే విరాట్, రోహిత్, అశ్విన్ లేని భారత జట్టును మేమేమీ తేలిగ్గా తీసుకోవడం లేదు' - స్టోక్స్

శుభ్‌మన్‌కు సమయమివ్వాలి

సచిన్ టెండూల్కర్

న్యూఢిల్లీ: సంధి దశలో ఉన్న భారత జట్టుకు సారథ్యం వహిస్తున్న శుభ్‌మన్ గిల్‌కు తగినంత సమయం, సహకారం అందిస్తే విజయాలను అందుకోగలడని సచిన్ టెండూల్కర్ అన్నాడు. ట్రెన్నింగ్ రూమ్ బయట నుంచి వచ్చే వ్యాఖ్యల్ని పట్టించుకోకూడదని.. తన దైన వ్యూహంతో సాగాలని కొత్త కెప్టెన్‌కు మాస్టర్ సలహా ఇచ్చాడు. ఇక, ఇంగ్లండ్ పరిస్థితులకు తగ్గట్టుగా బ్యాటర్లు తమ ఆటతీరును మార్చుకోవాలని సూచించాడు. లీడ్స్ వికెట్ సంక్లిష్టమైనదని సచిన్ అభిప్రాయపడ్డాడు. పిచ్ పొడిబారి ఉండడంతో తుది జట్టులో ఇద్దరు స్పిన్నర్లకు చోటుదక్కే అవకాశం ఉందన్నాడు. జడేజాతోపాటు సుందర్ లేదా కుల్దీప్‌ను తీసుకోవచ్చన్నాడు.



ఆస్ట్రీ సవాళ్లే..: ఇంగ్లండ్ పరిస్థితులు కెప్టెన్ గిల్‌కు సవాళ్లు విసురుతాయని భారత మాజీ కెప్టెన్ రవిశాస్త్రి అన్నాడు. ఇక్కడి విజయాలు సొంతంచేసుకోవాలంటే ఒద్దిక అవసరమని చెప్పాడు. ఈ పర్యటనతో గిల్ ఎంతో కొంత అనుభవం గడిస్తాడన్నాడు. కాగా, గొప్ప నాయకుడిగా ఎదిగే లక్షణాలు గిల్‌లో ఉన్నాయని భారత మాజీ కోచ్ గ్యారీ కిర్‌స్టెన్ చెప్పాడు. అంతర్జాతీయ వేదికపై సత్తాచాటడానికి అతడు సిద్ధంగా ఉన్నట్టు తాను భావిస్తున్నానన్నాడు.

నిస్సాంక భారీ శతకం... శ్రీలంక 368/4

గాలె: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య శ్రీలంక జట్టు దీటుగా బదులిస్తోంది. ఓపెనర్ పథుమ్ నిస్సాంక (187) భారీ శతకం సాధించగా, మూడో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో లంక 368/4 పరుగులతో నిలిచింది. చాండిమల్ (54)తో కలిసి రెండో వికెట్‌కు నిస్సాంక 157 పరుగులు జోడించాడు. కెరీర్‌లో ఆఖరి టెస్టు ఆడుతున్న ఏంజెలో మాథ్యూస్ (39) పర్వాలేదనిపించగా.. క్రీజులో కమిందు మెండిస్ (37 బ్యాటింగ్), ధనంజయ (17 బ్యాటింగ్) ఉన్నారు. అంతకుముందు బంగ్లా మొదటి ఇన్నింగ్స్‌లో 495 పరుగులకు ఆలౌటైంది. పేర్రాంకో నాలుగు.. రత్నాయకే, ధరిందులు మూడేసి వికెట్లు దక్కాయి.

ఆదాని వాళ్లు నిధులు వెనక్కివ్వండి!

సాయ్ ఆదేశం

న్యూఢిల్లీ: సహేతుకమైన కారణాలు లేకుండా పలు అంతర్జాతీయ పోటీల్లో దేశం తరఫున ప్రాతినిథ్యం వహించకుండా తప్పుకుంటున్న క్రీడాకారులకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) షాకిచ్చింది. కేంద్ర క్రీడా శాఖ అమలు చేసే వివిధ పథకాల కింద వారికిచ్చిన నిధులను వెనక్కి తీసుకోవాలని జాతీయ టెన్నిస్ సంఘాన్ని సాయ్ ఆదేశించింది. 'తీసుకున్న నిధులకు క్రీడాకారులు జవాబుదారీగా ఉండాలి. దేశం తరఫున ఆడేందుకు వారి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సాయ్ పేర్కొంది. టాప్స్‌తో పాటు కొత్తగా టీడీజీ (టార్గెట్ ఆసియా గేమ్స్ గ్రూప్)ను సాయ్ ఏర్పాటు చేసింది. భారత టెన్నిస్ ప్లేయర్లు యుకీ బాంబ్రీ, శశికుమార్ ముకుంద్, సుమిత్ నగల్ గత ఏడాది నుంచి పలు అంతర్జాతీయ టోర్నీల నుంచి వైదొలగడం తెలిసిందే.

స్పోర్ట్స్

సీజన్ తొలి టైటిల్‌పై

నీరజ్ గురి

అర్ధరాత్రి 1.10 నుంచి

నేడు పారిస్ డైమండ్ లీగ్



పారిస్: ఇటీవలే 90 మీటర్ల మార్క్‌ను అందుకున్న భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ఇప్పుడీసీజన్ తొలి టైటిల్‌పై దృష్టి సారించాడు. ఈక్రమంలో శుక్రవారం జరిగే పారిస్ డైమండ్ లీగ్‌లో విజేతగా నిలవాలని పట్టుదలగా ఉన్నాడు. కానీ జర్మనీ దిగ్గజం జులియన్ వెబర్, రెండుసార్లు వరల్డ్ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనడా) నుంచి చోప్రాకు తీవ్ర పోటీ ఎదురు కానుంది. పారిస్ డైమండ్ లీగ్ బరిలో దిగుతున్న ఏను గురు త్రోయర్లలో ఐదుగురు 90 మీ. మార్క్‌ను చేరుకున్నవారే కావడం గమనార్హం. ఈ లీగ్ 'వాండా డైమండ్ లీగ్' యూ ట్యూబ్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది.

స్వర్ణాల వేటలో షణ్ముఖి, గణేశ్

● ఆసియా కప్ స్టేజ్-2 ఆర్చరీ

సింగపూర్: ఆసియా కప్ స్టేజ్-2లో ఆంధ్రప్రదేశ్ ఆర్చర్లు అదరగొడుతున్నారు. విజయవాడకు చెందిన షణ్ముఖి నాగసాయి బుద్ది మరో రెండు పతకాలు ఖరారు చేసుకోగా.. నాయుడుపేట ఆర్చర్ గణేశ్ మణిరత్నం తిరుమూరు టీమ్ స్వర్ణ పోరుకు చేరుకొంది. గురువారం మొత్తంగా ఐదు టీమ్ ఈవెంట్లలో భారత జూనియర్ ఆర్చర్లు ఫైనల్స్‌కు చేరుకొన్నారు. మహిళల కాంపౌండ్ టీమ్ సెమీస్‌లో షణ్ముఖి, తేజల్, తనిష్కతో కూడిన భారత జట్టు 230-229తో నాలుగో సీడ్ కజకిస్థాన్‌పై గెలిచింది. కాంపౌండ్ మిక్స్‌డ్‌లో షణ్ముఖి-కునాల్ జంట 155-154తో ఇండోనేసియా జంట నురిసా దియాన్ ఆప్రిల్-ప్రమా విష్ణు వర్ధనపై నెగ్గి ఫైనల్‌కు చేరుకొంది. కాంపౌండ్ పురుషుల టీమ్ సెమీస్‌లో కునాల్ దలాల్, గణేశ్ తిరుమూరు, మిహిర్ ఆప్‌లే త్రయం షూటాఫ్‌లో ఆస్ట్రేలియాపై నెగ్గింది. విష్ణు చౌదరి, పరాశ్ హుడా, జుయెల్ సర్కార్‌తో కూడిన పురుషుల రికర్వ్ టీమ్ 5-1తో బంగ్లాదేశ్‌ను ఓడించింది. స్వర్ణ పోరులో జపాన్‌తో భారత్ తలపడనుంది. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ సెమీస్‌లో వైష్ణవి పవార్-విష్ణు చౌదరి జంట 5-3తో సింగపూర్ జోడీపై గెలిచింది.

జెమీమాను రిటైన్ చేసుకున్న బ్రిస్బేన్

మెల్‌బోర్న్ : మహిళల బిగ్‌బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) 11వ సీజన్‌కు సంబంధించి క్రికెటర్ల ఎంపిక గురువారం ముగిసింది. భారత్‌నుంచి మొత్తం 15 మంది క్రికెటర్లు బరిలో నిలవగా..కేవలం జెమీమా రోడ్రిగ్స్ మాత్రమే ఎంపికైంది. బ్రిస్బేన్ హీట్ ఆమెను రిటైన్ చేసుకుంది. మొత్తం ఏడింటి ఫ్రాంచైజీలు 23 మంది అంతర్జాతీయ క్రీడాకారిణులను ఎంపిక చేసుకున్నాయి.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తా: అజారుద్దీన్



బంజారాహిల్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా తానే పోటీ చేస్తానని క్రికెటర్, పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు మహ్మద్ అజారుద్దీన్ చెప్పారు. గురువారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేశానని, చివరి క్షణంలో పార్టీ టికెట్ ఇచ్చినప్పటికీ ఆఖరి వరకు పోరాడానని, తక్కువ ఓట్లతో ఓడిపోయానని తెలిపారు. ఆ తరువాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అత్యధిక ఓట్లు జూబ్లీహిల్స్ అసెంబ్లీ పరిధి నుంచే కాంగ్రెస్‌కు వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం కోసం ఏడాదిన్నర కాలంగా పని చేస్తున్నామని, ఇప్పటికీ పలు మార్లు బూత్ స్థాయిలో, డివిజన్ స్థాయిలో సమావేశాలు నిర్వహించామని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పార్టీ చాలా బలంగా ఉందని, ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీలోనే ఉన్న కొంతమంది వ్యక్తులు కావాలని సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు రాయిస్తున్నారని, తనకు టికెట్ ఇవ్వడంలేదని ప్రచారం చేస్తున్నారని, ఈ విషయాన్ని కూడా తాను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానని ఆయన తెలిపారు.

కేటీఆర్.. నోరు అదుపులో పెట్టుకో: గజ్జల కాంతం

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్ తన నోరును అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం హెచ్చరించారు. కేటీఆర్ మతి స్థిమితం కోల్పోయి సీఎం రేవంత్ రెడ్డిపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయనను ఎర్రగడ్డ మెంటల్ ఆసుపత్రికి పంపాల్సిన అవసరం ఉందని విమర్శించారు. ఉద్యమ ద్రోహులను పక్కన పెట్టుకుని నోటికొచ్చింది మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. కేసీఆర్ కుటుంబ దోపిడీని ఎపిసోడ్‌ల రూపంలో బయటపెడతానని తెలిపారు.

క్యాబినెట్ ఆమోదం లేకుండా కాళేశ్వరం సాధ్యమా?:ఎంపీ ఈటల

హైదరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): క్యాబినెట్ ఆమోదం లేకుండా కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టులు నిర్మించడం సాధ్యమవుతుందా అని బీజేపీ ఎంపీ, మాజీ ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్, సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. నాటి క్యాబినెట్‌లో పనిచేసిన ముగ్గురు ఇప్పుడు సీఎం రేవంత్ వద్ద ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 96 క్యాబినెట్ సమావేశాలు జరిగినా ఒక్కదాంట్లో కూడా కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులపై చర్చ జరగలేదంటూ సీఎం చేసిన ప్రకటనపై ఈటల స్పందించారు. వివిధ శాఖల్లో తీసుకునే నిర్ణయాలను క్యాబినెట్ ముందుంచాలని అప్పటి సీఎం కేసీఆర్ ఆదేశించేవారని గుర్తు చేశారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు నాటి సీఎం కేసీఆర్ రీ డిజైన్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని చెప్పారు. ప్రాజెక్టుల్లో అవినీతి జరిగితే విచారణ జరగాల్సిందే అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఏర్పాటైన పీసీ ఘోష్ కమిషన్ నివేదికను అమలు చేసే దమ్ముందా అని సీఎం రేవంత్‌కు ఈటల సవాల్ విసిరారు.

పీసీఐ పాలకమండలి సభ్యుడిగా వెంకటరమణ



ఢిల్లీలోని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) కేంద్ర పాలకమండలి సభ్యులుగా హైదరాబాద్‌లోని ఆజాద్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ముప్పవరపు వెంకటరమణ నియమితులయ్యారు. అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) తరఫు నుంచి ఆయనను పీసీఐ కేంద్ర పాలక మండలి సభ్యుడిగా సిఫారసు చేశారు. ఈ నేపథ్యంలో ఈయనను ఐదేళ్ల కాలానికి పాలకమండలి సభ్యుడిగా నియమిస్తూ గురువారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ ఫార్మసీ కళాశాల యాజమాన్యాల సంఘం అభినందనలు తెలియజేసింది. సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతానికి చెందిన వెంకటరమణ అఖిల భారత ఫార్మసీ ఉపాధ్యాయుల సంఘానికి ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నారు.

'కొండపోచమ్మ' నిర్వాసితుడి ఆత్మహత్య

ములుగు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టు పరిహారం రాకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో ఓ నిర్వాసితుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామానికి చెందిన దాచారం మల్లయ్యకు 5.30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కొండ పోచమ్మ సాగర్ నిర్మాణంలో భూసేకరణ చేపట్టగా, గ్రామస్థులు కొందరితో కలిసి మెరుగైన పరిహారం కోసం మల్లయ్య కోర్టును ఆశ్రయించారు. కోర్టులో వ్యవహారం తేలకపోవడం, పరిహారం రాకపోవడంతో మూడు నెలల క్రితం మల్లయ్య గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో కుమారుడు దాచారం అనిల్ (23) కుటుంబ బాధ్యతలు మోస్తున్నాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో కుటుంబ నిర్వహణ భారమై మనస్తాపానికి గురైన అనిల్ గురువారం రాత్రి ఇంట్లో (ఆర్అండ్ఆర్ కాలనీలో ప్రభుత్వం అందజేసిన రేకుల షెడ్డు)లో ఉరేసుకున్నాడు.

గుడ్ల సరఫరా టెండర్లను ఖరారు చేయండి

» హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టెండర్లు దాఖలు చేసిన బిడ్డర్ల కోసం కాకపోయినా ఆరోగ్యలక్ష్మి, ఇతర ప్రభుత్వ పోషకాహార పథకాల లబ్ధిదారుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా కోడిగుడ్ల సరఫరా టెండర్లను ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ మార్చి 30న టెండర్ నోటిఫికేషన్ జారీచేసి ఇప్పటివరకు ఖరారు చేయలేదని పేర్కొంటూ సిరి ఫామ్స్ అనే సంస్థ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కారణాలు చెప్పకుండా చివరి గడువు తేదీ పొడిగిస్తూ పోవడం వల్ల ధరావతు సొమ్ము, ప్రాసెసింగ్ ఫీజుల రూపంలో భారం పడుతోందని పిటిషనర్ తరఫు న్యాయవాదులు రాజా శ్రీపతిరావు, ఏ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గుడ్ల నాణ్యతా ప్రమాణాలు, సేకరణ ప్రక్రియను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం వివిధ స్థాయిల్లో విధాన నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. పరిపాలనాపరమైన కారణాల వల్ల జరిగే ఆలస్యానికి ఎలాంటి దురుద్దేశాలు ఆపాదించలేమని.. వాయిదాలను ప్రశ్నించే హక్కు పిటిషనర్‌కు లేదని ప్రకటించింది. బిడ్డర్లు సైతం ధరావతు సొమ్ము కింద కోసం భారీ ఎత్తున పెట్టుబడి పెట్టిన విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలిపింది. అందువల్ల త్వరగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

నవీన్‌మిట్టల్ ప్రాసిక్యూషన్‌కు అనుమతివ్వండి

» హైకోర్టులో పిటిషన్ దాఖలు

హైదరాబాద్ కలెక్టర్ హోదాలో గుడిమల్కాపూర్ నానల్‌నగర్‌లోని సర్వే నెంబర్ 284/6లో 5,262 చదరపు గజాల స్థలానికి అక్రమంగా ఎన్‌వోసీ ఇచ్చి.. దాన్ని కబ్జా చేసి ఇతర నిందితులతో కలిసి అద్దెకు ఇచ్చుకున్నారనే ఆరోపణలపై ఐఏఎస్ నవీన్‌మిట్టల్‌కు వ్యతిరేకంగా హైకోర్టులో రెండు వేర్వేరు పిటిషన్‌లు దాఖలయ్యాయి. ప్రభుత్వ ఉద్యోగి అయిన నవీన్‌మిట్టల్ ప్రాసిక్యూషన్‌కు సీఆర్పీసీ సెక్షన్ 197 ప్రకారం ప్రభుత్వ ముందస్తు అనుమతి ఇచ్చేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ శాంతి అగర్వాల్ (84) హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ చేపట్టిన జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం.. ప్రాసిక్యూషన్‌కు ముందస్తు అనుమతి ఇచ్చే అంశంపై వివరణ ఇవ్వాలని చీఫ్ సెక్రటరీ (సీఎస్), ఐఏఎస్ నవీన్‌మిట్టల్ తదితరులకు నోటీసులు ఇచ్చింది. మరోవైపు అక్రమ ఎన్‌వోసీ వ్యవహారంలోనే నవీన్‌మిట్టల్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంటూ దిగువ కోర్టులో శాంతి అగర్వాల్ ఫిర్యాదు చేశారు. అయితే నవీన్‌మిట్టల్ ప్రాసిక్యూషన్‌కు ప్రభుత్వ ముందస్తు అనుమతి లేదనే కారణంతో దిగువ కోర్టు దాన్ని తీసుకోలేదు. దీన్ని సవాలు చేస్తూ ఆమె హైకోర్టులో మరో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌లో సైతం నవీన్‌మిట్టల్ తదితరులకు హైకోర్టు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ జూలై 31కి వాయిదాపడింది.

కృష్ణమ్మ కదిలె!

» ఆల్మట్టి, నారాయణపూర్ గేట్ల నుంచి దిగువకు వరద

» జూరాలలోకి 40వేల క్యూసెక్కులు.. 52వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

» శ్రీశైలంలోకి 45వేలు, సాగర్‌లోకి 11వేల క్యూసెక్కులు



జూరాల జలాశయం నుంచి నాలుగు గేట్ల ద్వారా నీరు విడుదలవుతున్న దృశ్యం

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణమ్మ జలసిరిని సంతరించుకుంటోంది. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణానది పరిధిలోని ప్రాజెక్టుల్లోకి వరద నీరు వస్తోంది. ఆల్మట్టిలోకి 80 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. 27, 967 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా... ప్రస్తుతం జలాశయంలో 68.55 టీఎంసీల నీరు ఉంది. దిగువన నారాయణపూర్ ప్రాజెక్టులోకి 29,800 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. 25,063 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రస్తుతం 29.91 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలకు 40 వేల క్యూసెక్కులు, తుంగభద్రకు 43 వేల క్యూసెక్కులకు వరద వస్తోంది. 52,468 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 7.224 టీఎంసీలకు నీటి నిల్వ చేరుకుంది. జూరాల ఎగువ కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా 34.713 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 38.506 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది. శ్రీశైలం ప్రాజెక్టులోకి 42 వేల క్యూసెక్కులు, నాగార్జునసాగర్‌లోకి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు స్వల్పంగానే వరద వస్తోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 847.10 అడుగులకు నీటిమట్టం చేరింది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు. ప్రస్తుతం 73.9870 టీఎంసీల నీరు ఉంది. మహారాష్ట్ర ఔరంగబాద్ శివారులోని పైఠన్ పట్టణంలో ఉన్న జైక్వాడి ప్రాజెక్టులోకి 819 క్యూసెక్కులు, సింగూరులోకి 600 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 599 క్యూసెక్కులు, మిడ్‌మానేరులోకి 125 క్యూసెక్కులు, శ్రీపాద ఎల్లంపల్లిలోకి 454 క్యూసెక్కుల వరద వస్తోంది.

బనకచర్లకు సీఎం రేవంత్

గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుంది!

» 1000 టీఎంసీలిస్తే చాలు.. ప్రాజెక్టు కట్టుకోమంటావా?

» కృష్ణాలో 763 టీఎంసీల కోసం కొట్లాడుతుంటే 500 చాలంటావా?

» నదీ జలాలు ఏమైనా మీ అయ్య జాగీరా..?

» చంద్రబాబును అడుక్కునే బుద్ధి పోవట్లేదు

» కేసీఆర్‌పై రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే

» మాజీ మంత్రి హరీశ్ విమర్శలు



హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గోదావరి బేసిన్‌లో 1000 టీఎంసీలు, కృష్ణా బేసిన్‌లో 500 టీఎంసీలు తెలంగాణకు ఇచ్చి ఏపీకి ఎన్ని నీళ్లైనా తీసుకెళ్లాలని చెప్పడానికి నువ్వేమైనా రాజువా? నదీ జలాలు మీ అయ్య జాగీరా? మాకిన్ని నీళ్లు ఇచ్చి, మిగిలిన మొత్తం తరలించుకెళ్లమని చెప్పడానికి నువ్వెవరు? అని మాజీ మంత్రి హరీశ్‌రావు సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. గోదావరిలో 1950 టీఎంసీలు కావాలని కేసీఆర్ గతంలోనే అడిగారని, అలాంటిది నువ్వు 1000 టీఎంసీలు ఇస్తే చాలని, బనకచర్ల ప్రాజెక్టు కట్టుకోవాలని చెబుతావా? అని నిలదీశారు. రేవంత్‌కు బేసిన్స్, బేసిక్స్ కూడా తెలియవని ఎద్దేవా చేశారు. బుధవారం ఆయన మాట్లాడిన మాటలు చూస్తే బనకచర్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లుగా ఉందన్నారు. రేవంత్ తాను నల్లమల పులిబిడ్డనని చెప్పుకొంటాడని.. ఆయన పులిబిడ్డ కాదని, వెకిలి మాటల వెర్రిబిడ్డ అని హరీశ్ ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేతలు నిరంజన్‌రెడ్డి, మాలోతు కవిత, సబితా ఇంద్రారెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, తదితరులతో కలిసి హరీశ్ మీడియాతో మాట్లాడారు. ఓ వైపు మన రాష్ట్రానికి కృష్ణాలో 763 టీఎంసీల కోసం కొట్లాడుతుండగా.. మరోవైపు నువ్వు 500 టీఎంసీలు చాలంటే ఎవరికి నష్టమని నిలదీశారు. ట్రైబ్యునల్ దాన్నే ఆమోదిస్తే, తెలంగాణకు అన్యాయం జరగదా? అని ప్రశ్నించారు. నీ స్వార్థం కోసం రాష్ట్ర హక్కులను చంద్రబాబుకు రాసిస్తానంటే ప్రజలు ఊరుకోరని, ఉద్యమిస్తారని హెచ్చరించారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం ఏటా గోదావరి నుంచి 3000 టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయని కేసీఆర్ అప్పటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అన్నారని, అప్పుడు బనకచర్ల ముచ్చటే రాలేదని చెప్పారు. అలాంటిది బనకచర్లకు నీళ్లు తీసుకువెళ్లాలని కేసీఆర్ చెప్పారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 200 టీఎంసీల నీటిని ఏపీ కొట్టుకుపోతుంటే ఆపలేవా? అని ప్రశ్నించారు.

అలా చెప్పడానికి నువ్వెవరు?

2020 అక్టోబరు 2న కేంద్ర మంత్రికి అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాశారని.. సముద్రంలో కలిసే 3000 టీఎంసీల గోదావరి నీళ్లలో 1950 టీఎంసీలు తెలంగాణకు కావాలని అందులో కోరారని హరీశ్ గుర్తుచేశారు. కృష్ణా బేసిన్లో 763 టీఎంసీలు తెలంగాణకు రావాలని ట్రైబ్యునల్ ముందు గతంలో అఫిడవిట్ దాఖలు చేసినట్లు చెప్పారు. అలాంటిది గోదావరి బేసిన్‌లో 1000 టీఎంసీలు, కృష్ణా బేసిన్‌లో 500 టీఎంసీలు ఇచ్చి ఏపీకి ఎన్ని నీళ్లైనా తీసుకెళ్లాలని చెప్పడానికి నువ్వెవరివి? అని రేవంత్‌ను నిలదీశారు. అఖిలపక్ష సమావేశాన్ని రాజకీయాలకు వేదికగా మార్చుకున్నారని విమర్శించారు. కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేశారని, అసలు విషయాన్ని దాచిపెట్టారని చెప్పారు. రేవంత్ చదివిన పేజీలోనే గోదావరి, కృష్ణా నదుల అనుసంధాన విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ముందుకు వెళ్లకూడదని ఉందని.. ఒకవేళ అలా చేస్తే తెలంగాణ అంగీకరించదని కేసీఆర్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. ఈ విషయాలను దాచిపెట్టి, కేసీఆర్‌ను బద్నాం చేసేలా రేవంఅబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. జగన్‌తో తాము ఏం మాట్లాడామనే అజెండా ఉంటే బయటపెట్టాలని హరీశ్ డిమాండ్ చేశారు.

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు: నిరంజన్‌రెడ్డి

కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా పెంపు కోసం ప్రయత్నించక పోగా కృష్ణాలో 500 టీఎంసీలు, గోదావరిలో 1000 టీఎంసీలిచ్చి మిగిలినవి తీసుకొమ్మనడం సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతా రాహిత్యమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. రేవంత్ పాలనలో తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారన్నారు. ప్రతి అంశంలో తెలంగాణను కించపరిచి, అవహేళన చేసి మాట్లాడడం ఆయనకు తగదని, ఇదొక మానసిక రుగ్మతలా కనబడుతోందని విమర్శించారు.

బేసిన్స్, బేసిక్స్ తెలియదు..!

అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోమంటే సీఎంకు అర్థం కావడం లేదని హరీశ్ ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు ఏ బేసిన్‌లో ఉందని అడగడం ద్వారా ఆయన తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డికి బేసిక్స్, బేసిన్స్, రెండూ తెలియవని, బ్యాగుల మీద ఉన్న పరిజ్ఞానం బేసిన్‌లపై లేదని చెప్పారు. ఆయనలో విషం తప్ప విషయం లేదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. బనకచర్ల ఎక్కడ ఉందని సీఎం అడిగితే ఆయన సలహాదారుడు ఆదిత్యాదాస్ ప్రకాశం జిల్లాలో ఉందని చెప్పారని.. బనకచర్ల ప్రస్తుత నంద్యాల జిల్లా పరిధిలో ఉందన్న విషయం కూడా వారిద్దరికీ తెలియకపోవడం దారుణమని పేర్కొన్నారు. మాట్లాడితే నల్లమల పులిబిడ్డనని చెప్పే ఆయన ఆ ప్రాంతం తెలంగాణలోదా? ఆంధ్రాలో ఉందా? అని అడిగారని, అలాగే దేవాదుల గోదావరి బేసిన్ కదా అంటూ అజ్ఞానంతో అడిగారని విమర్శించారు. సీఎం మాటలతో రాష్ట్రం పరువు పోయిందన్నారు. బేసిన్ల గురించి తెలుసుకోవడం బూతులు మాట్లాడినంత సులువు కాదన్నారు. చంద్రబాబును అడుక్కునే బుద్ధి రేవంత్‌కు ఇంకా పోవడం లేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే శ్రీశైలం రైట్‌బ్యాంక్ కెనాల్ లైనింగ్ పనులు ప్రారంభమయ్యాయని, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత సీఎంపైనే ఉందన్నారు. కృష్ణా, గోదావరి జలాల వాటా విషయంలో అర్థంలేని వ్యాఖ్యలు చేస్తున్న సీఎంను ఉరి తీసినా తప్పులేదన్నారు.

ఉత్తమ్ రాజీనామా చేయాలి

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు ఏకమై కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నాయని, బీఆర్ఎస్, కేసీఆర్‌ను ఇబ్బందిపెట్టడమే వాటి లక్ష్యమని హరీశ్ ఆరోపించారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కూలితే రెండు రోజులకే వచ్చిన ఎన్‌డీఎస్ఏను.. ఎస్ఎల్‌బీసీ కూలి, పలువురు మృతిచెందినా మోదీ ఎందుకు పంపలేదని ప్రశ్నించారు. రూ.వేల కోట్లు వృథా కావడమేగాక ఎస్ఎల్బీసీ భవితవ్యం ప్రశ్నార్థకమైందన్నారు. దీనికి బాధ్యత వహిస్తూ ఉత్తమ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

రాహుల్ జన్మదినం సందర్భంగా..

క్యాన్సర్ రోగికి జగ్గారెడ్డి ఆర్థిక సాయం

» ఆఫీసుకు పిలిచి 10లక్షల అందజేత

» వైద్య ఖర్చులు పూర్తిగా భరిస్తానని హామీ

» ఇప్పటి వరకు వైద్యానికి అయిన ఖర్చును

» సీఎంఆర్ఎఫ్ నుంచి ఇప్పిస్తానని భరోసా

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో అతడో చిరుద్యోగి. నెల వేతనం రూ. 13 వేలకు మించి లేదు. ఆ కొద్దిపాటి ఆదాయంతోనే భార్య, ఇద్దరు పిల్లలను పోషిస్తున్నాడు. అయితే, ఆ చిరుద్యోగి కొంత కాలం కిందట క్యాన్సర్ బారిన పడ్డాడు. క్యాన్సర్ వైద్యం.. ఖరీదైనది కావడంతో ముచ్చటైన ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి పూర్తిగా తల్లకిందులైంది. ఇప్పటికే వైద్యం కోసం రూ.లక్షలు ఖర్చు చేసిన కుటుంబ సభ్యులు.. ఇక ముందు ట్రీట్‌మెంట్ ఎలా చేయించాలో తెలియక దిక్కుతోచని స్థితిలో పడ్డారు. సంగారెడ్డి నియోజకవర్గంలోని తాళ్లపల్లి గ్రామానికి చెందిన హరికృష్ణ ప్రసాద్ దీన గాథ ఇది. ఆయనకు భార్య శైలజ, ఎల్‌కేజీ, ఒకటో తరగతి చదువుతున్న పాప, బాబు ఉన్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా.. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్నాడు. తన అనుచరుల ద్వారా విషయం తెలుసుకున్న టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ఆ చిరుద్యోగిని ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా ఆర్థిక సాయం అందించాలన్న నిర్ణయానికి వచ్చారు. అనుకున్నదే తడవుగా హరికృష్ణప్రసాద్ కుటుంబాన్ని గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయానికి పిలిపించుకుని రూ.10 లక్షల సాయం అందించారు. రానున్న రోజుల్లో వైద్యానికి అయ్యే పూర్తి ఖర్చులను భరిస్తానని హామీ ఇచ్చారు. ఏ కష్టమొచ్చినా తాను అండగా ఉంటానంటూ ధైర్యం చెప్పారు. జగ్గారెడ్డిని కలిసిన వారిలో బాధితుడితో పాటు ఆయన భార్య, తల్లి, సోదరుడు ఉన్నారు.



క్యాన్సర్ రోగి హరికృష్ణ ప్రసాద్ కుటుంబానికి రూ.10లక్షలు అందజేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



ప్రజాభవన్‌లో కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం, తదితరులు

రాహుల్ ఒత్తిడి వల్లే

కేంద్రం కులగణన

» మంత్రి పొన్నం ప్రభాకర్.. గాంధీభవన్‌లో రాహుల్ జన్మదిన వేడుకలు



గాంధీభవన్‌లో కేక్ కట్ చేస్తున్న పొన్నం

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాహుల్‌గాంధీ ఒత్తిడి మేరకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణనకు ఒప్పుకొని గెజిట్ విడుదల చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాబోయే తరానికి రాహుల్‌గాంధీ ఒక దిక్సూచి లాంటి వారని ఆయన కొనియాడారు. గాంధీభవన్‌లో గురువారం రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో పార్టీ నేతలు, కార్యకర్తలు రాహుల్‌గాంధీ భారీ కటౌట్‌ను ఏర్పాటు చేశారు. భారీ కేక్‌ను కట్ చేసి.. బాణా సంచా కాల్చుతూ సంబరాలు జరుపుకొన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ చేసిన కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించిందని చెప్పారు. దేశ ప్రజల హితం కోసమే రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేశారని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. సామాజిక న్యాయం కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. నిజాయితీ, ధైర్యం, రాజ్యాంగ విలువలతో ముందడుగేస్తూ.. సామాన్యుల ఆకాంక్షలకు గొంతుకగా నిలుస్తోన్న ప్రజానాయకుడు రాహుల్ గాంధీ అని టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అన్నారు. రాహుల్‌గాంధీ జన్మదినం.. ఆయనకు ఆరోగ్యం, ఆయుష్షు, మరిన్ని విజయాలను తీసుకురావాలని కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

ప్రజాభవన్‌లో కార్మికుల మధ్య రాహుల్ జన్మదిన వేడుకలు

రాహుల్ జన్మదిన వేడుకలు ప్రజాభవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం కార్మికులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాడు బీఆర్ఎస్‌ను ముంచి..

నేడు కాంగ్రెస్‌ను నాశనం చేస్తున్నడు

» నాడు కాళ్లు పట్టుకున్న వ్యక్తి.. ఇప్పుడు ఎమ్మెల్యే

» కోడి కూడా పొడవనోడికి గన్‌మెన్ ఎందుకు?

» కడియం, రేవూరి, ఎర్రబెల్లిపై కొండా మురళి ధ్వజం

» సురేఖ మంత్రి పదవికి ఏం ఢోకా లేదని వ్యాఖ్య

» ఆమెకు మూడు శాఖలున్నా పైసా రాదు..

» నెలకు 5లక్షలు తానే పంపుతున్నానని వెల్లడి



వరంగల్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): "ఎవరైనా మీసాలు, గడ్డాలు గీయించుకుంటారు.. కానీ, ఈ నాయకుడైతే కను బొమ్మలు గీయించుకుంటడు. టీడీపీలో 15ఏళ్లు ఉండి, మంత్రి పదవులు అనుభవించి ఆ పార్టీని భ్రష్టు పట్టించాడు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరి కేసీఆర్‌ను, కేటీఆర్‌ను తప్పుదోవ పట్టించి నాశనం చేశాడు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరి.. పార్టీని కరాబు చేస్తున్నడు" అని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు విమర్శించారు. వరంగల్‌లోని పోచమ్మమైదాన్ సెంటర్‌లో గురువారం ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కొండా మురళీధర్‌రావు హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఉద్దేశించి ఆయన పరోక్ష విమర్శలు చేశారు. ఇజ్జత్, మానవత్వం ఉంటే... బయటి పార్టీ నుంచి వచ్చిన వాళ్లు.. రాజీనామా చేసి మళ్లీ గెలవాలని సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు కాళ్లు పట్టుకున్న నాయకుడు.. ఈ రోజు పరకాల ఎమ్మెల్యే అయ్యాడని వ్యాఖ్యానించారు. "నీ ఫామ్ హౌస్‌లో, నీ కోళ్ల ఫామ్‌లో నిన్ను కోడి కూడా పొడవదు.. నీకెందుకు గన్‌మెన్.. నిన్ను కొడితే కుక్కను కొట్టినట్టే" అంటూ ఎర్రబెల్లిని ఉద్దేశించి తీవ్ర విమర్శలు చేశారు. ఢిల్లీలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఉన్నారని, ఇక్కడ రేవంత్‌రెడ్డి ఉన్నారని, సురేఖ మంత్రి పదవికి ఏం ఢోకా లేదని స్పష్టం చేశారు. సురేఖకు మూడు శాఖలున్నా.. పైసా రాదని, తానే నెలకు రూ.5లక్షలు పంపుతున్నానని పేర్కొన్నారు.

గండిపేటలో పుట్టగొడుగుల్లా కన్వెన్షన్ సెంటర్లు

» వాటికి అనుమతులున్నాయా ? లేదా? విచారణ జరిపించండి

» సీఎం రేవంత్ రెడ్డికి ఎఫ్‌జీజీ లేఖ

గండిపేట చెరువును ఆనుకుని పుట్టగొడుగుల్లా వెలుస్తున్న కన్వెన్షన్ సెంటర్ల అనుమతుల అంశంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. జన్వాడ గ్రామం, శంకర్‌పల్లి మండలంలో అనుమతులు లేకుండా పెద్ద ఎత్తున కన్వెన్షన్ సెంటర్లను నిర్మిస్తున్నారని ఆరోపించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌కు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి ఓ లేఖ రాశారు. గండిపేట చెరువు నీటికి 500 మీటర్ల దూరంలో పలు కన్వెన్షన్ సెంటర్లు ఉన్నాయని, వీటికి అధికారిక అనుమతులు ఉన్నాయా? లేదా? అనే విషయంపై జన్వాడ పంచాయతీ, నార్సింగి మునిసిపాలిటీల నుంచి స్పష్టత రావడం లేదని తెలిపారు. సమాచార హక్కు చట్టం కింద నార్సింగి మునిసిపల్ కమిషనర్ నుంచి వివరాలు కోరగా.. ఆ సెంటర్లు చాలా కాలం క్రితం నిర్మాణమయ్యాయని, జన్వాడ గ్రామ పంచాయతీ వారు తమకు ఎలాంటఅనుమతుల దస్త్రాలను బదిలీ చేయలేదని సమాధానమిచ్చారని తెలిపారు. గండిపేట చెరువును ఆనుకుని వెలిసిన కన్వెన్షన్ సెంటర్లపై స్పందించాలని ముఖ్యమంత్రిని కోరారు.

కమిషన్ నివేదిక తర్వాతే ఇంజనీర్లపై చర్యలు

» ప్రస్తుతానికి 30 మంది పదోన్నతులకు బ్రేక్ !

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో నిబంధనలు పాటించని అధికారులపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ నివేదిక చేతికి అందాకే తదుపరి చర్యలు చేపట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణ చేపట్టిన విజిలెన్స్ బృందాలు ఇచ్చిన నివేదిక ఆధారంగా 38 మందికి నోటీసులు అందించాలని నిర్ణయించారు. మంగళవారం నుంచి నోటీసులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభించగా... ఇప్పటిదాకా 36మందికి నోటీసులు చేరినట్లు సమాచారం. శుక్రవారం నాటికల్లా బాధ్యులైన అధికారులందరికీ నోటీసులు చేరనున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి కారకులని భావిస్తున్న 17మందిపై నేరపూరిత కేసులో విచారణ చేపట్టాలని, 33 మందిపై శాఖపరమైన చర్యలు (ఆర్టికల్ ఆఫ్ చార్జెస్), పదవీ విరమణ చేసిన 7మందికి సవరణ పెన్షన్ నిబంధనలు అనుసరించి, పెన్షన్‌లో కోత విధిస్తూ పెనాల్టీలు విధించాలని విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఒకొక్కరిపై రెండు, మూడేసి అభియోగాలు ఉండటంతో 38 మందిని బాధ్యులుగా గుర్తించి, నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్‌బొజ్జా నోటీసులు ఇచ్చారు. వీరిలో సర్వీసులో ఉన్న వారితోపాటు పదవీ విరమణ పొందిన వారూ ఉన్నారు. నోటీసు అందుకున్న 21 రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది. ఇక, వచ్చే నెల 10వ తేదీ తర్వాత జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందించే అవకాశాలున్నాయని సమాచారం. నోటీసులు అందుకున్న వారి నుంచి సంజాయిషీ కూడా అదే సమయంలో అందనుంది. వాటిపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేశాక...తదుపరి అడుగులు పడనున్నాయి. ప్రస్తుతానికి సర్వీసులో 32 మంది ఉండగా... వీరిలో ఇద్దరు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. దాంతో మిగిలిన 30మంది పదోన్నతులకు బ్రేక్ పడే అవకాశాలున్నాయి.

వ్యవసాయ యాంత్రీకరణకు 104 కోట్లు!

» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణకు 2025- 26 సంవత్సరానికి బడ్జెట్‌లో రూ. 104 కోట్ల కేటాయింపులు చేసినట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు ఉపయోగపడే వ్యవసాయ యంత్రాలు, పరికరాలను సబ్సిడీ కింద పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న, సన్నకారు రైతులు, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కేంద్రం 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద సరఫరాచేసే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు కేటాయించాలని తుమ్మల సూచించారు. పొద్దుతిరుగుడు, జొన్నల కొనుగోళ్లకు సంబంధించి 333 కోట్లు రైతులకు చెల్లించినట్లు తుమ్మల చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు నిర్దేశించే దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ ఖర్చులు, ధరల కమిషన్(సీఏపీపీ) సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) వినియోగంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు నెదర్లాండ్‌కు చెందిన 'ఏఆర్ఐక్యూటీ' కంపెనీ ప్రతినిధులతో తుమ్మల సమావేశమయ్యారు. రైతుల ఫిర్యాదులపై ఏఐ ఆధారంగా సూచనలు ఇస్తామని, పంటలను ఆశించే చీడపీడలను మొబైల్ కెమెరాతో స్కాన్‌చేసి గుర్తించే టెక్నాలజీని తీసుకొస్తామని తుమ్మలకు సంస్థ ప్రతినిధులు వివరించారు.

గోదావరి-బనకచర్లకు బదులుగా కృష్ణాలో 200 టీఎంసీల వాటా ఇవ్వాలి

» తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం

పోలవరం నుంచి 200 టీఎంసీల గోదావరి జలాలను గోదావరి-బనకచర్ల అనుసంధానంతో తరలిస్తే... దానికి బదులుగా కృష్ణాలో 200 టీఎంసీల వాటాను అదనంగా తెలంగాణకు కేటాయించాలని తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం డిమాండ్ చేసింది. అంతేకాకుండా గోదావరి, దాని ఉప నదులపై పూర్తయిన, కొనసాగుతున్న, భవిష్యత్తులో చేపట్టనున్న అన్ని ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంప్రసాద్ రెడ్డి, తన్నీరు వెంకటేశం డిమాండ్ చేశారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే గోదావరి-బనకచర్ల అనుసంధానం చేపట్టాలని కోరారు.

టెండర్లు లేకుండా కొనుగోళ్లు వద్దు

» దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో అవసరమైన వస్తువుల కొనుగోళ్లకు తప్పనిసరిగా టెండరు పద్ధతిని పాటించాలని, ఎవరి ఇష్టానికివారు కొనుగోళ్లు చేయవద్దని దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు అధికారులకు స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల ఈవోలు, అసిస్టెంట్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు ఇతర అధికారులతో కమిషనర్ గురువారం ఆన్‌లైన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారుల్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... పలు ఆలయాల్లో పూజా సామాగ్రి, ప్రసాదాల తయారీకి, అన్నదానాలు, ఇతర అవసరాలకు ఇష్టానుసారంగా వస్తువుల్ని కొనుగోలు చేసి బిల్లులు పెడుతున్నారని, ఇది సరైంది కాదన్నారు. కొన్ని ఆలయాల్లో భక్తులకు ప్రసాదాలు అందించడం లేదని తన దృష్టికి వచ్చిందని ఆలయాల్లో భక్తులకు తప్పనిసరిగా ప్రసాదం అందించేలా ఏర్పాట్లు చేయాలని ఈవోలను ఆదేశించారు.

జర్మన్ వర్సిటీలతో జేఎన్‌టీయూ ఒప్పందాలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో జేఎన్‌టీయూ మరో ముందడుగు వేసింది. ఇప్పటికే స్వీడన్, యూఎస్ దేశాలకు చెందిన పలు యూనివర్సిటీలతో ఎంవోయూలు కలిగిన జేఎన్‌టీయూ తాజాగా జర్మన్‌కు చెందిన రెండు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంది. ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉన్న కంప్యూటర్ సైన్స్ కోర్సులతో పాటు ఇంజనీరింగ్ కోర్ బ్రాంచ్‌లకు కూడా ప్రాధాన్యాన్ని కల్పించింది. జేఎన్‌టీయూలో జరిగిన కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కిషన్‌కుమార్ రెడ్డి సమక్షంలో వర్సిటీ రిజిస్ట్రార్, రాయిట్లింగన్, కాసెల్ వర్సిటీల ప్రతినిధులు ఎంవోయూల పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందాల ద్వారా అంతర్జాతీయ స్థాయిలో బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్‌లను ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నట్లు జేఎన్‌టీయూ వీసీ కిషన్‌కుమార్ రెడ్డి ప్రకటించారు.

అంగన్వాడీల్లో జూలై 1 నుంచి ఫేస్ రికగ్నిషన్

అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జూలై 1వ తేదీ నుంచి అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీకి లబ్ధిదారుల ఫేషియల్ రికగ్నిషన్ తప్పనిసరి చేస్తూ కేంద్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా పోషణ ట్రాకర్‌లో ఫేస్ రికగ్నిషన్ ఆధారిత సేవల అమలుకు కేంద్రం చర్యలు తీసుకుంది. ఈ నెల 30 నుంచి లబ్ధిదారుల ప్రొఫైల్‌లో ఫేస్ అథెంటికేషన్ ఫీచర్ అందుబాటులోకి రానున్నట్లు తెలిపింది. దీంతో ఇకపై పౌష్టికాహారం(టీహెచ్ఆర్) పంపిణీ సమయంలో ఎఫ్ఆర్ఎస్ (ఫోటో క్యాప్చరింగ్, ఈ-కేవైసీ) తప్పనిసరికానుంది. ఈమేరకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులకు కేంద్ర మహిళా,శిశు సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసింది. 3 నుంచి 6 ఏళ్ల చిన్నారులు ఎంతమంది అంగన్వాడీ కేంద్రాల్లో ఆహారం తీసుకుంటున్నారో నమోదు చేయాలని స్పష్టం చేసింది.

టీటీడీ చైర్మన్‌తో ఎమ్మెల్సీ కవిత భేటీ

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి హతిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి ఆమె గురువారం హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 30న హతిరామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతోపాటు నైవేద్యం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలని ఆమె కోరారు. దీనిపై త్వరలోనే పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని బీఆర్ నాయుడు హామీ ఇచ్చినట్టు కవిత తెలిపారు.

మెట్రో ఫేజ్-2 అనుమతులు ఇప్పించండి

కేంద్రంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు సిద్ధం

కేంద్ర మంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి

హైదరాబాద్ మెట్రో ఫేజ్ - 2కు సత్వరమే అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో గురువారం కేంద్ర మంత్రి ఖట్టర్‌తో ఆయన సమావేశమయ్యారు. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో 76.4 కిలోమీటర్ల పొడవైన మెట్రో ఫేజ్ 2 అవసరం ఎంతో ఉందని, రూ.24,269 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మెట్రో ఫేజ్ 2 సాకారమైతే నగరంలో రాకపోకల వేగం పెరగడంతోపాటు రహదారులపై రద్దీ తగ్గుతుందని చెప్పారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడుతుందన్నారు. పట్టణ వ్యవహారాల శాఖ సూచన మేరకు అవసరమైన సవరణలు చేసి డీపీఆర్ సమర్పించామని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో మెట్రో ఫేజ్ 2 ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకొని ఇతర శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.


కేంద్రమంత్రి ఖట్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి ఉత్తమ్, ఎంపీలు రఘువీర్, మల్లు రవి

బనకచర్లను అడ్డుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వరద, మిగులు జలాల ప్రస్తావనే లేదని వివరించారు. పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా కొత్తగా ప్రాజెక్టును కట్టాలనుకుంటే తొలుత ఆ నదీ యాజమాన్య బోర్డు, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని, కానీ, ఏపీ వీటన్నింటినీ ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏ నిబంధనలూ పాటించకుండా.. వరద జలాల ఆధారంగా ప్రాజెక్టు చేపడుతున్నామని చెప్పడం తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అనుమతులు లేకుండానే పోలవరం కింద ఎత్తిపోతల పథకాలు

సీడబ్ల్యూసీ పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఏపీ చేపట్టిందని కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి, ఉత్తమ్ వివరించారు. పోలవరం డిజైన్లను మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని, తాము అభ్యంతరాలు లేవనెత్తినా పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తోందని అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ ప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. గోదావరిలో వరద జలాలు ఉన్నాయని ఏపీ నిజంగా భావిస్తే.. పోలవరం - బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి - నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్ల తీసుకెళ్లే విషయమై చర్చకు తాము సిద్ధమని చెప్పారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదన్నారు. అన్ని వేదికల ద్వారా సామరస్యపూర్వకంగా సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కేంద్రం స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

1,500 టీఎంసీలకు అనుమతులు ఇవ్వండి

గోదావరి నదిలో 1000 టీఎంసీలు, కృష్ణా నదిలో 500 టీఎంసీలు.. మొత్తంగా 1,500 టీఎంసీల వినియోగానికి తెలంగాణకు కేంద్ర జల్‌శక్తి శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఫలితంగా, కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని, ఆ తర్వాత ఏపీ చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. "ఏపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియపై సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య అపోహలు, ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి" అని తెలిపారు. పాలమూరు - రంగారెడ్డి, సమ్మక్క - సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతోపాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని, గంగ, యమున నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి కూడా కేటాయించాలని కోరారు. కేంద్ర మంత్రితో సమావేశం తర్వాత మంత్రి ఉత్తమ్ ఆ వివరాలను మీడియాకు వివరించారు. "సీఆర్ పాటిల్‌తో సుమారు గంటసేపు సమావేశం జరిగింది. అన్ని ప్రాజెక్టుల విషయంలోనూ సానుకూలంగా స్పందించారు. బనకచర్ల డీపీఆర్ తమకు అందలేదని, దీనిపై త్వరలోనే అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని అన్నారు. అతి త్వరలో ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశం నిర్వహించి అన్ని విషయాలు చర్చిస్తామని హామీ ఇచ్చారు. అపెక్స్ కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టడం కుదరదు. కానీ.. ఏపీ చేపడుతోంది. ఇది రెండు రాష్ట్రాలకు మంచిది కాదు" అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. సమావేశంలో ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డితోపాటు రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.


కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్

తెలంగాణ రైజింగ్ విజన్ అద్భుతం

(మొదటిపేజీ తరువాయి)

పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయబోయే సూక్ష్మ ప్రణాళికను ఆయనకు వివరించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' ముఖ్యాంశాలను తెలిపారు. తమ ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది డిసెంబరు 9న ఈ విజన్ గురించి ప్రజలకు వెల్లడిస్తామన్నారు. 'ఫ్యూచర్ సిటీ', 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ', 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' వంటి ప్రాజెక్టులపై టోనీ బ్లెయిర్ ఆసక్తి చూపారు. ఇరు నేతలు గంటకు పైగా సమావేశమైన అనంతరం.. తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం, టీజీఐజీసీ ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా, తెలంగాణలో రైతులు, యువత, మహిళలు వంటి విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు టోనీ బ్లెయిర్‌కు సీఎం రేవంత్ వివరించారు. మానవాభివృద్ధి సూచికల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక, పెట్టుబడుల విభాగం సీఈవో జయేశ్ రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, టీజీఐజీసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

3 నెలల్లో ఎల్ఆర్ఎస్ రాయితీ 644 కోట్లు

» ప్రభుత్వానికి రూ.1990.94 కోట్ల ఆదాయం

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాల్లో ఇల్లు కట్టుకున్న వారికి లేఔట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) కింద గత మూడు నెలల్లో దరఖాస్తుదారులకు రూ.644.78 కోట్ల రాయితీ లభించగా, ప్రభుత్వానికి రూ. 1990.94 కోట్ల ఆదాయం లభించిందని పురపాలకశాఖ అధికారులు తెలిపారు. గత మార్చిలో అందుబాటులోకి తెచ్చిన ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి.. ఫీజు చెల్లింపులో 25% రాయితీనిచ్చింది. దీంతో మార్చిలో ప్రభుత్వానికి రూ.1402.02 కోట్ల ఆదాయం లభించగా, రూ.482.11 కోట్ల రాయితీ, ఏప్రిల్‌లో రూ.353.17 కోట్ల ఆదాయం, రూ.121.62 కోట్ల రాయితీ, గత నెలలో రూ.119.84 (తొలి 3 రోజుల్లో రూ.44.59 కోట్లు) కోట్ల ఆదాయం రాగా, రూ.40.99 కోట్ల (తొలి మూడు రోజుల్లో రూ.15.29 కోట్లు) రాయితీ కల్పించింది.

ఎన్కేపల్లిలో 'మహా' గోశాల!

వంద ఎకరాల్లో ఏర్పాటుకు ప్రణాళిక

వ్యతిరేకిస్తూ కోర్టుకెళ్లిన కొందరు స్థానికులు

వివాదాల పరిష్కారానికి అధికారుల చర్యలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో వంద ఎకరాల్లో 'మహా' గోశాలను ఏర్పాటు చేసేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపడుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో భాస్కర్ వైద్య కళాశాల వెనుక వంద ఎకరాల వరకు ఉన్న ఈ ప్రభుత్వ భూముల్లో గోశాల ఏర్పాటు చేయడానికి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ భూములను స్వాధీనం చేసుకుని చుట్టూ కంచె ఏర్పాటుకు హెచ్ఎండీఏ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే ఆ భూములకు హద్దులు నిర్ణయిస్తుండగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కొందరు కోర్టుకు వెళ్లారు. ఈ వివాదాల పరిష్కారంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ఎన్కేపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 180లో 99.14 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. కొన్నేళ్లుగా ఖాళీగా ఉండడంతో సుమారు 40 కుటుంబాలు వ్యవసాయం చేసుకుంటున్నాయి. వారు తాజాగా హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారుల సర్వేను అడ్డుకున్నారు. తమకు హక్కులు ఉన్నాయంటూ 26 మంది వరకు కోర్టుకెక్కారు. సేత్వారి నుంచి ఇప్పటివరకు పూర్తిగా ప్రభుత్వ భూమి కావడం, ఏనాడూ ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అసైన్ చేయకపోవడంతో కోర్టు సైతం రెవెన్యూ, హెచ్ఎండీఏ అధికారుల సర్వేపై ఎలాంటి స్టే విధించలేదని తెలిసింది. తగిన వాదన వినిపించేలా చర్యలు తీసుకుంటున్నామని, త్వరలో వివాదం పరిష్కారమవుతుందని అధికారులు ధీమా వ్యక్తం చేశారు. కాగా, వంద ఎకరాల్లో గోశాల ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయే 40 కుటుంబాలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిసింది. గోశాల ఏర్పాటు చేసే భూముల్లో చిన్న లేఅవుట్ ఏర్పాటు చేసి 200 చదరపు గజాల చొప్పున స్థలం కేటాయించేందుకు నిర్ణయించారు. దాంతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నారు. కుటుంబానికి ఒకరికి గోశాలలో ఔట్ సోర్సింగ్ కింద ఉద్యోగం ఇవ్వాలని ఉన్నతస్థాయిలో నిర్ణయించినట్లు తెలిసింది. త్వరలో హెచ్ఎండీఏ కమిషనర్, జిల్లా కలెక్టర్లు ఆయా కుటుంబాలతో చర్చించి ఈ అంశాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

సీఎం రేవంత్ దాచలేరిక కాంగ్రెస్‌లో గందరగోళం

» ఎక్స్ వేదికగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'ఖటాఖట్' నుంచి 'ఖాళీ ఖజానా' వరకూ.. అధికార కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న గందరగోళాన్ని సీఎం రేవంత్ ఇక దాచి పెట్టలేరని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. బోగస్ వాగ్దానాలు, ఖజానా ఖాళీ చేయడం - కాంగ్రెస్ పాలన నమూనాకు తెలంగాణ అద్భుత ఉదాహరణ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మోస పూరిత వాగ్దానాల వలయంలో తెలంగాణ ప్రజలు చిక్కుకున్నారని 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించారు.

శివారు మండలాల రైతులకు 'భరోసా' ఏదీ?

హైదరాబాద్ శివార్లలోని 18 మండలాల్లో నిలిపివేత.. సరైన కారణం చెప్పని అధికారులు

» మంత్రి తుమ్మలను కలిసిన కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు

» పరిశీలించి, న్యాయం చేస్తామన్న మంత్రి

రంగారెడ్డి జిల్లా/ఇబ్రహీంపట్నం/పటాన్‌చెరు/జిన్నారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివార్లలోని మండలాల్లో రైతు భరోసా పంపిణీపై గందరగోళ పరిస్థితి నెలకొంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఈ 18 మండలాల్లో ఒక్క రైతు ఖాతాలో కూడా నిధులు జమ కాలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసా నిధులపై అధికారులెవరూ సరైన సమాధానం ఇవ్వలేకపోవడం మరింత గందరగోళానికి దారితీస్తోంది. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్ మెట్, హయత్‌నగర్, మహేశ్వరం, శంషాబాద్, బాలాపూర్, రాజేంద్రనగర్, గండిపేట్, శేరిలింగంపల్లి మండలాల్లో రైతు భరోసా అందలేదు. శేరిలింగంపల్లి, బాలాపూర్, కుత్బుల్లాపూర్ మండలాల్లో తక్కువ వ్యవసాయ భూములు ఉండగా.. మిగతా మండలాల్లో ఎక్కువగానే ఉన్నాయి. మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, దుండిగల్, కుత్బుల్లాపూర్, అల్వాల్, బాచుపల్లి, మేడిపల్లి మండలాల్లో రైతు భరోసా నిలిచిపోయింది. వానాకాలం సీజన్‌లో ఎకరానికి రూ.6 వేల చొప్పున పంటసాయం అందిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తోంది. కానీ, శివారు మండలాల రైతులకు ఇప్పటికీ అందకపోవడంతో స్థానిక నేతలను ఆశ్రయిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలోని 9 మండలాల్లో 48,184 ఎకరాల సాగు భూములకు గాను 36,220 మంది రైతులకు భరోసా నిధులు అందాల్సి ఉంది. మేడ్చల్ జిల్లాలో దాదాపు 45,103 ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్న 40,443 మందికి దాదాపు రూ.24 కోట్ల నిధులు అందాల్సి ఉందని చెబుతున్నారు. శివార్లలో 'రైతు భరోసా' నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. నగర శివార్లలో వ్యవసాయ భూములన్నీ వ్యవసాయేతర భూములుగా మారుతున్నాయి. వేలాదిగా వెంచర్లు, కాలనీలు వస్తున్నాయి. ఈ క్రమంలో రైతు పెట్టుబడి సాయం పెద్దఎత్తున అన్యాక్రాంతమవుతున్నట్లు కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 76 వేల ఎకరాలను రైతుభరోసా ఇచ్చేందుకు అర్హత లేనివిగా తేల్చారు. ఈ మేరకు అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగిస్తున్నారు. ఈ ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో శివారు మండలాల్లో రైతు భరోసా తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిసింది. కానీ, అధికారులెవరూ ఈ విషయమై నోరువిప్పడం లేదు.


మంత్రి తుమ్మలకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ఎమ్మెల్యే సబిత, తదితరులు

మంత్రి తుమ్మలను కలిసిన నేతలు

శివారు మండలాల్లో రైతు భరోసా నిలిపివేయడంపై ప్రతిపక్షాలు ఆందోళన బాట పట్టాయి. మరోవైపు ఈ వ్యవహారం క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నేతలకు కూడా తలనొప్పిగా మారింది. రైతు భరోసా నిలిపివేయడంపై మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గురువారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. ప్రభుత్వం కారణాలు చెప్పకుండా శివార్లలోని రైతులకు పెట్టుబడి సాయాన్ని నిలిపివేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి రెండ్రోజుల్లో స్పష్టత ఇస్తామని మంత్రి వారికి చెప్పారు. మేడ్చల్ జిల్లాలోని ఆయా మండలాల రైతులు కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. రైతు భరోసా నిలిపివేయడం పట్ల బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కూడా మంత్రి తుమ్మలను కలిసి చర్చించారు. రైతు భరోసాపై ఆందోళన చెందవద్దని చెప్పారు.

రైతు భరోసాకు 'ఔటర్ రింగ్ రోడ్డు' ఎఫెక్ట్

పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం, పటాన్‌చెరు, అమీన్‌పూర్, రామచంద్రాపురం మండలాల రైతులకు భరోసా నిధులు జమకాలేదు. గుమ్మడిదల రైతులకు మాత్రం అందాయి. నాలుగు మండలాలు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్నందున రైతు భరోసా నిధులు జమకాలేదని తెలుస్తోంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ మంత్రులు తుమ్మల, దామోదర దృష్టికి తీసుకెళ్లారు. పటాన్‌చెరు నియోజకవర్గ రైతులకు రైతు భరోసా అందజేయాలని మంత్రి తుమ్మల కలెక్టర్‌ను ఆదేశించారు.

గోదావరిపై ప్రాజెక్టులు కట్టి నీళ్లు తీసుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు చేశారు. "మనం మనం తిట్టుకుంటే దాన్ని రాజకీయం చేయాలని చూసేవాళ్లు చాలామంది ఉన్నారు. గోదావరిలో చాలా నీళ్లు ఉన్నాయి. ఎవరి ఓపికను బట్టి వారు వాడుకోవచ్చు. 3000 టీఎంసీల నీరు ఏటా సముద్రంలో కలుస్తోంది. తెలంగాణ ఎంత వాడుకున్నా 100 టీఎంసీలు వాడుకుంటుంది. మనం ఎంత వాడుకున్నా మరో 100 టీఎంసీలు వాడుకోగలం. దీనిపై రాద్ధాంతం ఎందుకు?" అని ప్రశ్నించారు. గోదావరి నీటిని తెలంగాణ, ఏపీ రెండూ ఉపయోగించుకుంటున్నాయని చెప్పారు. "పైనుండే వారు నీటిని వాడుకుంటే నష్టమా? కింద ఉండేవారు నీటిని వాడుకుంటే నష్టమా!? మీరు నీరు వాడుకోకపోతేనే కదా ఆ నీరు కిందకు వచ్చి సముద్రంలో కలిసేది. దాన్నే మేం వాడుకుంటామని చెబుతున్నాం. దీనివల్ల ఎవరికీ నష్టం లేదు" అని స్పష్టం చేశారు. పోలవరం తప్ప మిగతావి అనుమతి రాని ప్రాజెక్టులేనని, విభజన చట్టంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని గుర్తు చేశారు. గోదావరి ప్రవాహంలో చిట్టచివరి రాష్ట్రంగా.. వచ్చిన నీటిని మరో బేసిన్‌కు తరలిస్తున్నామని తెలిపారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రాజెక్టులు నేనే మొదలు పెట్టాను. దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టులు నేనే మొదలు పెట్టాను. ఎల్లంపల్లి ప్రాజెక్టుపై వివాదం వస్తే అసెంబ్లీలో పోరాడాం. తెలంగాణ కానీ ఆంధ్రా కానీ అంతా తెలుగువారే. మనకు మనం ఎందుకు సమస్యలు సృష్టించుకుంటున్నాం? తెలుగు రాష్ట్రాలు వాడుకునే నీటిపై వివాదాలు ఎందుకు? ఇరు పక్షాలకు ఆమోదయోగ్యంగా ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సమస్యను పరిష్కరించుకుందాం" అని స్పష్టం చేశారు. సముద్రంలో కలిసే నీటి వాడకంపై చట్టబద్ధత కావాలంటే కేంద్రంతో చర్చిద్దామని అన్నారు. సముద్రంలో కలిసే నీటి వాడకంపై సమస్యలు సృష్టించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. రెండు రాష్ట్రాలూ నంబర్ వన్‌గా ఉండాలన్నదే తన ఆశయమని, అందరం కలిసి తెలుగు జాతిని ప్రపంచమే హద్దుగా అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. "హైదరాబాద్‌లో హైటెక్ సిటీ కట్టినా.. ఇక్కడ అమరావతి కడుతున్నా నా కోసం కడుతున్నానా!? భవిష్యత్తు తరాల కోసం కడుతున్నాం. తెలంగాణ ఎకో సిస్టమ్ చాలా మంచి సిస్టమ్. దాన్ని ఇక్కడకు తీసుకు రావాలంటే చాలా కష్టపడాలి" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. గతంలో కృష్ణా బ్యారేజీపై ఇరు రాష్ట్రాల సిబ్బంది గొడవ పడ్డారని, గవర్నర్ వద్ద కూర్చుని సమస్య పరిష్కరించుకున్నామని గుర్తు చేశారు. "కృష్ణాలో తక్కువ ఉన్న నీటిపై గొడవ పడితే లాభం లేదు. ప్రాజెక్టుల వారీగా చేసిన కేటాయింపులను అలాగే కొనసాగనిద్దాం. కొత్త ట్రిబ్యునల్ తీర్పు వచ్చిన తర్వాత కేటాయింపుల మేరకు ముందుకు వెళదాం" అని ప్రతిపాదించారు.

శంషాబాద్‌లో స్పైస్‌జెట్ విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

» తిరుపతి వెళ్తుండగా సాంకేతిక లోపం

» గుర్తించిన సిబ్బంది.. తప్పిన ముప్పు

శంషాబాద్ రూరల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న స్పైస్‌జెట్ విమానం (ఎస్‌జీ-2696)లో సాంకేతిక లోపం తలెత్తడంతో విమానాశ్రయంలో ఎమర్జెన్సీ ల్యాండింగ్ అయింది. జీఎంఆర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 80 మంది ప్రయాణికులతో గురవారం ఉదయం 6.20 గంటలకు తిరుపతి బయలుదేరిన కొద్దిసేపటికే విమానం వెనక భాగంలోని బ్యాగులున్న ప్రదేశంలో సాంకేతిక లోపాన్ని గుర్తించిన గుర్తించిన పైలెట్లు వెంటనే ఏటీసీకి సమాచారం అందించారు. అధికారుల అనుమతితో తిరిగి విమానాన్ని సురక్షితంగా శంషాబాద్ విమానాశ్రయంలో ఉదయం 7.10 గంటలకు ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో టేకాఫ్, ల్యాండింగ్ కావాల్సిన కొన్ని విమాన సర్వీసులను నిలిపివేశారు. స్పైస్‌జెట్ విమానం ల్యాండింగ్ అనంతరం ఇతర విమానాల రాకపోకలను సాగించారు. అయితే, స్పైస్‌జెట్ విమాన సర్వీసును రద్దు చేయడంతో కొందరు ప్రయాణికులు తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకోగా మరి కొంత మంది ఇతర విమానాల ద్వారా తిరుపతికి వెళ్లినట్లు అధికారులు తెలిపారు. విమానాశ్రయంలో దింపివేసిన సిబ్బంది.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకోవడంపై స్పైస్‌జెట్ విమాన ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

తిరుమలలో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

సేవలు ప్రారంభించిన టీటీడీ అదనపు ఈవో

తిరుమల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులు ఆర్టీసీ బస్సుల్లోనూ ఉచితంగా ప్రయాణించొచ్చు. ఈ ఉచిత సేవలను గురువారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్సుల ఉచిత ట్రిప్పులను తిరుమలలోని అశ్విని ఆస్పత్రి సర్కిల్ వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభించారు. తిరుమలలో ప్రైవేట్ వాహనాలు భక్తుల నుంచి వసూలు చేస్తున్న అధిక ఛార్జీలను అరికట్టడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించేందుకు ఉచిత సర్వీసు అందించాలని ఆర్టీసీని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ అధికారులు త్వరితగతిన బస్సులను ఉచితంగా తిప్పేందుకు ముందుకు వచ్చారని, వారికి ధన్యవాదాలు తెలిపారు. తిరుమలలో శ్రీవారి ధర్మరథాలు(ఉచిత బస్సులు) తిరిగే మార్గంలో ఈ బస్సులు కూడా తిరుగుతూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి భక్తులను ఉచితంగా చేరుస్తాయని వెంకయ్య చౌదరి చెప్పారు. ప్రతి రెండు నిమిషాలకు బస్సులు అందుబాటులోకి రావడంతో ప్రజారవాణా వ్యవస్థ బలోపేతం కానుందని అన్నారు. తిరుమల నుంచి తిరుపతికి వెళ్లే వారికి మాత్రమే ఛార్జీలు ఉంటాయని, మిగిలిన వారు ఉచితంగా ప్రయాణించవచ్చని అదనపు ఈవో చెప్పారు.

ముక్కిపోతున్న దొడ్డు బియ్యం

» టెండర్ల నిర్వహణపై దృష్టిపెట్టని సర్కార్



హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. ఈ నెలలో అయితే మూడు నెలల కోటా(జూన్, జూలై, ఆగస్టు) బియ్యాన్ని అందిస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నా గోదాములు, చౌకడిపోల్లో మిగిలిపోయిన దొడ్డుబియ్యంపై ప్రభుత్వం దృష్టిపెట్టలేదు. రాష్ట్రంలో పేదలకు ఇక సన్నబియ్యమే పంపిణీ చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో.. దొడ్డు బియ్యం అవసరం ఇకపై ఉండకపోవచ్చు. ఈ నేపథ్యంలో పాత నిల్వలను రికవరీ చేయాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖపై ఉంది. సుమారు మూడు నెలలుగా ఈ అంశాన్ని గాలికొదిలేయడంతో గోదాములు, రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం ముక్కిపోతున్నాయి.

ఎలుకలు, లక్కపురుగుల పాలు..

రాష్ట్ర ప్రభుత్వం మార్చి నెల వరకు పేదలకు దొడ్డుబియ్యమే పంపిణీ చేసింది. ఆ తర్వాత నుంచే సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే రాష్ట్రంలో ఉన్న గోదాముల్లో 85 వేల టన్నులు, రేషన్ దుకాణాల్లో 15వేల టన్నులు.. మొత్తంగా లక్ష టన్నుల దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నాయి. భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ)లెక్క ప్రకారం కిలోకు రూ.42 చొప్పున టన్ను బియ్యం విలువ రూ.42వేలు. అంటే లక్ష టన్నుల విలువ అక్షరాలా రూ.420 కోట్లు. ఇంత విలువైన బియ్యం విషయంలో ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో గోదాములు, రేషన్ షాపుల్లో బియ్యం నిల్వ చేసి పెట్టారు. వీటన్నింటిని ఒక చోటుకు సమీకరించటంగానీ, ఎక్కడికక్కడ టెండరు పద్ధతిలో విక్రయించటంగానీ చేయడంలేదు. ఈ బియ్యాన్ని విక్రయించటం తప్ప వేరే మార్గం లేదు. కానీ, ఈ విషయమై పౌర సరఫరాల శాఖ నుంచి సీఎంవోకు ఎలాంటి ప్రతిపాదనలు వెళ్లలేదని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడకపోవటంతో డీలర్లు, అధికారులు వాటిని వదిలేశారు. దీంతో వాటిని ఎలుకలు, పందికొక్కులు, లక్కపురుగులు తింటున్నాయి. కొన్ని చోట్ల ఇరుకు గదులు ఉండటంతో.. తాజాగా పంపిణీ చేస్తున్న సన్న బియ్యం, పాత దొడ్డు బియ్యం కలిపి ఒకేచోట వేయాల్సి వస్తోంది. వానాకాలం ప్రారంభమైంది. కొన్ని చోట్ల గదుల్లోకి నీరు చేరి, బియ్యం పాడయ్యే ప్రమాదం కూడా ఉంది. దీంతో రేషన్ డీలర్లు కూడా ఆందోళన చెందుతున్నారు. బియ్యం పాడైతే నష్టాన్ని తామెక్కడ భరించాల్సి వస్తుందోననే ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఏదో ఒక నిర్ణయం తీసుకొని దొడ్డు బియ్యాన్ని తమ వద్ద నుంచి ఖాళీ చేయాలని కోరుతున్నారు.

టెండర్లు నిర్వహించడమే ప్రత్యామ్నాయం

దొడ్డు బియ్యం విక్రయానికి టెండర్లు నిర్వహించటం తప్ప వేరే ప్రత్యామ్నాయం కనిపించటం లేదు. రేషన్ షాపుల్లో ఉన్న దొడ్డు బియ్యాన్ని ఆయా జిల్లాల్లోని గోదాములకు తరలించాలని, గోదాముల్లో ఉన్న నిల్వల వారీగా టెండర్లు పిలవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లక్ష టన్నుల బియ్యం విలువ రూ.420 కోట్లు కాగా, గ్లోబల్ టెండర్లు నిర్వహిస్తే ట్రేడర్లు కొనుగోలు చేసే అవకాశాలున్నాయి. కాగా, తెలంగాణ నుంచి విదేశాలకు దొడ్డు బియ్యం ఎగుమతులు కూడా ఎక్కువగానే చేస్తుంటారు. ఈ లక్ష టన్నులను టెండర్ల ద్వారా విక్రయిస్తే డిమాండ్ ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సిట్‌కు సహకరించని ప్రభాకర్‌రావు!

» 9 గంటలు ప్రశ్నించినా సరైన సమాధానాలు ఇవ్వని వైనం

» ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్న సిట్!

» ఉపశమనాన్ని రద్దు చేయాలని కోరనున్న అధికారులు

హైదరాబాద్/తాండూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో భాగంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఐదోసారి సిట్ ముందు హాజరయ్యారు. అధికారులు గురువారం ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 వరకు సుమారు 9గంటల పాటు ఆయనను ప్రశ్నించారు. మళ్లీ శుక్రవారం విచారణకు రావాలని ఆదేశించినట్లు సమాచారం. సుదీర్ఘంగా విచారించినా ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారులకు పెద్దగా సహకరించలేదని తెలిసింది. దీనితో ప్రభాకర్‌రావు విచారణకు సంబంధించిన వివరాలు, ఆయన దర్యాప్తునకు సహకరించని తీరును సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాలని సిట్ భావిస్తున్నట్లు సమాచారం. ఆగస్టు 5వ తేదీ వరకు ప్రభాకర్‌రావును అరెస్టు చేయవద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉపశమనాన్ని రద్దు చేయాలని కోరనున్నట్లు తెలిసింది. ఇక అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, మావోయిస్టులకు సంబంధించినవిగా పేర్కొంటూ రాజకీయ నాయకుల ఫోన్లను ట్యాప్ చేశారని సిట్ ఇప్పటికే గుర్తించింది. అందులోనూ ట్యాపింగ్‌కు అనుమతి కోరుతూ రివ్యూ కమిటీ దృష్టికి వెళ్లిన ఫోన్ నంబర్లు కొన్ని మాత్రమేనని... ఎస్ఐబీలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆపరేషన్ సెల్ వేల సంఖ్యలో ఫోన్లను ట్యాప్ చేసిందని తేల్చారు. ఇలా మావోయిస్టుల పేరిట రాజకీయ నాయకుల నంబర్లను ట్యాప్ చేసిన అంశంపై ప్రభాకర్‌రావును గురువారం పలుమార్లు ప్రశ్నించినా.. తగిన సమాధానం రాలేదని తెలిసింది. మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో వాంగ్మూలాల నమోదు కోసం వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నేతలు డాక్టర్ సంపత్ కుమార్, ఆర్బీఎల్ శ్రీనివాస్‌రెడ్డి, మురళి గౌడ్, వడ్డె శ్రీనివాస్‌లకు సిట్ నుంచి పిలుపు వచ్చింది. ఇదే మండలానికి చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి కూడా పిలుపు వచ్చినట్లు సమాచారం. వీరిలో ధారాసింగ్ 23వ తేదీన సిట్ ముందు హాజరుకానున్నట్లు తెలిపారు. మిగతా నలుగురిని ఎప్పుడు రావాలన్నది ఇంకా చెప్పలేదని వెల్లడించారు.

పాడు బుద్ధి.. పోయే కాలం

» చిన్నారుల నగ్న వీడియోలు చూస్తున్న 15 మంది అరెస్టు

» నిందితులంతా విద్యాధికులే.. వారిలో ఐఐటీ పట్టభద్రుడు కూడా..

» ఇలాంటి వారిని వదలం: షికా గోయల్



హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వారంతా ఉన్నత చదువులు చదివిన వారు.. ఒకరైతే ఐఐటీ పట్టభద్రుడు.. అయినా, వారికి కనీస సంస్కారం లేకపోయింది. తమ స్థాయిని మరిచి, నీచంగా వ్యవహరించారు! ఆన్‌లైన్‌లో చిన్నారుల నగ్న వీడియోలు చూస్తున్నారు! అంతేకాదు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని, ఇతరులకు పంపుతున్నారు! ఇలాంటి అకృత్యాలకు పాల్పడుతున్న 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వీరిని అరెస్టు చేసినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ షికా గోయల్ తెలిపారు. గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ కేసు వివరాలను ఆమె మీడియాకు వెల్లడించారు. నిందితులంతా తరచూ ఈ చైల్డ్ పోర్న్ వీడియోలు చూస్తూ, ఇతరులకు పంపిస్తున్నారన్న విషయం తమ దృష్టికి రాగానే రాష్ట్రవ్యాప్తంగా 34 కేసులు నమోదు చేసి రంగంలో దిగామని తెలిపారు. బుధవారం తెలంగాణలోని వివిధ జిల్లాల పోలీసుల సహకారంతో ఏకకాలంలో దాడులు నిర్వహించామని ఆమె వివరించారు. హైదరాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లా, కరీంనగర్, వరంగల్, జగిత్యాల, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. చిన్నపిల్లల అశ్లీల చిత్రాలు, రేప్, సామూహిక అత్యాచారం లాంటి ఫిర్యాదులను సమన్వయం చేయడానికి సైబర్ సెక్యూరిటీ బ్యూరో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుందని ఆమె తెలిపారు. ఈ క్రమంలో బ్యూరోకి అనుబంధంగా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ (సీపీయూ) ఏర్పాటు చేశామన్నారు. ఈ సీపీయూ సిబ్బంది ఆన్‌లైన్‌లో చిన్నారుల అశ్లీల చిత్రాలను తరచూ చూస్తున్న వారిపై నిఘా పెడతారని, కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకుంటూ సమాచారాన్ని సేకరించి విశ్లేషించిన తర్వాత రంగంలోకి దిగుతారని, ఈ ఏడాది ఇప్పటి వరకు 294 కేసులు నమోదు చేసి 110 మందిని అరెస్టు చేశామని వివరించారు. తాజాగా అరెస్టు చేసిన 15 మందిపై వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో 34 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయన్నారు. 15 మందికి 57 సైబర్ టిప్‌లైన్ ఫిర్యాదులతో సంబంధం ఉన్నట్లుగా గుర్తించామని తెలిపారు. నిందితులంతా 19 నుంచి 50 ఏళ్లలోపు వారని, వీరిలో చాలామంది విద్యాధికులని చెప్పారు. వీరిలో ఐఐటీ పట్టభద్రుడు కూడా ఉన్నాడని షికా గోయల్ తెలిపారు. వీరు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేస్తున్న, చూస్తున్న వీడియోల్లో 6-14 ఏళ్ల మధ్య ఆడపిల్లల దృశ్యాలు ఉన్నాయని, ఇవన్నీ విదేశాలకు సంబంధించినవిగా గుర్తించామని చెప్పారు. ఆన్‌లైన్‌లో చిన్నారుల అశ్లీల చిత్రాలను అప్‌లోడ్ చేస్తున్న 220 వెబ్‌సైట్లను బ్లాక్ చేశామన్నారు. ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్న్ గురించి వెతకడం, ఆ వీడియోలను ఇతరులకు పంపించడం నేరమని తెలిపారు. నిందితుల్లో చాలా మంది డార్క్ వెబ్ ద్వారా వీటిని డౌన్‌లోడ్ చేసుకుంటున్నట్లు గుర్తించామన్నారు. ఇలాంటి హేయమైన నేరాలకు పాల్పడేవారికి శిక్షలు తప్పవని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలని, విద్యాధికులైన యువత మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అరెస్టయిన వారిలో కొందరు పదికి పైగా నేరాల్లో బాధ్యులని, వారిని కస్టడీకి కోరుతూ పిటిషన్ దాఖలు చేస్తామని చెప్పారు.

రప్పారప్పా.. మంచిదేకదా!

(మొదటిపేజీ తరువాయి)

జగన్ తనదైన శైలిలో స్పందించారు. 'అత్యుత్సాహంతోనే, ఆవేశంతోనే అలాంటి ప్లకార్డులు ప్రదర్శించి ఉండొచ్చు. ఈ ధోరణి సరికాదు' అని జగన్ అంటారేమో అని భావించిన వాళ్లకు షాక్ ఇచ్చారు. అదే మాటను పదేపదే చెప్పించుకుని, ఆసక్తిగా విని, ఆనందంగా ఆస్వాదిస్తూ, 'మంచిదే'గా అని ముక్తాయించారు.

మళ్లీ చెప్పమ్మా... మళ్లీ!

'రప్పా.. రప్పా నరికేస్తాం' అని ప్లకార్డులు పెట్టారంటూ ఒక మహిళా జర్నలిస్టు ప్రస్తావించినపుడు... 'ఆ డైలాగ్ మళ్లీ చెప్పమ్మా! ఆ పూర్తి డైలాగ్ చెప్పు!' అని జగన్ రెట్టించారు. ఇంతలో మరో మీడియా ప్రతినిధి కల్పించుకుని "గంగమ్మజాతరలో పొట్టేలు తల" అని అంటుండగానే... "ఆ మళ్లా చెప్పు. గట్టిగా చెప్పు. నాకు వినపడటం లేదు. మైకు తీసుకుని చెప్పు బాగా అర్థమవుతుంది" అని మరీ చెప్పించుకున్నారు. అదే మాట మళ్లీ మళ్లీ విని... "గంగమ్మ జాతరలో పొట్టేళ్ల తలకాయ కోసినట్లు రప్పారప్పా నరికేస్తాం"అని పోస్టరు ఉందా అని జగన్ అమాయకంగా ప్రశ్నించారు. "అదేదో సినిమా డైలాగ్ అనుకుంటా" అని ఆసక్తిగా అడిగారు. 'పుష్ప-2' అని మీడియా ప్రతినిధి చెప్పడంతో.. "పుష్ప సినిమా డైలాగులా అవి! నువ్వే చెబుతున్నావుకదయ్యా. పుష్ప సినిమా డైలాగులు పెట్టినా తప్పేనా? పుష్ప ఫొటోలు పెట్టినా తప్పేనా?గడ్డం ఇట్లున్నా తప్పేనా.. గడ్డం అట్లున్నా తప్పేనా? ఏంది సామీ ఇది.. ఏ ప్రపంచంలో ఉన్నాం సామీ?"అని నాటకీయత ప్రదర్శించారు.

అయితే మంచిదేకదా...

పోస్టర్ పట్టుకున్న కుర్రాడు టీడీపీ కార్యకర్త అని, టీడీపీ సభ్యత్వం కూడా ఉందని ఒక పాత్రికేయుడు జగన్‌తో అన్నారు. ఆ వెంటనే జగన్ ఆశ్చర్యం వ్యక్తంచేస్తూ... "ఓ టీడీపీ సభ్యుడుకూడానా! మెంబర్‌షిప్ కూడా ఉందా?" అని అన్నారు. జగన్ మీడియా జర్నలిస్టు సెల్‌ఫోన్‌ను ఆయన చేతికి అందించి.. సెల్‌ఫోన్‌లో ఆ వ్యక్తి ఫొటోను చూపించారు. ఆ వెంటనే "ఓహోహో బాగా చూడండబ్బా! సభ్యత్వం కూడా ఉందంట! ఏమైనా (పార్టీ) మారినా డబ్బా.. మన దగ్గరికి వచ్చాడు" అని జగన్ వ్యాఖ్యానించారు. "టీడీపీ కార్యకర్త అయి కూడా చంద్రబాబు మీద కోపంతో మారినాడని సంతోషపడదాం! మారి టీడీపీనే రప్పా రప్పా కోసేస్తానంటున్నాడు అని కూడా సంతోషపడదాం. నిజంగానే బాధుంటుందేమో కదా వాళ్లకు కూడా! ఏమన్నాడు.. ఏ జాతరలో.. గంగమ్మ జాతరలో పొట్టేళ్ల తలలు నరికినట్లుగా రప్పా రప్పా అన్నాడు. టీడీపీ సింపథైజర్ కూడా వైసీపీలో చేరి టీడీపీవాళ్లనే నరికేస్తామని అంటే మంచిదేకదా" అని అన్నారు.

మరి వీటిమాటేమిటి?

రప్పారప్పా.. అనేది పుష్ప సినిమా డైలాగ్, అది చెప్పినా తప్పేనా అని జగన్ ప్రశ్నిస్తున్నారు. మరి.. జగన్ పర్యటనల్లో 'ఎవడైనా రానీ తొక్కి పడేస్తాం! అన్న వస్తాడు, అంతు చూస్తాడు. నాకొడకల్లారా'... వంటి ప్లకార్డులూ ప్రదర్శించారు. జగన్ వాటినెలాసమర్థిస్తారో? ఏం చెప్పాలని మనసులో అనుకున్నారో కానీ.. బయటికి మాత్రం 'నెక్స్ట్ టీడీపీ ప్రభుత్వంలో' అనేశారు.

ప్లకార్డులు ప్రదర్శించిన వ్యక్తి అరెస్టు

జగన్ పర్యటనలో వివాదాస్పద ప్లకార్డులు ప్రదర్శించిన పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని వందనాదేవి సత్తెనపల్లి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ ప్లకార్డు ప్రదర్శించింది క్రోసూరు మండలం 88-తాళ్లూరుకు చెందిన వైసీపీ కార్యకర్త రవితేజగా గుర్తించారు. అతడిని అరెస్టు చేసి నకరికల్లు పోలీసు స్టేషన్‌లో విచారణ జరుపుతున్నారు.

షర్మిల ఫోన్ ట్యాప్ చేశారేమో!

అయినా నాకెలా తెలుస్తుంది: జగన్

తెలంగాణలో వైఎస్ షర్మిల ఫోన్ ట్యాప్ చేశారన్న వార్తలపై మాజీ సీఎం వైఎస్ జగన్ స్పందించారు. గురువారం మీడియా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించగా.. 'ఫోన్ ట్యాపింగ్ నేను చేశానా? నా ప్రభుత్వ హయాంలో జరిగిందా? ఎవరు చేశారో చెప్పు స్వామీ.. నాకు అర్థం కాలేదు' అని జగన్ ప్రశ్నించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్ జరిగిందంటున్నారని వారు చెప్పగా.. 'తెలంగాణలో అప్పుడు షర్మిల రాజకీయంగా క్రియాశీలంగా ఉన్నందున ట్యాపింగ్ చేశారేమో' అని బదులిచ్చారు. అంతలోనే పొరుగు రాష్ట్రం సంగతి తనకెలా తెలుస్తుందని వ్యాఖ్యానించారు.

కక్ష లేదు.. శిక్ష తప్పదు!


» జగన్‌ను జైలుకు పంపాలనుకుంటే బాబుకు 2 నిమిషాల పని: లోకేశ్



న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కూటమి ప్రభుత్వానికి ఎవరిపైనా కక్ష సాధించాలనే ఉద్దేశం లేదని ఏపీ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. సాక్ష్యాధారాలు లభిస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని.. తప్పు చేసి ఉంటే జగన్ అయినా.. ఎవరైనా జైలుకు వెళ్తారని తేల్చిచెప్పారు. తమ ప్రభుత్వంలో అంతిమ నిర్ణయం చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. 'కక్ష సాధించాలంటే జగన్‌ను జైలుకు పంపడం చంద్రబాబుకు రెండు నిమిషాల పని. ఎవరిపైనా కక్ష సాధించే ఉద్దేశం తనకు లేదని ఆయనే చెప్పారు'అని గుర్తుచేశారు. జగన్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి తమకు ఎవరి అనుమతీ అవసరం లేదన్నారు. తమ లీగల్ టీమ్ బలంగా ఉన్నదని, ఒకట్రెండు సందర్భాల్లో తప్ప నేరం చేసినవారెవరూ బెయిల్ మీద బయటకు రావడం లేదని గుర్తు చేశారు. 'జగన్మోహన్‌రెడ్డిని జైల్లో పెడతామని మేమేమైనా వాగ్దానం చేశామా? మేనిఫెస్టోలో పెట్టామా? జగన్ చేసిన నేరాలను మేం విస్మరించలేదు. అంత మాత్రాన ఆయన చుట్టూ తిరగాల్సిన పని లేదు. ప్రభుత్వానికి వేరే ప్రాధాన్యాలు లేవా' అని ప్రశ్నించారు. కేసీఆర్ తమ ఫోన్లు ట్యాప్ చేయించారన్న వార్తలపై స్పందిస్తూ.. దానిపై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. అయినా ట్యాప్ చేయించడానికి తమకేమి రహస్యాలుంటాయని వ్యాఖ్యానించారు.

జగన్ తీరుతో శాంతి భద్రతల సమస్య

» ఈ పోకడలు ప్రమాదకరం: చంద్రబాబు



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి):"జగన్ పరామర్శల పేరుతో రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తున్నారు. ఇష్టానుసారంగా భయోత్పాతం సృష్టిస్తామంటే కుదరదు. అలాంటి వారి పట్ల చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఒకప్పుడు నేరగాళ్లను కలవాలంటే నేతలు భయపడేవాళ్లు. ఇప్పుడు వారితోనే కలిసి రాజకీయం చేస్తున్నారు" అని ఏపీ సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. చంపేయండి.. పొడిచేయండి.. నరికేయండి.. రప్పారప్పా నరికేస్తాం.. వార్ డిక్లేర్డ్.. అంటూ ప్లకార్డులు ప్రదర్శించడం.. వంటి పోకడలు ఎప్పుడైనా చూశామా? అని ప్రశ్నించారు. సమాజంలో ఇలాంటి పోకడలు చాలా ప్రమాదకరమని అభిప్రాయపడ్డారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.